మంగళవారం
13•3•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 275
• పేజీలు : 16 + (24/16)

మన రాష్ట్రం • మన పత్రిక

నమస్తే తెలంగాణ

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



సోమవారం అసెంబ్లీలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థి జోగినిపల్లి సంతోష్‌కుమార్. చిత్రంలో మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎంపీ కేశవరావు, చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఉన్నారు.



ఆర్వో వేదాంతం నర్సింహాచార్యులుకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థి బండ ప్రకాశ్. చిత్రంలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మంత్రులు కే తారకరామారావు, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, పద్మారావు కూడా ఉన్నారు.



ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థి బడుగుల లింగయ్యయాదవ్. చిత్రంలో మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్ కూడా ఉన్నారు.

టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు

- అమరవీరులకు నివాళులు
- గన్‌పార్క్ నుంచి అసెంబ్లీకి ర్యాలీ
- ఒక్కొక్కరు రెండు సెట్ల నామినేషన్లు దాఖలు
- కాంగ్రెస్ అభ్యర్థిగా పోరిక బలరాంనాయక్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ రాష్ట్ర సమితి తరపున ముగ్గురు అభ్యర్థులు రాజ్యసభ సభ్యత్వానికి నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం అసెంబ్లీలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ వేదాంతం నర్సింహచార్యులుకు నామినేషన్ పత్రాలను అందజేశారు. జోగినిపల్లి సంతోష్‌కుమార్ నామినేషన్ పత్రాలపై రాష్ట్ర మంత్రులు ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పద్మారావు, చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్, విప్ నల్లాల ఓదేలు తదితరులు సంతకాలు చేశారు. టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, మంత్రి నాయిని నర్సింహారెడ్డి వెంటరాగా సంతోష్‌కుమార్ రిటర్నింగ్ అధికారికి పత్రాలను సమర్పించారు. బండ ప్రకాశ్ నామినేషన్ పత్రాలపై రాష్ట్ర మంత్రులు కే తారకరామారావు, ఇంద్రకరణ్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, ఎంఐఎం సభ్యుడు అక్బరుద్దీన్ సహా పలువురు సభ్యులు సంతకాలు చేశారు. ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రి కేటీఆర్, ఇంద్రకరణ్ రెడ్డి వెంటరాగా ఆయన నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు. బడుగుల లింగయ్యయాదవ్ నామినేషన్ పత్రాలపై మంత్రులు టీ హరీశ్‌రావు, జీ జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, విప్ గొంగిడి సునీత, ఎంఐఎం సభ్యులు బలాల, పాషాఖాద్రి సంతకాలు చేశారు. మంత్రులు టీ హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెంటరాగా ఆయన నామినేషన్లు దాఖలు చేశారు. ఒక్కొక్కరు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్లకు ముందు అభ్యర్థులు గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వరకు ర్యాలీగా వచ్చారు. గన్‌పార్క్ వద్ద అమరవీరులకు నివాళులు అర్పించారు. జై తెలంగాణ, అమరవీరులకు జోహార్లు నినాదాలతో ఆ పరిసర ప్రాంతాలు మారుమోగాయి. డప్పుచప్పుళ్లు, డ్యాన్సులతో కార్యకర్తలు, నాయకులు తమ సంతోషాన్ని వ్యక్తంచేశారు. ర్యాలీలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్ రెడ్డి, టీఎస్‌టీఎస్సీ చైర్మన్ చిరుమళ్ల రాకేశ్, కంటోన్మెంట్ నాయకుడు గజ్జల నగేశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు జన్మదినం సందర్భంగా టీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో ఆయన కేక్‌ను కట్ చేశారు. మంత్రి జోగు రామన్న, టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థి జోగినిపల్లి సంతోష్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణభవన్‌లో సందడి

నామినేషన్లు వేసిన అనంతరం అభ్యర్థి జోగినిపల్లి సంతోష్‌కుమార్ తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఆయనకు పార్టీ కార్యాలయ కార్యదర్శి, ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి స్వాగతం పలికి అభినందించారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఏ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేల్, టీఆర్ఎస్వీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

మరో రెండు నామినేషన్లు

టీఆర్ఎస్ అభ్యర్థులతోపాటుగా మరోఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోరిక బలరాంనాయక్, శ్రమశక్తి పార్టీ అభ్యర్థిగా జాజుల భాస్కర్ నామినేషన్లు సమర్పించారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఎన్నిక అనివార్యమైతే 23న పోలింగ్ జరుగుతుంది.



గన్‌పార్క్ వద్ద అమరవీరులకు నివాళులు అర్పించి జై తెలంగాణ నినాదాలు చేస్తున్న టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థులు సంతోష్‌కుమార్, లింగయ్యయాదవ్, ప్రకాశ్. చిత్రంలో మంత్రి పద్మారావు, ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ తదితరులు కూడా ఉన్నారు.

ఒకే దేశం.. ఒకే చట్టం ఉండదా?

- రిజర్వేషన్ల పెంపు నిర్ణయాధికారం రాష్ట్రాలకు ఇవ్వాల్సిందే
- పార్లమెంటు ఆవరణలో నినదించిన టీఆర్ఎస్ ఎంపీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఒకే దేశం.. ఒకే పన్ను అంటూ జీఎస్టీని తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వానికి రిజర్వేషన్లకు సంబంధించి దేశంలో ఒకే చట్టం ఉండాలనే విషయం పట్టదా? అని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత ఏపీ జితేందర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలనే డిమాండ్‌తో గత కొన్ని రోజులుగా పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేస్తున్న టీఆర్ఎస్ ఎంపీల బృందం సోమవారం కూడా నిరసనను కొనసాగించింది. దేశంలో ఒకే పన్ను ఉండాలని ప్రధాని మోదీ, ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ అనేకసార్లు చెప్పడంతోపాటు జీఎస్టీని అమలులోకి తెచ్చారని జితేందర్‌రెడ్డి గుర్తుచేశారు.

కరీంనగర్‌లో ట్రిపుల్ ఐటీని ఏర్పాటు చేయాలి

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ట్రిపుల్ ఐటీ)ని రాష్ట్రానికి మంజూరు చేసి కరీంనగర్‌లో ఏర్పాటుచేయాలని ఎంపీ వినోద్‌కుమార్ కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కేంద్రానికి లేఖ రాశారు.



సోమవారం పార్లమెంట్ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న టీఆర్ఎస్ ఎంపీలు బీ వినోద్‌కుమార్, కల్వకుంట్ల కవిత, నగేశ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, సీతారాంనాయక్, బీబీ పాటిల్, జితేందర్‌రెడ్డి, పసునూరి దయాకర్



నల్లగొండ జిల్లా చండూరు జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో మునుగోడు ప్రగతి సభలో మాట్లాడుతున్న మంత్రి కే తారకరామారావు. వేదికపై మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, జెడ్పీ చైర్మన్ బాలూ నాయక్



చండూరు మండలకేంద్రంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బాలూ నాయక్ తదితరులు కూడా ఉన్నారు.

కాంగ్రెస్‌కు అభివృద్ధి మనసున పడ్తలేదు

- వారి పరిపాలనతోనే మునుగోడుకు ఫ్లోరోసిస్ పాపం
- భవిష్యత్‌లో ఫ్లోరోసిస్ కనిపించకుండా చేస్తాం
- అభివృద్ధి ఓర్వలేకనే విమర్శలు, భౌతిక దాడులు
- కాంగ్రెస్ చేసిన సిగ్గుమాలిన పనికి జానారెడ్డి ఏం సమాధానం చెప్తరు?
- అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వ పథకాలు
- నల్లగొండ జిల్లా మునుగోడు ప్రగతి సభలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

నల్లగొండ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

'ఇంటింటికీ తాగునీళ్లిచ్చి.. ప్రతి ఎకరాకు సాగు నీళ్లిచ్చి.. కడుపు నిండా కరెంటిచ్చి.. రైతులందరికీ పెట్టుబడిచ్చి అందరినీ ఆదుకునే ప్రయత్నం జేస్తుంటే.. గొర్రెలిచ్చి గొల్ల కుర్మలను, గీత కార్మికుల కోసం చెట్టు పన్ను రద్దు చేసి ఈత, తాటి వనాలు పెడుతుంటే.. ముదిరాజ్, గంగ పుత్రుల కోసం మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వ వైభవం వచ్చి, చేప పిల్లలు పోసి ఎగుమతి చేసే స్థాయికి తీసుకపోతుంటే.. వంద కులాలున్న బీసీల కోసం మొదటిసారి కార్పొరేషన్ పెట్టి వెయ్యి కోట్ల మూల నిధిని సమకూర్చడం కాంగ్రెస్ నాయకులకు మనసున పడుతలేదు' అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు మండిపడ్డారు. విద్యుత్, ఎస్సీ అభివృద్ధి శాఖల మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి సోమవారం నల్లగొండ జిల్లా చండూరులో అమరుల స్తూపం, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలను ఆవిష్కరించడంతో పాటు రూ.3 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రికేటీర్ శంకుస్థాపన చేశారు. అనంతరం చండూరు జడ్పీహెచ్ఎస్ మైదానంలో జరిగిన 'మునుగోడు ప్రగతి సభ'లో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. గతంలో శాసన సభ్యుడిగా కూడా నేను మునుగోడు నియోజకవర్గానికి వచ్చినా అని, ఎస్ లింగోటం, ఖుదాబక్షపల్లి ప్రాంతాల్లో తిరిగిన.. ఫ్లోరోసిస్‌తో వంగిన ఇక్కడి వాళ్ల ఆకృతిని, వాళ్ల కష్టాన్ని చూస్తే మనిషనెటోడి గుండె చలించక మానదన్నారు. మునుగోడు, దేవరకొండ ప్రజలు తమ గుండెను చీల్చి, ఏ నాయకుడు వస్తే వారికి, ఆఖరికి ప్రధాని టేబుల్ మీదికి సైతం ఫ్లోరోసిస్ బాధితుడు స్వామిని చేర్చి వివరించిన దౌర్భాగ్యపు పరిస్థితి ఆనాడు ఉండెనని చెప్పారు. నల్లగొండ జిల్లాకు పట్టిన ఈ శాపం 1956కు ముందు ఏపీలో తెలంగాణ కలవక ముందు లేదనీ, 50ఏండ్ల కాంగ్రెస్ పాలనలో వాళ్ల ఆస్తులు, ఆకృతులతో పాటే ఫ్లోరోసిస్ పెరిగిందన్నారు. మొత్తంగా 2లక్షల మందిని జీవచ్ఛవాలుగా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. 22ఏండ్ల కిందట సిద్ధిపేట ఎమ్మెల్యేగా కేసీఆర్, కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక సిఫారసుతో నిధులు తెచ్చి ఇంటింటికి నీళ్లిచ్చారని గుర్తు చేశారు. అదే విధంగా రాష్ట్రంలో ఏ ఆడబిడ్డ నీళ్ల కోసం రోడ్డెక్కకుండా ఇంటింటికి నీళ్లు ఇస్తాననీ, అలా చేయకుంటే ఓట్లు అడగనని చెప్పిన దమ్మున్న దేశంలో కేసీఆర్ తప్ప ఎవరైనా ఉన్నారా? అని ప్రశ్నించారు. తాగునీటితో పాటే సాగు నీరు తెస్తేనే సంపూర్ణ అభివృద్ధి సాధ్యమనీ, తప్పకుండా శివన్నగూడెం ప్రాజెక్టు పూర్తి చేసి, మునుగోడును మొత్తం సస్యశ్యామలం చేస్తామనీ, ఫ్లోరోసిస్‌ను పుస్తకాల్లో తప్ప భవిష్యత్‌లో కనిపించకుండా చేస్తామని మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు.

నాటికి.. నేటి కాంగ్రెస్ దాడికి పొంతననా?

'ఈ జిల్లాకు చెందిన ఓ పెద్ద మనిషి, గతంలో మంత్రిగా పని చేసిన ఒకాయిన అసెంబ్లీలో మైక్రోఫోన్లు విరగ్గొట్టి కౌన్సిల్ చైర్మన్ కన్నుకు గాయమయ్యేలా, గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడమే కాకుండా సిగ్గులేకుండా దాన్ని సమర్థించుకుంటూ 'మీరు జేయలేదా? తెలంగాణ ఉద్యమంలో..' అని అంటున్నారని మంత్రి కేటీఆర్ అన్నారు. నాటికి.. నేటికి పొంతన ఉందా? అని ప్రశ్నించారు. నాడు నిండు సభలో తెలంగాణకు రూపాయి ఇవ్వన్న సీఎం కిరణ్ మాటలు కాంగ్రెస్ నేతలకు గుర్తు లేవా? జానారెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి సహా ఏ ఒక్కరైనా ఎట్లియ్యవని ప్రశ్నించారా? అని అడిగారు. తెలంగాణలో ఇవాళ రైతాంగానికి కూడా 24గంటల కరెంటు అందుతున్నదనీ, కరెంటు వద్దని రైతులు వినతులిచ్చే పరిస్థితి వచ్చిందన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధికీ కృషి..

అన్ని వర్గాల అభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వమైనా చేనేత కార్మికులకు 50శాతం సబ్సిడీపై నూలు, రసాయనం, అద్దకాలను ఇచ్చిందా? అని అడిగారు. రూ.1200కోట్ల బడ్జెట్‌ను పెట్టి నేత కార్మికుల బతుకులు బాగు చేస్తుంటే, అది కాంగ్రెస్‌నేతలకు నచ్చడం లేదన్నారు.

జానారెడ్డి ఏం సమాధానం చెప్తరు

'ఏ రంగాన్నీ వదిలి పెట్టకుండా అన్నీ ప్రక్షాళన చేస్తుంటే కాంగ్రెస్ నేతలు విమర్శలు, భౌతిక దాడులు చేస్తున్నరు'.. అని కేటీఆర్ అన్నారు. 'అట్ల మాట్లాడ్తరా.. అట్లనా.. ఇట్లనా' అని జానారెడ్డి మాకు నీతులు చెప్తరు.. మరి ఇవాళ ఏమంటవ్? ఇవాళ మీ నాయకులు చేసిన సిగ్గుమాలిన పని చెప్తవా? పార్టీ నుంచి సస్పెండ్ చేస్తవా? ఏం సమాధానం చెప్తరు జానారెడ్డి గారు'? అని మంత్రి ప్రశ్నించారు. 'మేము జేస్తే సంసారం' అన్నట్లు ఉంది వారి తీరని ఘాటుగా స్పందించారు. ప్రాణాలకు ఫణంగా పెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ను నమ్ముదామా? 50ఏండ్లు అధికారమిచ్చినా ఏమీ చేయలేని కాంగ్రెస్ నాయకులను నమ్ముదామా? అనేది ప్రజలు ఆలోచించాలని కోరారు. గట్టుప్పల మండల ఏర్పాటు విషయంలో త్వరలోనే శుభవార్త వింటారన్నారు. దండుమల్కాపురంలో 350ఎకరాల్లో ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామనీ, ఇక్కడి వాళ్లకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. అవసరమైతే ఐటీఐ కూడా ఏర్పాటు చేస్తామని మంత్రి కేటీఆర్ చెప్పారు. మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ఒకనాడు 'తెలంగాణ' అనే పదం ఈ ప్రాంతానికి మాత్రమే పరిమితమైందని.. కేసీఆర్ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంతో దేశమంతా తెలిసిందని చెప్పారు. నేటి, రేపటి తరాల ఆలోచనలకు రూపం అయిన యువ నేత మంత్రి కేటీఆర్ సామర్థ్యంతో ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ పదం మార్మోగుతోందని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీ బూర నర్సయ్య గౌడ్, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, జెడ్పీ చైర్మన్ బాలూ నాయక్, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్ కుమార్, వేముల వీరేశం, పైళ్ల శేఖర్‌రెడ్డి, రవీందర్ కుమార్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేలు, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, నాయకులు కంచర్ల భూపాల్‌రెడ్డి, చాడ కిషన్‌రెడ్డి, జెల్లా మార్కండేయులు, లింగంపల్లి కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లా చండూరు జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో సోమవారం రాత్రి నిర్వహించిన మునుగోడు ప్రగతి సభకు భారీసంఖ్యలో హాజరైన ప్రజలు

ముహూర్తం

సూర్యోదయం: 6.29 గంటలకు

సూర్యాస్తమయం: 6.22 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం ఏకాదశి మధ్యాహ్నం 1.44 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: ఉత్తరాషాఢ మధ్యాహ్నం 12.32 వరకు తదుపరి శ్రవణం, అమృతఘడియలు: తె. 5.21 నుంచి ఉదయం 6.57 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.24 నుంచి 4.53 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.52 నుంచి 9.39 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.24 నుంచి 3.12 వరకు, వర్జ్యం: సాయంత్రం 4.58 నుంచి 6.34 వరకు.

లోకం పోకడ



వ్యవసాయ అభ్యున్నతికి రైతు సమన్వయ సమితి



సోమవారం తెలంగాణ రైతు సమన్వయ సమితి రాష్ట్ర చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుత్తా సుఖేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, పోచారం, తలసాని, నాయిని, మహేందర్‌రెడ్డి, ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత కూడా ఉన్నారు.

- చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుత్తా సుఖేందర్‌రెడ్డి.. ఎవరి మీదో పెత్తనం చేయడం సమన్వయ సమితుల లక్ష్యం కాదు
- వ్యవసాయమంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం
- ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్.. సుఖేందర్‌రెడ్డిని అభినందించిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతు సమన్వయ సమితులు ఎవరి మీదనో పెత్తనం చేయడానికి కాదని, పరస్పర సహకారంతో వ్యవసాయ, అనుబంధ రంగాలను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయనున్నాయని వ్యవసాయ, సహకారశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. రైతు సమన్వయ సమితి చైర్మన్, వ్యవసాయశాఖ మంత్రి.. ఇద్దరూ వ్యవసాయం అనే బండికి రెండుచక్రాలుగా పనిచేసి రాష్ట్ర వ్యవసాయాన్ని ఉన్నతపథంలోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ కమిషనర్ కార్యాలయంలో నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలంగాణ రైతు సమన్వయ సమితి రాష్ట్ర చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డిని డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, రాష్ట్రమంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, ఈటల రాజేందర్, మంత్రి టీ హరీశ్‌రావు, కే తారకరామారావు, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జీ జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పీ మహేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, వ్యవసాయ కమిషనర్ డాక్టర్ ఎం జగన్మోహన్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, 30 జిల్లాల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అభినందించారు.

వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు

వ్యవసాయంలో విప్లవాత్మక సంస్కరణలకు సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పురపాలక, ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. మంత్రి పోచారం అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ.. రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, ఎమ్మెస్ స్వామినాథన్‌తో సహా పలువురు శాస్త్రవేత్తలు చేసిన సిఫార్సుల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించిందన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడంలో రైతు సమన్వయ సమితి ముందుంటుందని రాష్ట్ర చైర్మన్ సుఖేందర్‌రెడ్డి అన్నారు. కీలక బాధ్యతలు అప్పగించినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వవిప్‌లు పాతూరి సుధాకర్‌రెడ్డి, గొంగిడి సునీత, రాజ్యసభ అభ్యర్థి బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, పూల రవీందర్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, వేముల వీరేశం, సుధీర్‌రెడ్డి, రవీంద్రనాయక్, భాస్కర్‌రావు, శంకర్‌నాయక్, సతీశ్‌కుమార్, కార్పొరేషన్ల చైర్మన్లు దేవీప్రసాద్, లోక భూమారెడ్డి, కోటేశ్వర్‌రావు, బండా నరేందర్‌రెడ్డి, రంగారెడ్డి-హైదరాబాద్ పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాంమూర్తియాదవ్, చందర్‌రావు, నోముల నర్సింహయ్య, టీ విజయసింహారెడ్డి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన గ్రామ, మండల, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, సభ్యులు, వ్యవసాయ, మార్కెటింగ్ సిబ్బంది గుత్తాను అభినందించారు.

మంగళవారం
13•3•2018
హైదరాబాద్
• వెల.5 రూ.

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

కాంగ్రెస్ గూండాగిరీ

అసెంబ్లీలో బరితెగించిన జాతీయపార్టీ
ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన నేతలు



రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలిరోజు సోమవారం ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తుండగా టేబుల్‌పైకి ఎక్కి హెడ్‌ఫోన్ విసురుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. (ఇన్‌సెట్) కోమటిరెడ్డి విసిరిన హెడ్‌ఫోన్ తగలడంతో గాయపడ్డ మండలి చైర్మన్ స్వామి గౌడ్

- బస్సుయాత్ర విఫలమవ్వడంతో అసహనం
- గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునేందుకు ఆద్యంతం విఫలయత్నం
- మైకులు విరిచి, హెడ్‌ఫోన్లు ఊడబీకి గవర్నర్‌పైకి విసిరిన కాంగ్రెస్ సభ్యులు
- కోమటిరెడ్డి విసిరిన హెడ్‌ఫోన్ తగిలి మండలి చైర్మన్ స్వామిగౌడ్ కంటికి గాయం
- కార్నియా దెబ్బతిన్నదన్న వైద్యులు
- మార్షల్‌ను నెత్తురొచ్చేలా కొట్టిన పరిగి ఎమ్మెల్యే
- మరికొందరు మార్షల్స్‌కూ గాయాలు
- మద్యం తాగి సభకు వచ్చిన కోమటిరెడ్డి!

గవర్నర్ ప్రసంగపాఠం ప్రతులు చించి, వాటిని ఆయనపైకే విసిరేసింది కొందరు! మైకులు విరగ్గొట్టి, వాటికి ఉన్న హెడ్‌ఫోన్లను ఊడబెరికి.. వాటిని గవర్నర్‌పైకి కసిగా విసిరి అసహనం చాటుకున్నది మరికొందరు! వెల్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్న మార్షల్స్‌ను రక్తం వచ్చేలా కొట్టింది మరొకరు! వెకిలి నవ్వులు.. పిచ్చి చేష్టలు.. వెరసి.. నిండు అసెంబ్లీ సాక్షిగా ప్రజాస్వామ్యం అపహాస్యానికి గురైంది! తెలంగాణ శాసనసభలో మునుపెన్నడూ లేని రీతిలో సాక్షాత్తూ మండలి చైర్మన్ కంటికి గాయమయ్యింది! తమ బస్సుయాత్ర విఫలమైందన్న నిస్పృహ.. ప్రభుత్వం అమలుచేస్తున్న విశేష పథకాలను గవర్నర్ వివరిస్తుంటే వినడానికి మనసురాని ఓర్వలేనితనం.. రానున్న ఎన్నికల్లోనూ తమకు అధికారం దక్కదనే నిరాశ!! ఫలితం.. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలి రోజు.. కాంగ్రెస్ సభ్యుల గూండాగిరీతో బ్లాక్‌డేగా మిగిలింది!

హేయమైన చర్య


ఉద్యమసమయంలో ఘటనకు, ఇప్పటి ఘటనకు దేశభక్తికి, దేశద్రోహానికి ఉన్నంత తేడా ఉన్నది. స్వాతంత్ర్యోద్యమంలో భగత్‌సింగ్ పార్లమెంట్‌పైచేసిన దాడికి, కొన్నేండ్లక్రితం ఉగ్రవాదులు పార్లమెంటుపైచేసిన దాడికి ఉన్న తేడానే అప్పుడూ ఇప్పుడూ ఉన్నది.
- శాసనసభ వ్యవహారాల మంత్రి తన్నీరు హరీశ్‌రావు


కాంగ్రెస్ ఎమ్మెల్యేలది 'చీప్ క్రాష్, కల్చర్‌లెస్ యాక్టివిటీ'. కాంగ్రెస్ ప్రతినిధులు అనాగరికంగా వ్యవహరించటం ప్రజాస్వామ్యం అవుతుందా?
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్


కొందరు కాంగ్రెస్ సభ్యులు మద్యం తాగి వచ్చారు. ఒక సభ్యుడు మత్తుతో తూలి జానారెడ్డిపై పడగా ఆయన సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఇలాంటివారిని మిగిలిన ఏడాదిపాటు సస్పెండ్ చేయాలి.
- శాసనమండలిలో విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

11

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలిరోజు కాంగ్రెస్ శాసనసభ్యులు వీధిరౌడీల్లా వ్యవహరించారు. ఉభయసభల సంయుక్త సమావేశం సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని పరిహసించారు. విచక్షణ మరిచి, గూండాగిరీకి దిగి వీరంగంవేశారు. రాజ్యాంగపరంగా రాష్ట్రంలో అత్యున్నత స్థానంలో ఉన్న గవర్నర్‌పైకి దాడికి తెగబడ్డారు. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ చేసే ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడంతోపాటు ప్రసంగపాఠం ప్రతులను చిత్తుచిత్తుగా చింపి గవర్నర్‌పైకి విసిరేశారు. దీనికి పరాకాష్టగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు పలువురు కాంగ్రెస్ సభ్యులు బెంచీలకు ఉన్న మైకులను విరగ్గొట్టారు. వాటికి ఉన్న హెడ్‌ఫోన్లను ఊడబీకి గవర్నర్ పైకి విసిరారు. కోమటిరెడ్డి నాలుగు హెడ్‌ఫోన్లను గవర్నర్ వైపు కసిగా విసిరారు. అందులో ఒకటి గురితప్పి గవర్నర్ పక్కనే కుడివైపున నిల్చున్న శాసనమండలి చైర్మన్ కే స్వామిగౌడ్ కంటికి తాకడంతో ఆయనకు తీవ్రగాయమైంది. గవర్నర్ ప్రసంగం పూర్తవుతున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత స్వామిగౌడ్‌ను సరోజినీదేవి నేత్రవైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు చికిత్స చేసి, కట్టుకట్టారు. ఆయన కార్నియాకు దెబ్బతగిలిందని వెల్లడించారు.

గవర్నర్ ప్రసంగం ప్రారంభమైన కొద్దిసేపటికే

శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యాయి. గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగం ప్రారంభమైన నిమిషాల వ్యవధిలోనే కాంగ్రెస్ సభ్యులు కొందరు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలుచేస్తూ పోడియం వద్ద గుమిగూడేందుకు ప్రయత్నించారు. తమ సభ్యులందరూ వెల్‌లోకి వెళ్లేలా ఆ పార్టీ ఎమ్మెల్యే, పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రెచ్చగొట్టారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు నినాదాలతో సభలో గందరగోళం సృష్టించారు. ఎమ్మెల్యేలు

➤ మిగతా 12వ పేజీలో

బంగారు తెలంగాణకు బాటలు


ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ నరసింహన్

సమ్మిళితమైన, సుస్థిరమైన దృష్టితో శీఘ్రమైన ఆర్థికవృద్ధి అనేది నా ప్రభుత్వ ప్రాథమిక సిద్ధాంతం. తెలంగాణ రాష్ట్రం మూడున్నరేండ్లలో ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ అనేక రంగాలలో గణనీయమైన పురోగతి సాధించింది. రైతుల పొలాలకు కృష్ణా, గోదావరి జలాలను తీసుకురావడం కోసం ప్రభుత్వం అనేక భారీ, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టింది.
- గవర్నర్ నరసింహన్

- ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తున్న ప్రభుత్వం
- అన్నివర్గాల అభ్యున్నతికి కృషి
- అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ
- దేశానికే రోల్ మోడల్
- 95 శాతం మిషన్ భగీరథ పూర్తి
- రైతుల కోసం 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా
- వందరోజుల్లో భూరికార్డుల ప్రక్షాళన
- వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు 23 సంస్థలతో ఒప్పందం
- ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగం

4

వేటు వేయండి



ముక్తకంఠంతో బీఏసీ డిమాండ్!

కాంగ్రెస్ సభ్యుల తీరు అప్రజాస్వామికం.. చట్టసభలను అగౌరవపర్చేలా ప్రవర్తన
కాంగ్రెస్ వైఖరిని నిరసించిన అన్ని పార్టీలు.. చర్యలపై నేడు స్పీకర్ నిర్ణయం!

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ ప్రసంగించే సమయంలో కాంగ్రెస్ నేతలు ప్రవర్తించిన తీరుపై సభా సలహా మండలి (బీఏసీ) సమావేశంలో అన్ని పక్షాలు అభ్యంతరం వ్యక్తంచేశాయి. దేవాలయం కన్నా గొప్ప స్థలమైన అసెంబ్లీలో అనుచితంగా ప్రవర్తించిన కాంగ్రెస్ సభ్యులను మిగిలిన ఏడాదికాలంపాటు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశాయి. తాను ఈ తరహా చర్యలను సమర్థించబోనని స్పష్టంచేసిన స్పీకర్ మధుసూదనాచారి అసంతృప్తిని వ్యక్తంచేశారు. కాంగ్రెస్ సభ్యులపై చర్యలు తీసుకునే అధికారాన్ని స్పీకర్‌కే బీఏసీ సమావేశం అప్పగించింది. ఈ విషయంలో న్యాయ

➤ మిగతా 12వ పేజీలో

27 వరకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

- 15న ఉభయసభల్లో 2018-19 బడ్జెట్
- 14 వరకు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చ
- 27న సభ ముందుకు ద్రవ్య వినిమయబిల్లు

4



రన్‌వేపై కూలిన విమానం
50 మంది మృతి

నేపాల్ రాజధాని కాఠ్మండూలో ఘోర దుర్ఘటన

5



ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలులో తెలంగాణ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

ఒంగోలులో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

- తెలంగాణలో యాదవులకు రాజ్యసభలో చోటు కల్పించినందుకు హర్షం
- ర్యాలీ నిర్వహించిన యాదవసంఘం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలోని రెండు రాజ్యసభ స్థానాలను బీసీ అభ్యర్థులకు కేటాయించడం ద్వారా తెలంగాణ సీఎం చంద్రశేఖర్ రావు బీసీల అభ్యున్నతికి పాటుపడుతున్నారని ఒంగోలు యాదవ సంఘం హర్షం వ్యక్తంచేసింది. రెండు సీట్లలో ఒకసీటును యాదవ కులానికి కేటాయించి యాదవులకు ఢిల్లీ కేంద్రంగా రాజకీయంగా పునాదులు వేస్తున్నారని కొనియాడింది. ఈ మేరకు సోమవారం ఒంగోలు పట్టణంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి చేతబూని, జెజేలు కొడుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం జేఏసీ నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'సేఫ్ తెలంగాణ'కు అనుగుణంగా పోస్టింగ్

- మహిళా రక్షణ, రోడ్డు సేఫ్టీపై ప్రత్యేక దృష్టి
- పనిలో పారదర్శకత, సమర్థతను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం 'సేఫ్ తెలంగాణ' దిశగా అడుగులు వేస్తున్న విషయం మరోసారి స్పష్టమైంది. సురక్షిత తెలంగాణ అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం పనితీరులో పారదర్శకత, సమర్థత, నిజాయితీ, ప్రజలతో మమేకమై పనిచేసే స్నేహభావం ఉన్న ఐపీఎస్ అధికారులను ఎంపికచేసి పోస్టింగ్ ఇచ్చింది. ఆదివారం భారీస్థాయిలో జరిగిన ఐపీఎస్‌ల బదిలీ, పోస్టింగ్‌ల విషయంలో ప్రభుత్వ నిర్ణయాలే ఇందుకు నిదర్శనం. మహిళా రక్షణ, రోడ్డు భద్రతకు పెద్దపీట వేసింది. షీ టీమ్స్, మహిళా రక్షణ, భరోసా కార్యక్రమాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఐజీకి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించింది. రోడ్డు భద్రతపై కూడా దృష్టి సారించిన ప్రభుత్వం ప్రత్యేకంగా రోడ్డు సేఫ్టీ అథారిటీని ఏర్పాటుచేస్తూ డీజీ స్థాయి అధికారిని నియమించింది.

హైదరాబాద్ పరిస్థితులపై అంజనీకుమార్‌కు పూర్తి అవగాహన

హైదరాబాద్ శాంతిభద్రతల ప్రభావం యావత్ రాష్ట్రంపై ఉంటుంది. హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా పనిచేసిన ఎం మహేందర్‌రెడ్డిని గత నవంబర్‌లో ప్రభుత్వం డీజీపీగా నియమించింది. హైదరాబాద్‌తో అనుబంధం ఉండి అంతే సమర్థుడైన అధికారిని నగర పోలీస్ కమిషనర్‌గా నియమించాలని ప్రభుత్వం అన్వేషించింది. రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డీజీగా పనిచేసిన అంజనీకుమార్ పనితీరు, టీమ్ వర్క్‌ను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఆయనను హైదరాబాద్ కమిషనర్‌గా నియమించింది.

టెక్నాలజీ వినియోగంలో సజ్జనార్ దిట్ట

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సమర్థుడైన ఐపీఎస్ అధికారిగా పేరున్న సజ్జనార్‌ను నియమించారు. టెక్నాలజీ వినియోగం, టెక్నాలజీ సహాయంతో నేరగాళ్లను పట్టుకోవడంతో సజ్జనార్‌కు మంచి గుర్తింపు ఉన్నది. రెండునెలలుగా కొనసాగిన బదిలీల కసరత్తులో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, డీజీపీ మహేందర్‌రెడ్డి, పలువురు సీనియర్ అధికారులు పలుమార్లు సమావేశమయ్యారు. ఒక్కోఅధికారి బదిలీ, పోస్టింగ్‌ల విషయంలో పూర్తిస్థాయిలో చర్చించినట్టు తెలిసింది. గతంలో పది మంది అధికారులను బదిలీ చేసినా విమర్శలు గుప్పుమన్నాయి. ఈసారి పెద్దసంఖ్యలో 38 మంది అధికారులకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఆయా స్థానాలను దృష్టిలో పెట్టుకొని, సమర్థులైన అధికారులకే సీఎం పోస్టింగ్ ఇచ్చారు.





అసెంబ్లీ ఆవాజ్



సోమవారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో శాసనసభ బీఏసీ సమావేశం నిర్వహిస్తున్న స్పీకర్ మధుసూదనాచారి. చిత్రంలో డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు కొప్పుల ఈశ్వర్, జానారెడ్డి, భట్టి విక్రమార్క, కిషన్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, అసదుద్దీన్‌ఒవైసీ తదితరులు

బంగారు తెలంగాణకు బాటలు



- ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తున్న ప్రభుత్వం
- అన్నివర్గాల అభ్యున్నతికి కృషి
- మూడున్నరేండ్లలో అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ దేశానికే రోల్ మోడల్
- 95 శాతం మిషన్ భగీరథ పూర్తి
- రైతుల కోసం 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా
- వందరోజుల్లో భూరికార్డుల ప్రక్షాళన
- వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు 23 సంస్థలతో ఒప్పందం
- ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

సకలజనుల సౌభాగ్యమే లక్ష్యంగా సర్కారు ముందుకు సాగుతున్నదని, సంక్షేమానికి, విద్యకు, వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నదని గవర్నర్ నరసింహన్ అన్నారు. నూతన రాష్ట్రమే అయినప్పటికీ నిత్యనూతనమైన అభివృద్ధితో బంగారు తెలంగాణ దిశగా ఉరకలు వేస్తున్నదని చెప్పారు. సోమవారం బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. ప్రభుత్వ పథకాలు దేశవిదేశాల్లో ప్రశంసలు అందుకొంటున్నాయని, దేశానికే ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ ఎదుగుతున్నదని అన్నారు. ఆయన తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించి తెలుగులో ముగించారు. శాసనసభ చర్చలు మన ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పెంపొందిస్తాయని ఆశిస్తున్నానని అంటూ ప్రసంగాన్ని ముగించారు. అందరూ సుఖ సంతోషాలతో సమృద్ధిగా వర్ధిల్లాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని, ఆధ్యాత్మిక ఉన్నతి అంటే ఏమిటో అందరూ చవిచూడాలని, ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదని ఆకాంక్ష వ్యక్తంచేశారు. 'బంగారు తెలంగాణ' లక్ష్యాన్ని సాధించడానికి విధానాలను రూపొందించడానికి ఈ బడ్జెట్ సమావేశాల్లో సభ్యుల చర్చలు నిర్మాణాత్మకంగా, ఉపయుక్తంగా ఉంటాయని ఆశిస్తున్నానని చెప్పారు. నిరుపేదలంతా గౌరవంగా జీవించేలా ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు. నిరుపేదలకు అత్యంత ఆవశ్యకమైన సామాజిక భద్రతను కల్పించడానికి ఆసరా పింఛన్లు ఇస్తున్నదని, ఈ పథకం కింద 41.78 లక్షల మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. 'సమ్మిళితమైన, సుస్థిరమైన దృష్టితో శీఘ్రమైన ఆర్థికవృద్ధి అనేది నా ప్రభుత్వ ప్రాథమిక సిద్ధాంతం' అని గవర్నర్ నొక్కిచెప్పారు. సమాజంలో ఇప్పటివరకు అణిచివేతకు గురైనవర్గాలకు అభివృద్ధి ఫలాలు ఖచ్చితంగా అందాలన్నారు.తెలంగాణ రాష్ట్రం మూడున్నరేండ్లలో ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ అనేక రంగాలలో గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. రైతుల పొలాలకు కృష్ణా, గోదావరి జలాలను తీసుకురావడం కోసం ప్రభుత్వం అనేక భారీ, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిందని, కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేయడానికి అత్యంత ప్రాధాన్యమిచ్చిందన్నారు. మిషన్‌కాకతీయ కింద చెరువులను పునరుద్ధరించడం, మిషన్ భగీరథ కింద ప్రతి కుటుంబానికి నల్లాద్వారా తాగునీటిని సరఫరా చేయడం, 24 గంటల విద్యుత్ సరఫరా, వెనుకబడిన రంగాల సర్వతోముఖాభివృద్ధికి నిధులు కేటాయింపుల కోసం షెడ్యూల్ కులాల ప్రత్యేకాభివృద్ధి నిధి, షెడ్యూల్ తెగల ప్రత్యేకాభివృద్ధి నిధి చట్టాన్ని చేయడంతోపాటు ఇతర అనేక కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. గవర్నర్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు..

గొర్రెలు, చేపలు, పశువుల పెంపకం

'ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించిన గొర్రెల పంపిణీ పథకం ప్రగతిదాయకంగా ఉంది.75 శాతం సబ్సిడీతో 84లక్షల గొర్రెలను పంపిణీ చేయాలన్న లక్ష్యానికి అనుగుణంగా గొల్ల, కుర్మలకు ఈ ఏడాది ఇప్పటికే 50.10 లక్షల గొర్రెలను పంపిణీ చేశాం. ఈ పథకం ఆయా కులాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడమే కాకుండా మాంసం ఉత్పత్తితో రాష్ట్రం స్వయంసమృద్ధిని సాధించి, గొర్రె మాంసానికి ప్రధాన ఎగుమతిదారుగా రూపొందాలని ఆశిస్తున్నాం. కార్యక్రమం ప్రారంభంలో సంశయాలు ఉన్నప్పటికీ, సాధించిన విజయాలపట్ల సంతృప్తి చెంది సభ దృష్టికి తీసుకువస్తున్నాను. రైతుల భూములకు వివాదాలు లేకుండా చేయడం కోసం ప్రభుత్వం భూమి రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపట్టి వందరోజుల్లో పూర్తిచేసింది.'

పవర్‌హాలిడేను అధిగమించిన నిరంతర విద్యుత్ సరఫరా

'రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితిని మెరుగుపరచడంలో ప్రభుత్వం చిరస్మరణీయమైన పురోగతిని సాధించింది. రాష్ట్రం ఏర్పడేనాటికి విద్యుత్‌రంగం సంక్షోభంలో ఉంది. పరిశ్రమలకు రెండురోజుల పవర్ హాలిడే నుంచి ఎటువంటి కోతలులేని స్థితికి విద్యుత్‌రంగం ప్రస్తుతం మార్పు చెందింది. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నది. తెలంగాణ రాష్ట్ర సౌరవిధానం దేశంలోనే అత్యున్నతమైనదని కొనియాడుతున్న విషయాన్ని మీతో పంచుకోవడానికి సంతోషిస్తున్నాను. తెలంగాణ రాష్ట్రం 3,283 ఎండబ్ల్యూల సౌరవిద్యుత్ ఉత్పత్తి చేస్తూ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది.'

పారిశ్రామిక పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణ

'ప్రభుత్వం టీఎస్‌ఐపాస్ ద్వారా పరిశ్రమలకు ఏకగవాక్ష పద్ధతిలో 15 రోజుల్లో అనుమతి ఇవ్వడానికి పారదర్శకమైన, అవినీతి రహిత, సరళీకృత పారిశ్రామిక విధానాన్ని రూపొందించి అమలు చేస్తున్నది. ఫలితంగా తెలంగాణ రాష్ట్రం పారిశ్రామిక పెట్టుబడులకు గమ్యస్థానంగా మారింది. సులభతర వాణిజ్య విధానంలో రాష్ట్రం దేశంలో మొదటిస్థానాన్ని దక్కించుకున్నది. ప్రభుత్వం చేనేత రంగానికి మరింత ఊతమిస్తూ వరంగల్ వద్ద సమగ్ర మెగా జౌళిపార్కును ఏర్పాటు చేస్తున్నది. మరమగ్గాల నేతకారులు ఎదుర్కొంటున్న దుస్థితిని తొలగించడానికి ప్రభుత్వం వారి రుణాలను మాఫీ చేసింది. 'నేతన్నకు చేయూత' పథకం కింద పొదుపు నిధిలో రాష్ట్ర ప్రభుత్వ వాటాను 8 శాతం నుంచి 16 శాతానికి పెంచింది. నేతపనిలో నిమగ్నమైన వారందరికీ ఈ పథకాన్ని వర్తింప జేసింది. అనేక బహుళజాతి కంపెనీలు ప్రపంచవ్యాప్త కార్యకలాపాల కోసం హైదరాబాద్ నగరాన్ని కేంద్రంగా చేసుకున్నాయన్న విషయం ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుంది. హైదరాబాద్ నగరం వెలుపల ఐటీ రంగాన్ని విస్తరించడానికి ప్రభుత్వం వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి ద్వితీయ శ్రేణి పట్టణాలలో ఐటీ ఇంక్యుబేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.'

95 శాతం మిషన్ భగీరథ పనులు పూర్తి

'గ్రామీణ, పట్టణ కుటుంబాలన్నింటికి సరిపడిన సురక్షితమైన తాగునీటిని సమకూర్చాలనే నిబద్ధతతో ప్రభుత్వం 'మిషన్ భగీరథ' కార్యక్రమాన్ని చేపట్టింది. అనుకున్న సమయం కన్నా ముందుగా 95శాతం పనులు పూర్తికావడం సంతృప్తికరమైన విషయం. ఇప్పటివరకు 5500 పైగా జనావాసాలకు, 13 పట్టణ స్థానిక సంస్థలకు నీటిని సరఫరా చేస్తున్నది. 2500 జనావాసాలకు ఇంటింటికి నీటిని సరఫరా చేస్తున్నది. ఈ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వ ప్రశంసలు అందుకున్నది. తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ వంటి పలురాష్ట్రాల నుంచి అధికారులు వచ్చి పరిశీలించారు. రాష్ట్రంలో జనావాసాలన్నింటికీ రోడ్లను అనుసంధానం చేస్తున్నాం. జిల్లా ప్రధాన కార్యాలయాలతోపాటు మండల ప్రధాన కార్యాలయాలన్నింటికీ రోడ్లను విస్తరిస్తున్నాం. హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు పీపీపీ విధానంలో ప్రపంచంలోనే అతిపెద్ద మెట్రోరైలు ప్రాజెక్టు. ఒకే సమయంలో 30 కిలోమీటర్ల భాగాన్ని ప్రారంభించడం మరో రికార్డు. అత్యంత ఆధునికమైన ప్రజారవాణా విధానం హైదరాబాదును అభివృద్ధిలో తదుపరి స్థాయికి తీసుకువెళుతుందని నేను విశ్వసిస్తున్నాను. మనరాష్ట్రంలో పచ్చదనాన్ని 33 శాతానికి పెంచడమనే లక్ష్యంతో 2017-18 సంవత్సరంలో రాష్ట్రమంతటా దాదాపు 34 కోట్ల మొక్కలను నాటడమైంది. వీటిలో దాదాపు 30 కోట్లకు జియో-ట్యాగింగ్‌ను వర్తింపు చేయడమైంది. పౌరుల ఆరోగ్యస్థితిని మెరుగుపరచడానికి అనేకచర్యలను ప్రారంభించగా, దాని ఫలితాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి. నవజాత శిశువుల, మాతృత్వ మరణాలను తగ్గించడానికి అనేక కార్యక్రమాలను చేపట్టడమైంది. 'కేసీఆర్ కిట్' వల్ల ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు గణనీయంగా పెరిగాయి.

కోటి ఎకరాలకు నీరు ఇవ్వడానికి సిద్ధం

'ప్రభుత్వం కోటి ఎకరాలకు సాగునీటిని ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. కృష్ణా, గోదావరి నదులలో నీటిని వినియోగించుకోవడానికి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలను రూపొందించింది. 23 భారీ సాగునీటి ప్రాజెక్టులు, 13 మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులను ప్రభుత్వం చేపట్టింది. అనేక అడ్డంకులున్నప్పటికీ, పాలమూరు ఎత్తిపోతల పథకం, కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టులకు ప్రభుత్వం రికార్డు సమయంలో అనుమతులన్నీ పొందేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడంలో సఫలీకృతమైంది. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ పనులు పురోగతిలో ఉన్నాయి. చుట్టుపక్కల ప్రాంతాల్లోని భూగర్భ జల మట్టాలలో గణనీయమైన పురోగతి ఉండటం సంతోషించాల్సిన విషయం. కొనసాగుతున్న సాగునీటిప్రాజెక్టులు, చెరువుల పుణరుద్ధరణతో పాటు రైతు మద్దతు పథకాలు వ్యవసాయ రంగానికి ఉజ్వలమైన భవిష్యత్‌ను తెలియజేస్తున్నాయి.'

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం

'రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన క్రియాశీలక విధానాలతో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఆర్థికవ్యవస్థ దశతిరిగి అభివృద్ధిలోకి ప్రవేశించింది. వ్యవసాయ రంగ పునరుద్ధరణకు నా ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నది. వ్యవసాయ, వ్యవసాయేతర కార్యకలాపాలు రెండింటిలో రైతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తూ ఒక సమగ్ర విధానాన్ని ఆవిష్కరించింది. 2018 జనవరి 1వ తేదీ నుంచి 23 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు, ఎత్తిపోతల పథకాలకు నాణ్యమైన నిరంతరాయ విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన రికార్డును సృష్టించింది. రైతుల దుస్థితిని రూపుమాపడానికి విద్యుత్‌రంగంలో దేశంలోనే ఈ గమ్యాన్ని చేరుకున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ.'

సంక్షేమానికి పెద్దపీట

'షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టం-2017 అనే కొత్త చట్టాన్ని అమలు చేసేందుకు ఎస్సీలు, ఎస్టీల సంక్షేమం కోసం అభివృద్ధి కార్యకలాపాలను చేపట్టడానికి మరింత దృష్టిని సారించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న బడుగు, బలహీన,అణగారిన వర్గాల గౌరవం పెంచేలా ప్రభుత్వం పనిచేస్తున్నది. జీవనోపాధి అవకాశాలను మెరుగు పరచడానికి, సంప్రదాయ వృత్తులకు మద్దతు ఇచ్చింది. రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసింది. ప్రజల రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. రాష్ట్ర పోలీస్ వ్యవస్థను ఆధునీకరించేందుకు అనేకచర్యలు చేపట్టింది. ప్రభుత్వానికి విద్యారంగం ప్రాధాన్య అంశంగా ఉన్నది. రాష్ట్రంలో విద్యావ్యవస్థను పటిష్టం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. రిటెన్షన్ రేటును పెంచాలనే ఉద్దేశంతో నాణ్యమైన విద్యను అందించడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ప్రభుత్వం 517 కొత్త రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసింది. తెలుగుభాషను, సాహిత్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం తెలుగుభాష, సాహిత్య వైభవాన్ని చాటింది.'

పనిదినాలు పన్నెండు

- 27 వరకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- 15న ఉభయసభల్లో 2018-19 బడ్జెట్
- బీఏసీ సమావేశాల్లో నిర్ణయాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈనెల 27వ తేదీ వరకు జరుగనున్నాయి. మొత్తం 12 పనిదినాలు సభా సమావేశాలు కొనసాగుతాయి. 2018-19 బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం 15న ఉభయసభల్లో ప్రవేశపెట్టనున్నది. ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ 15న ఉదయం 11గంటలకు అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండగా, కౌన్సిల్‌లో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి లేదా మరో సీనియర్‌మంత్రి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. 20 లేదా 21వ తేదీ నుంచి పద్దులపై చర్చ జరుగుతుంది. 27న ద్రవ్య వినిమయ బిల్లు, ప్రభుత్వ బిల్లులను ఉభయసభల్లో ప్రవేశపెడుతారు. సోమవారం అసెంబ్లీ స్పీకర్ ఎస్ మధుసూదనాచారి అధ్యక్షతన ఆయన చాంబర్‌లో జరిగిన శాసనసభ సంప్రదింపుల సల హా కమిటీ (బీఏసీ)లో ఈ మేర కు నిర్ణయం తీసుకున్నారు. గవర్నర్ ప్రసంగం అనంతరం జరిగిన బీఏసీ సమావేశంలో డిప్యూ టీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి, డిప్యూటీ సీఎంకడియం శ్రీహరి, మంత్రులు టీ హరీశ్ రావు, ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, ప్రతిపక్షపార్టీలకు చెందిన కే జానారెడ్డి, మల్లు భట్టి విక్రమార్క (కాంగ్రెస్), అక్బరుద్దీన్ ఒవైసీ (మజ్లిస్), కిషన్‌రెడ్డి (బీజేపీ), సండ్ర వెంకటవీరయ్య (టీడీపీ), సున్నం రాజయ్య(సీపీఎం), అసెంబ్లీ కార్యదర్శి వేదాంత నరసింహాచార్యులు పాల్గొన్నారు.

శాసనమండలి బీఏసీ..

తెలంగాణ శాసనమండలి బీఏసీ సమావేశం డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ అధ్యక్షతన కౌన్సిల్‌లో జరిగింది. చైర్మన్ కే స్వామిగౌడ్ కంటికి గాయంతో ఆసుపత్రిలో చేరడంతో, ఆయన స్థానంలో డిప్యూటీ చైర్మన్ బీఏసీ సమావేశానికి అధ్యక్షత వహించారు. డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, శాసనసభ వ్యవహారాల మంత్రి టీ హరీశ్ రావు. మండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు బీ వెంకటేశ్వర్లు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రతిపక్షనేత మహ్మద్ షబ్బీర్ అలీ, ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, సయ్యద్ అమీనుల్ జాఫ్రీ(మజ్లిస్), ఎన్‌రామచంద్రరావు(బీజేపీ) పాల్గొన్నారు. సమావేశాల నిర్వహణకు సంబంధించి శాసనసభ బీఏసీలో తీసుకున్న నిర్ణయాల మేరకు ముందుకుసాగాలని నిర్ణయించారు.

ఇది అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల షెడ్యూల్
(12-03-2018 నుంచి 27-03-2018 వరకు)

తేదీ	వారం	అంశం
12	సోమవారం	గవర్నర్ ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
13	మంగళవారం	గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ప్రారంభం
14	బుధవారం	గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రెండోరోజు చర్చ కొనసాగింపు, ప్రభుత్వం సమాధానం
15	గురువారం	బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం
16	శుక్రవారం	సమావేశాలకు సెలవు
17	శనివారం	సమావేశాలకు సెలవు
18	ఆదివారం	సమావేశాలకు సెలవు (ఉగాది)
19	సోమవారం	బడ్జెట్‌పై రెండోరోజు సాధారణ చర్చ, ఆర్థికమంత్రి సమాధానం
20	మంగళవారం	తొలిరోజు పద్దుల ఆమోదానికి ఓటింగ్
21	బుధవారం	రెండోరోజు పద్దుల ఆమోదానికి ఓటింగ్
22	గురువారం	మూడోరోజు పద్దుల ఆమోదానికి ఓటింగ్
23	శుక్రవారం	సప్లిమెంటరీ ఎస్టిమేట్స్ (2017-18)ను ప్రవేశపెట్టనున్న సర్కార్
24	శనివారం	సప్లిమెంటరీ ఎస్టిమేట్స్ (2017-18) పై చర్చ, ఓటింగ్
25	ఆదివారం	బడ్జెట్‌పై చర్చ
26	సోమవారం	సమావేశాలకు సెలవు (శ్రీరామనవమి).
27	మంగళవారం	ద్రవ్య వినిమయ బిల్లు, ప్రభుత్వ బిల్లులను ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం



తెలంగాణ భవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జోగినిపల్లి సంతోష్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.



జోగినిపల్లి సంతోష్‌కుమార్‌కు సోదరి, ఎంపీ కవిత ఆత్మీయ పలకరింపు

రాజ్యసభకు నిస్వార్థ సేవకుడు

ఆది నుంచీ కేసీఆర్ వెన్నంటే జోగినిపల్లి.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో అలుపెరుగని సైనికుడు

పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలులో చురుకైన పాత్ర.. అజాతశత్రువు సంతోష్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఉద్యమనేతగా గులాబీ జెండా ఎత్తిన రోజు నుంచి నేటి వరకు ఆయన వెన్నంటే ఉన్నవ్యక్తి జోగినిపల్లి సంతోష్ కుమార్. చీకటి వెలుగులు, గెలుపు ఓటములతో సంబంధం లేకుండా కేసీఆర్ వెన్నంటి నడిచారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో అలుపెరుగని సైనికుడిగా పనిచేశారు. టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా అందరి మనిషిగా నిలిచారు. కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటూ.. చిరునవ్వుతో అందరినీ పలకరిస్తూ.. చిన్నయినా, పెద్దయినా అందరితో గౌరవంగా మెలిగారు. ఇలా పార్టీ కోసం నిస్వార్థంగా సేవచేస్తున్న సంతోష్ కుమార్‌కు రాజ్యసభ సీటు ఇవ్వడమంటే ఆయనకు సరైన గుర్తింపు ఇచ్చినట్టేనని టీఆర్ఎస్ పార్టీ నేతలంతా ముక్తకంఠంతో పేర్కొంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామంలో 1976 డిసెంబర్ 7న సంతోష్‌కుమార్ జన్మించారు. తండ్రి రవీందర్‌రావు, తల్లి శశికళ. ఆయన ఉన్నత విద్యాభ్యాసమంతా హైదరాబాద్‌లోనే పూర్తయింది. పుణె యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా అందుకున్నారు. పర్సనల్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ చేశారు.

ఆదినుంచీ కేసీఆర్ వెన్నంటే..

ఉద్యమనేత కేసీఆర్ సూచన మేరకు టీఆర్ఎస్ ఆవిర్భావం కంటే ముందునుంచే పార్టీ ఏర్పాటు సన్నాహాలు, జెండా, ఎజెండాల రూపకల్పనలో జోగినిపల్లి సంతోష్‌కుమార్ పాలుపంచుకున్నారు. మృదుస్వభావి, మితభాషి అయిన ఆయన ఉద్యమకాలంలో అధినేత కేసీఆర్ తనకు అప్పగించిన ప్రతి బాధ్యతనూ విజయవంతంగా పూర్తిచేశారు. కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్ష సమయంలో అందరినీ ఏకతాటిపైకి తీసుకురావడంలో తనవంతు పాత్ర పోషించారు. ఉద్యమనేతగా కేసీఆర్ కరీంనగర్ నుంచి ఆమరణ దీక్షకు బయల్దేరుతున్న సమయంలో ఆనాటి పాలకులు ఆయన్ని అరెస్ట్‌చేసి ఖమ్మం జైలుకు తరలించారు. అత్యంత ఉద్వేగభరిత వాతావరణంలోనూ సంతోష్‌కుమార్ చిన్న తొట్రుపాటుకు కూడా అవకాశం ఇవ్వలేదు. అలుగునూరు చౌరస్తా నుంచి ఖమ్మం జైలుకు.. అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించేవరకు అధినేత వెన్నంటే ఉన్నారు. నిమ్స్ దవఖానలో 11 రోజులు అధినాయకుడిని కంటికి రెప్పలా కాపాడుకున్నారు. కేసీఆర్ దీక్ష తర్వాత కేంద్రం దిగివచ్చి తెలంగాణ ప్రకటన చేయడం.. వచ్చిన ప్రకటన వెనుకకు వెళ్లడం తదనంతర పరిణామాలతో ఉద్యమం మళ్లీ ఉవ్వెత్తున ఎగిసిపడింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలన్నింటిలోనూ చురుగ్గా పాల్గొన్నారు. కేసీఆర్ ఏ పిలుపునిచ్చినా దాన్ని విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించారు. బహిరంగసభలు, రాస్తారోకోలు, రైల్‌రోకోలు మొదలుకుని.. పలు ఉపఎన్నికల దాకా.. ఏ కార్యక్రమైనా, ఏ ఎలక్షన్ అయినా క్యాడర్‌నూ.. లీడర్‌ను సమాయత్తం చేసి సమన్వయం చేయడంలో ఆయన పాత్ర మరువలేనిది. ఒక క్రమశిక్షణగల సైనికుడిలా 18 ఏండ్లుగా కేసీఆర్ వెంట నడుస్తున్నారు.

అజాతశత్రువు..

తెరముందు కనపడకపోయినా..అధినేత కేసీఆర్ వ్యూహాలను, సూచనలను తు.చ. తప్పకుండా అమలు చేయడంలో సంతోష్‌కుమార్‌ది భిన్నమైన శైలి. అధినేత వ్యక్తిగత విషయాలతో పాటు పార్టీకి, కార్యకర్తలకు, నేతలకు సమన్వయకర్తగా, అందరికీ తలలో నాలుకలా మెదులుతున్నారు. పార్టీ విషయాలైతే క్యాడర్‌నీ, ప్రభుత్వ కార్యక్రమాలైతే ప్రజలనూ కలుపుకుని ముందుకెళ్లడంలో ఆయన చూపే చొరువ ప్రత్యేకమైనది. ఆయనకున్న సహనం, ఓపిక చూసి పార్టీ శ్రేణులే ఆశ్చర్యపోతాయి. సమస్య ఎంత క్లిష్టమైనా సరే.. ఓపిగ్గా పరిష్కరించి, వినయంగా నిలబడే నిండైన వ్యక్తి, రోజులో 16 నుంచి 18 గంటలు అలిసిపోకుండా పనిచేస్తూ వివాదరహితుడుగా పార్టీలో తనకంటూ మంచిపేరు సంపాదించుకున్నారు. పార్టీలో సీనియర్ నేతల నుంచి కిందిస్థాయి కార్యకర్తల దాకా ఎవరికి ఎలాంటి అవసరం వచ్చినా నేనున్నానంటూ ముందుకొస్తున్నారు. ఉద్యమనేత కేసీఆర్ సూచనల మేరకు ఉద్యమానికి దివిటీగా నిలిచి, తెలంగాణ గుండె చప్పుడు వినిపించిన టీ న్యూస్‌కు ఎండీగా గురుతర బాధ్యతను భుజాలకెత్తుకున్నారు. చానల్ సిబ్బందిని తన సొంత మనుషులుగా భావించి ప్రతీ ఒక్కరినీ చిరునవ్వుతో పలుకరిస్తారు. అటు పార్టీ ప్రధానకార్యదర్శిగా కూడా పార్టీకి అవిశ్రాంతంగా సేవలందిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలుచేయడంలోనూ కీలకపాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా హరితహారం కార్యక్రమాన్ని ఉద్యమంలా అమలు చేశారు. ప్రజాహితం కోసం ప్రభుత్వం చేపడుతున్న అనేక పథకాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయడంలోనూ చురుకైన పాత్ర పోషించారు. సామాజిక సేవలోనూ నేను సైతం అంటూ ముందుకొచ్చారు. టీ న్యూస్ ఎండీగా, టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా, సామాజిక సేవకుడిగా.. ఇప్పుడు రాజ్యసభకు ఎదిగిన సంతోష్‌కుమార్.. అజాతశత్రువు.

హుందాగా పెద్దల సభకు..

ఇంతకాలం నిస్వార్థంగా పార్టీ కోసం పనిచేసిన సంతోష్‌కుమార్ ఇప్పుడు ప్రజానాయకుడిగా పెద్దల సభలో అడుగుపెట్టబోతున్నారు. ఏ పదవీ ఆశించకుండా ఆహోరాత్రులు టీఆర్ఎస్ పార్టీకి సేవ చేసిన సంతోష్ కుమార్‌కు రాజ్యసభ సీటు ఇవ్వడం సముచిత గౌరవమే అని పార్టీ నేతలంతా హర్షం వ్యక్తంచేస్తున్నారు. థర్డ్‌ఫ్రంట్ నెలకొల్పి జాతీయ రాజకీయాలవైపు సీఎం కేసీఆర్ అడుగేస్తున్న తరుణంలో ఢిల్లీలోనూ సంతోష్ కుమార్ అధినేతకు కుడిభుజంగా మారబోతున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు.



సోమవారం ప్రగతిభవన్‌లో జోగినిపల్లి సంతోష్‌కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్

రన్‌వేపై కుప్పకూలిన విమానం

- 50 మంది మృతి.. పలువురికి గాయాలు
- నేపాల్ రాజధాని కాఠ్మండులో దుర్ఘటన



రన్‌వేపై కూలిన విమాన శకలాలను క్రేన్ సాయంతో తొలిగిస్తున్న సహాయ సిబ్బంది

కాఠ్మండు: నేపాల్ రాజధాని కాఠ్మండులో విమానం కూలి 50 మంది మరణించారు. బంగ్లాదేశ్‌కు చెందిన యూఎస్-బంగ్లా ఎయిర్‌లైన్స్ విమానం సోమవారం కాఠ్మండులోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగుతుండగా రన్‌వేపై కుప్పకూలి పక్కనే ఉన్న ఫుట్‌బాల్ మైదానంలో పడింది. ఆ సమయంలో విమానంలో 67 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 50 మంది మరణించినట్టు ఎయిర్‌పోర్ట్ అధికార ప్రతినిధి ప్రేమ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. 43 మంది అక్కడికక్కడే మృతిచెందారని, ఏడుగురు కాఠ్మండు వైద్యవిద్య కళాశాలలో చికిత్స పొందుతూ మృతిచెందారని చెప్పారు. చికిత్స కొనసాగుతున్న వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నదన్నారు. బంగ్లాదేశ్ రాజధాని ఢాకా నుంచి బయలుదేరిన ఈ విమానం కాఠ్మండులో మధ్యాహ్నం 2.20 గంటలకు దిగాల్సి ఉన్నది. రన్‌వేపై దిగుతున్న సమయంలో అదుపుతప్పి కుప్పకూలింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయని, విమానం మొత్తం నల్లని పొగతో నిండిపోయిందని నేపాల్ సివిల్ ఏవియేషన్ అథారిటీ డైరెక్టర్ జనరల్ సంజీవ్ గౌతమ్ పేర్కొన్నారు. నేపాల్ ఆర్మీ, ఎయిర్‌పోర్ట్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారన్నారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలను ఇప్పుడే చెప్పలేమని, అయితే ల్యాండింగ్ సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కుప్పకూలి ఉంటుందని అనుమానిస్తున్నామన్నారు.

నోరు జారినందుకు మంత్రి పదవి ఊడింది!



జమ్ము: కశ్మీర్ సమస్యపై నోరు జారినందుకు ఓ మంత్రి తన పదవిని కోల్పోయారు. ఈ ఘటన జమ్ముకశ్మీర్‌లో జరిగింది. ఆ రాష్ట్ర ఆర్థికమంత్రి హసీబ్‌ద్రబూ శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, కశ్మీర్ అంశం రాజకీయ సమస్య కానేకాదని, 50-70 ఏండ్లుగా దానిని రాజకీయ సమస్యగా చిత్రీకరించారని, అది తప్పని వ్యాఖ్యానించారు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ అంశాన్ని తీవ్రంగా తీసుకున్న సీఎం మెహబూబా ముఫ్తీ.. హసీబ్‌ను తన మంత్రివర్గం నుంచి తప్పించాలని భావిస్తున్నానని గవర్నర్‌కు సోమవారం లేఖ రాశారు. గవర్నర్ సమ్మతించటంతో హసీబ్ మాజీ మంత్రిగా మారిపోయారు. రాష్ట్రంలో పీడీపీ-బీజేపీ కూటమిని ఏర్పాటు చేయటంలో హసీబ్ ముఖ్యపాత్ర పోషించారు.

జయాబచ్చన్ ఒక డ్యాన్సర్!

- బీజేపీలో చేరిన నరేశ్ అగర్వాల్ అనుచిత వ్యాఖ్యలు
- ఖండించిన సుష్మాస్వరాజ్, బీజేపీ నేతలు



బీజేపీలో చేరిన ఎస్పీ మాజీ నేత నరేశ్ అగర్వాల్

న్యూఢిల్లీ: సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ) ముఖ్యనేత, రాజ్యసభ ఎంపీ నరేశ్ అగర్వాల్ సోమవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా 'ఫిల్మీవాలీ.. డ్యాన్సర్' అని ఎంపీ జయాబచ్చన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. జయాబచ్చన్‌తోపాటు అగర్వాల్ ఇప్పటివరకు ఒకే పార్టీవారే. గతంలో వారు ఎస్పీ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. వారి రాజ్యసభ పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్‌లో 2తో ముగియనున్నది. ఈ దఫా ఎస్పీ.. జయకు మళ్లీ అవకాశమిచ్చింది. ఆమె వల్లే తనకు అవకాశం రాలేదని అగర్వాల్ బీజేపీలో చేరారు. బీజేపీలో చేరడంతోనే జయపై అక్కసు వెళ్లగక్కారు. 'సినిమాల్లో పని చేసిన ఒకావిడ వల్ల నాకు అవకాశం పోయింది. ఆమె సినిమాల్లో డ్యాన్సులు చేసేది, నటించేది.. నాకు టిక్కెట్ నిరాకరించారు. అది నాకు నచ్చలేదు' అని అన్నారు. ఆయన వ్యాఖ్యలను విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ తప్పుపట్టారు. 'నరేశ్‌ను మా పార్టీలోకి స్వాగతిస్తున్నా. జయపై ఆయన వ్యాఖ్యలు సముచితమైనవి, ఆమోదయోగ్యం కావు' అని ట్వీట్ చేశారు. అగర్వాల్ వ్యాఖ్యలను బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర ఖండించారు.

అడవుల్లో మంటలు..
9కి చేరిన మృతుల సంఖ్య

- 27 మందిని రక్షించిన వాయుసేన కమెండోలు
- ఒకరి పరిస్థితి విషమం, మరో ఇద్దరికి తీవ్రగాయాలు



దవాఖాన వద్ద విలపిస్తున్న మృతుల బంధువులు

థేని: తమిళనాడులోని థేని జిల్లా కురుగుమలై అడవుల్లో మంటల్లో చిక్కుకుని మరణించిన పర్వతారోహకుల సంఖ్య 9కి చేరిం ది. 27మంది సురక్షితంగా బ యట పడ్డారు. మృతుల్లో ఆరుగురు చెన్నై వాసులు, ముగ్గురు ఈరోడ్ వాసులుగా గుర్తించారు. ఆదివారం పర్వతారోహణకు వెళ్లిన 36మంది బృందం ఒక్కసారిగా చెలరేగిన మంటల్లో చిక్కుకున్నారు. వీరిలో 25 మంది మహిళలు, ముగ్గురు చిన్నారులని థేని జిల్లా కలెక్టర్ పల్లవి బాల్‌దేవ్ తెలిపారు. వారిని రక్షించేందుకు నాలుగు వాయుసేన హెలికాప్టర్లు సహా 10 మంది కమెండోలు రంగంలోకి దిగారు. 'అనునిత్య అనే అమ్మాయికి 90%గాయాలవగా, మరో ఇద్దరు 20 శాతం గాయపడ్డారు' అని కేంద్ర రక్షణ మంత్రి నిర్మల సీతారామన్ ట్వీట్ చేశారు. 9 మంది క్షతగాత్రులకు బోడి ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందిస్తున్నారు.

తీహార్ జైలుకు కార్తీ చిదంబరం

- ఈ నెల 24 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించిన కోర్టు



సీబీఐ కోర్టు వద్ద కార్తీ

న్యూఢిల్లీ: ఐఎన్‌ఎక్స్ మీడియా అవినీతి కేసులో కార్తీ చిదంబరానికి ఢిల్లీ కోర్టు ప్రత్యేక జడ్జి ఈ నెల 24 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించారు. దీంతో ఆయనను ఢిల్లీలోని తీహార్ జైలుకు తరలించనున్నారు. తనకు ప్రత్యేక సెల్‌తోపాటు ఇతర సౌకర్యాలు కల్పించాలన్న కార్తీ విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించింది. పుస్తకాలు, ఇంటి భోజనం, బట్టలు తదితర వస్తువులను తీసుకెళ్లడానికి అంగీకరించని కోర్టు.. జైలు నిబంధనల ప్రకారం ఔషధాలు, కంటి అద్దాలు ఉపయోగించుకోవచ్చని తెలిపింది. నియమ నిబంధనలను అనుసరించి జైలు అధికారులు నిందితుడికి సరైన భద్రత కల్పించాలని ఆదేశించారు.

ఖలీదా జియాకు తాత్కాలిక బెయిల్



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, ప్రతిపక్ష 'బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ' (బీఎన్పీ) అధినేత్రి ఖలీదా జియా (72)కు తాత్కాలిక ఊరట లభించింది. అవినీతి కేసులో శిక్ష అనుభవిస్తున్న ఆమెకు ఢాకా హైకోర్టు నాలుగునెలల బెయిల్ మంజూరు చేసింది. విదేశీ నిధులు దుర్వినియోగంచేసిన కేసులో ఖలీదాకు ఐదేండ్ల జైలు శిక్షను ఢాకా ప్రత్యేకకోర్టు విధించింది. ఫిబ్రవరి 8వ తేదీ నుంచి దాదాపు నెలపాటు జైలు శిక్షను ఖలీదా అనుభవించారు. తర్వాత హైకోర్టును ఆశ్రయించిన ఆమెకు.. నాలుగునెలల బెయిల్‌ను ధర్మాసనం మంజూరుచేసింది.

అన్నదాత మహా విజయం

రైతుల డిమాండ్లకు మహారాష్ట్ర సర్కార్ అంగీకారం

- శాంతియుతంగా సాగిన 'కిసాన్ లాంగ్‌మార్చ్' విరమణ
- రైతులకు ఆత్మీయ స్వాగతం పలికిన ముంబైకర్లు
- భోజనం అందించిన డబ్బావాలాలు

ముంబై, మార్చి 12:



ఆజాద్ మైదాన్‌లో జరిగిన సభలో పాల్గొన్న రైతులు



పాదయాత్రలో కాళ్లగాయాలకు చికిత్స పొందుతున్న రైతులు

రుణ మాఫీ, కనీస మద్దతు ధర వంటి డిమాండ్ల సాధన కోసం అసెంబ్లీని ముట్టడించేందుకు తరలివచ్చిన వేల మంది రైతుల ముందు మహారాష్ట్ర సర్కార్ తలవంచింది. వారి డిమాండ్లన్నీ పరిష్కరిస్తామని లిఖితపూర్వకంగా వాగ్దానం చేసింది. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం రైతుల ప్రతినిధులు ప్రభుత్వంతో జరిపిన చర్చలు విజయవంతమయ్యాయని రాష్ట్ర రెవెన్యూ మంత్రి చంద్రకాంత్ పాటిల్ చెప్పారు. గిరిజనులు సాగుచేసుకుంటున్న అటవీ భూములను వారికే అప్పగించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చర్యలు తీసుకుంటారని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ చెప్పారు. రుణ మాఫీ, పంటకు కనీస మద్దతు ధర పెంపు, పెన్షన్లు, రేషన్ కార్డులు తదితర డిమాండ్ల కోసం అసెంబ్లీని ఘెరావ్ చేసేందుకు వచ్చిన రైతులకు ముంబైకర్లు ఘన స్వాగతం పలికారు. నాసిక్‌లో బయల్దేరి ఆరు రోజులు కాలినడకన 180 కిలోమీటర్లు నడిచి వచ్చిన రైతులు ఆదివారమే ముంబైకి చేరుకున్నారు. వేల మంది రైతులు ఎర్ర జెండాలు చేతపట్టుకొని ఎర్ర టోపీలు ధరించడంతో ఆజాద్ మైదాన్ ఎర్ర సముద్రాన్ని తలపించింది. ఆదివారం రాత్రి సియన్‌లోని సోమయ్య గ్రౌండ్స్‌కు చేరుకున్న అన్నదాతలు సోమవారం వేకువ జామునే ఆజాద్ మైదాన్‌కు వచ్చారు. ఉదయం 11 గంటల సమయంలో అసెంబ్లీ వైపు బయల్దేరాలని తొలుత నిర్ణయించిన రైతులు, పరీక్షలు రాసే విద్యార్థులకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని ర్యాలీని రాత్రికి వాయిదా వేసుకున్నారు. ఈ లోపు వారి వద్దకు ప్రభుత్వం కొందరు ప్రతినిధులను పంపడంతో సమస్య శాంతియుతంగా పరిష్కారమైంది. సీఎం ఫడ్నవీస్ రైతు ప్రతినిధులతో సుమారు రెండుగంటలు చర్చలు జరిపారు. ఈ భేటీకి ప్రతిపక్ష నాయకులను, కొందరు మంత్రులను సైతం అనుమతించలేదు. ఈ చర్చల్లో రైతుల పక్షాన ఏఐకేఎస్ అశోక్ ధావలే, సీపీఎం ఎమ్మెల్యే జీవా పండు గవిట్ పాల్గొన్నారు. రైతులు తిరిగి వారి స్వస్థలాలకు వెళ్లేందుకు సెంట్రల్ రైల్వే ఒక ప్రత్యేక రైలును ఏర్పాటు చేసింది.

డిమాండ్లివే..

తాము తీసుకున్న పంట రుణాలన్నింటినీ బేషరతుగా మాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది కల్పించిన ఆర్థిక ఉపశమన పథకానికి చాలామంది అర్హులు కాలేకపోయారు. దీంతో తమ అసంతృప్తిని ప్రభుత్వానికి తెలియజేయడానికి వారు మండుటెండను సైతం లెక్కచేయకుండా, కాళ్లకు చెప్పులు కూడా లేకుండా తరలివచ్చారు. ఈ ర్యాలీకి నేతృత్వం వహించిన ఆల్ ఇండియా కిసాన్ సభ (ఏఐకేఎస్).. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నది. ఉత్పత్తి ఖర్చును ఒకటిన్నర రెట్లు చెల్లించాలని, రైతుల ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను నిర్దేశించాలని స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసింది. ఈ ర్యాలీలో పాల్గొన్న ఆదివాసీలు, గిరిజన రైతులు కొన్నేండ్లుగా తాము సాగుచేస్తున్న భూములను తమ పేరిట బదిలీ చేయాలని, తమకు లబ్ధి చేకూర్చే అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారులు, బుల్లెట్ రైలు ప్రాజెక్టుల కోసం తమ భూములను బలవంతంగా తీసుకోరాదని రైతులు కోరారు. వడగండ్లు లేదా పత్తి పురుగు బారిన పడిన పంటలకు ఎకరాకు రూ.40 వేలు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. రైతులనుద్దేశించి సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ, రైతులు ఈ దేశ కొత్త సైనికులని, వారు ప్రభుత్వాలను పెకిలించవేయగలరని అన్నారు.

అసెంబ్లీలో చర్చ

రైతులు, గిరిజనుల డిమాండ్ల పట్ల తమ ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారానికి కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత రాధాకృష్ణ విఖేపాటిల్ చర్చను ప్రారంభించారు. రైతులు ముంబై చేరుకున్నాక మంత్రివర్గ కమిటీని ఏర్పాటు చేయటం ఏమిటన్నారు. రైతులు ఎంతో క్రమశిక్షణతో ర్యాలీ నిర్వహించడం అభినందనీయమని ఎన్సీపీ నాయకుడు అజిత్ పవార్ అన్నారు.

ముంబైకర్ల ఆత్మీయ స్వాగతం

మండుటెండలో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ముంబైకి చేరుకున్న రైతులకు నగరవాసులు ఆత్మీయ స్వాగతం పలికారు. వారు అక్కడికి చేరుకోగానే కొందరు భోజన పదార్థాలు, మంచినీరు అందించారు. నగరంలోని కొన్ని జంక్షన్ల వద్ద రైతులకు కొందరు బిస్కెట్లు పంచారు. ముంబైలో ప్రసిద్ధి చెందిన 'డబ్బావాలాలు' నగరవాసుల ఇండ్ల నుంచి భోజన పదార్థాలు సేకరించి రైతులకు తెచ్చి ఇచ్చారు. 'మనకు అన్నాన్ని అందిస్తున్న అన్నదాతలకు సహాయం చేయాలని ముందే నిర్ణయించాం. దాదర్ నుంచి కొలాబా మధ్య పనిచేసే మా సహచరుల (డబ్బావాలాల)ను ఇండ్ల నుంచి భోజనం సేకరించాలని చెప్పాం' అని ముంబై డబ్బావాలా అసోసియేషన్ ప్రతినిధి సుభాష్ తాలేకర్ చెప్పారు. రైతులు సైతం నగరవాసులకు ఎలాంటి ఇబ్బంది కలిగించబోమని, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించబోమని ముందే ప్రకటించారు. వామపక్ష అనుబంధ సంఘమైన కిసాన్ సభ ఆధ్వర్యంలో రైతులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. వారి చేతుల్లో ఎర్ర జెండాలతో రోడ్లు ఎరుపు రంగును సంతరించుకున్నాయి.

రాజకీయ పార్టీల మద్దతు

రైతుల డిమాండ్లకు కాంగ్రెస్, ఎన్సీపీ, మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేనతోపాటు రాష్ట్ర ప్రభుత్వంలో అధికార భాగస్వామిగా ఉన్న శివసేన కూడా మద్దతు తెలిపాయి. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి ఫడ్నవీస్ తమ అహాన్ని పక్కన పెట్టి రైతుల న్యాయమైన డిమాండ్లకు ఆమోదం తెలుపాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ముంబైలో జరిగిన రైతుల భారీ ర్యాలీ 'ప్రజాశక్తి'కి నిదర్శనమని ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు. బీజేపీ యువజన విభాగం అధ్యక్షురాలు పూనమ్ మహాజన్ రైతులనుద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రైతులంటే తనకు గౌరవమని, అయితే వారు ఎర్ర జెండాలు పట్టుకోవడం విచారకరమని అన్నారు. వారి చేతుల్లో ఎర్ర జెండాలున్నా తమ మద్దతు రైతులకేనని శివసేన స్పష్టం చేసింది.

యూపీలో అతిపెద్ద సోలార్ ప్లాంటు

ప్రారంభించిన ప్రధాని మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్





బోటు షికారులో ప్రధాని మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్; (ఇన్‌సెట్‌లో) సోలార్ ప్లాంట్‌ను ప్రారంభించిన మోదీ, మాక్రాన్

దాదర్ కలాన్/ వారణాసి, మార్చి 12: ఉత్తరప్రదేశ్‌లో నెలకొల్పిన అతిపెద్ద సోలార్ విద్యుత్ ప్లాంటును ప్రధాని నరేంద్రమోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన మాక్రాన్‌కు, ఆయన సతీమణి బ్రిగిటేకు తొలుత స్థానిక వైమానిక స్థావరం వద్ద ప్రధాని మోదీ, యూపీ గవర్నర్ రామ్ నాయక్, సీఎం యోగి ఆదిత్యనాథ్ స్వాగతం పలికారు. మీర్జాపూర్ జిల్లాలోని చన్వే బ్లాకులో వింధ్యా పర్వత శ్రేణుల్లో ఉన్న దాదర్ కలాన్ గ్రామంలో ఫ్రాన్స్ సంస్థ ఎన్జీ రూ.500 కోట్ల వ్యయంతో ఈ 75 మెగావాట్ల సోలార్ ప్లాంట్ నిర్మించింది. ఈ ప్లాంటులో ఏడాదికి 15.6 కోట్ల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందనిఅధికారులు తెలిపారు. అంతకుముందు, ప్రధాని మోదీ ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ (ఐఎస్ఏ) వ్యవస్థాపక సభలో మాట్లాడుతూ, విద్యుత్‌రంగంలో కర్బన ఉద్గారాల తగ్గింపునకు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి వాటాను పెంచడానికి సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు రాయితీలతో కూడిన ఆర్థికసాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం భారత్ పునరుత్పాదక ఇంధన సంస్థల స్థాపన ఉత్పత్తి సామర్థ్యం 63 గిగావాట్లు మాత్రమే. సోలార్ విద్యుత్ ఉత్పత్తి వ్యయం తక్కువే ఉంటుంది.

గంగానదిలో మోదీ, మాక్రాన్ పడవ షికారు

మోదీ, మాక్రాన్ సోమవారం వారణాసి వద్ద గంగానదిలో విహరించారు. ప్రత్యేకంగా అలంకరించిన పడవలో ప్రయాణిస్తూ చారిత్రక, సాంస్కృతిక వారసత్వ ఆలయాల నగరమైన వారణాసి అందాలను తిలకించారు. పడవ వద్ద షెహనాయి సంగీతం, పూల జల్లులతో వారికి ఘన స్వాగతం లభించింది. దశాశ్వమేధ్, అసి ఘాట్‌ల మధ్య ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. మాక్రాన్ ఆదివారం తన భార్యతో కలిసి ఆగ్రాలో తాజ్‌మహల్‌ను సందర్శించి అక్కడ కాసేపు గడిపారు.

ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో సోమవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. జిల్లాలోని హకురాలో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారంతో భద్రతాదళాలు ఆదివారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించాయి. వారికి తారసపడ్డ ఉగ్రవాదులపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. వారిలో ఇద్దరిని పోలీసులు గుర్తించారు. శ్రీనగర్‌కు చెందిన ఈసా ఫజ్లి, అనంత్‌నాగ్‌లోని కోకర్‌నాగ్‌కు చెందిన సయ్యద్ ఒవైసిని గుర్తించామని, మరొకరిని నిర్ధారించాల్సి ఉన్నదని పోలీసులు తెలిపారు. ఘటనాస్థలంలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, ఏకే 47 రైఫిల్, పిస్తోల్లను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఎన్‌కౌంటర్‌లో హతమైన ఉగ్రవాదుల్లో ఒకడు ఇటీవల సౌరాలో పోలీస్ శిబిరంపై దాడి చేయడంతో ఓ కానిస్టేబుల్ మృతిచెందారు.

ఆరో రోజు కూడా నిరసనే

వివిధ డిమాండ్లపై కొనసాగిన ప్రతిపక్షాల ఆందోళన

గందరగోళం మధ్యే లోక్‌సభలో 'పరారీలో ఆర్థిక నేరగాళ్లు', 'చిట్‌ఫండ్స్ సవరణ' బిల్లులు



లోక్‌సభలో స్పీకర్ వెల్ వద్ద ప్లకార్డులతో టీఆర్‌ఎస్, టీడీపీ సభ్యులు

న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ మలి విడుత సమావేశాల్లో వరుసగా ఆరో రోజు సోమవారం కూడా ఎటువంటి కార్యకలాపాలు జరుగకుండానే ఉభయసభలు మంగళవారానికి వాయి దా పడ్డాయి. తెలంగాణలో రిజర్వేషన్ల కోటా పెంచాలని టీఆర్‌ఎస్, ఏపీకి ప్రత్యేక హోదా కోసం టీడీపీ, వైసీపీ సభ్యులు పట్టుబట్టారు. ఇతర అంశాలపై అన్నాడీఎంకే, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు ప్లకార్డులతో నిరసనకు దిగారు. ఈ గందరగోళం మధ్యే ఆర్థికశాఖ సహాయ మంత్రి శివ్ ప్రతా ప్ శుక్లా లోక్‌సభలో 'పరారీలో ఆర్థిక నేరగాళ్ల బిల్లు – 2018', చిట్‌ఫండ్స్ (సవరణ) బిల్లు – 2018ని ప్రవేశపెట్టారు. మరోవైపు రాజ్యసభలో చైర్మన్ వెంకయ్యనాయుడు జీరో అవర్ నిర్వహణ కోసం సభ్యులకు నచ్చజెప్పేందుకు విఫలయత్నం చేశారు. కానీ గందరగోళం కొనసాగడంతో సభను మంగళవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభకు కేంద్రమంత్రుల నామినేషన్లు


లక్నో/ పాట్నా/ అహ్మదాబాద్: ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, న్యాయశాఖమంత్రి రవిశంకర్ ప్రసాద్ సహా పలువురు కేంద్రమంత్రులు ఈ నెల 23న జరుగనున్న రాజ్యసభ ఎన్నికల కోసం వివిధ రాష్ట్రాల నుంచి నామినేషన్లు దాఖలు చేశారు. జైట్లీ ఈసారి ఉత్తర్‌ప్రదేశ్ నుంచి పోటీ చేస్తున్నారు. ఆయనతోపాటు 11 మంది బీజేపీ నేతలు యూపీ నుంచి నామినేషన్లు వేశారు. న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ మరోసారి సొంతరాష్ట్రం బీహార్ నుంచి, పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మధ్యప్రదేశ్ నుంచి పోటీలో దిగుతున్నారు. సామాజిక న్యాయశాఖ మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్ మధ్యప్రదేశ్ నుంచి, మంత్రులు పురుషోత్తం రూపాలా, మన్సుఖ్ మాండవీయ గుజరాత్ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా ఉన్న అభిషేక్ మనుసింఘ్వీ టీఎంసీ మద్దతుతో పశ్చిమబెంగాల్ నుంచి రాజ్యసభ బరిలోకి దిగారు.

'2జీ' కేసు దర్యాప్తును ఆరు నెలల్లో పూర్తి చేయాలి

సీబీఐ, ఈడీలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: 2జీ స్పెక్ట్రం కేటాయింపులు, ఎయిర్‌సెల్ – మాక్సిస్ ఒప్పందానికి విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎఫ్ఐపీబీ) ఆమోదంలో అవకతవకలపై నమో దైన కేసుల దర్యాప్తును ఆరు నెలల్లో పూర్తి చేయాలని సీబీఐ, ఈడీలను సుప్రీంకోర్టు ఆదేశించింది. వచ్చే ఆరు నెలల్లో వీటి దర్యాప్తు పూర్తి కాకపోతే విచారణలో పాల్గొనే అధికారులందరిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

0.38 సెకండ్లలోనే రూబిక్స్ క్యూబ్‌కు పరిష్కారం



బోస్టన్: రూబిక్స్ క్యూబ్ తెలుసుగా.. ఒకే రంగు గడులు ఒకేవైపునకు వచ్చేలా తిప్పాలి. దీన్ని కొందరు సెకండ్లలో పరిష్కరిస్తే మరికొందరికి రోజులు ప్రయత్నించినా సాధ్యం కాదు. కానీ ఓ రోబో మాత్రం కంటిరెప్ప కొట్టే లోపే క్యూబ్‌ను పరిష్కరిస్తూ ఆశ్చర్యం కలిగిస్తున్నది. అమెరికాలోని మసాచూసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థి బెన్ కాట్జ్, సాఫ్ట్‌వేర్ డెవలపర్ జరెడ్ డి కార్లో కలిసి ఈ రోబోను రూపొందించారు. ఇది కేవలం 0.38 సెకండ్లలోనే క్యూబ్‌ను పరిష్కరించింది. ఈ వీడియోను వారు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇది గిన్నిస్ రికార్డుగా నమోదయ్యే అవకాశం ఉన్నదని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జర్మనీకి చెందిన ఆల్బర్ట్ బీర్ రూపొందించిన సబ్1 రీలోడెడ్ అనే రోబో పేరుమీద గిన్నిస్ రికార్డు నమోదై ఉన్నది. ఈ రోబో 0.63 సెకండ్లలో క్యూబ్‌ను పరిష్కరించింది.

ఆన్‌లైన్ నకిలీలపై ఉక్కుపాదం!

మోసాలను అడ్డుకునేందుకు ప్రత్యేక యంత్రాంగం

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ విక్రయసంస్థల మోసాలను అరికట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ఆన్‌లైన్ సంస్థలు ఒకవేళ నకిలీ వస్తువులు పంపిస్తే సదరు వస్తువులను పొందిన వినియోగదారు తగిన నష్టపరిహారం పొందేందుకు వీలుగా పకడ్బందీ యంత్రాంగాన్ని రూపొందించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సోమవారం ఒక అధికారి వెల్లడించారు. ఈ యంత్రాంగాన్ని క్యాష్ బ్యాక్ వ్యవస్థగా పిలువవచ్చునన్నారు. ఈ కామర్స్ కంపెనీలు, పారిశ్రామిక ప్రోత్సాహక విభాగం(డీఐపీపీ), వినియోగ వ్యవహారాల మంత్రిత్వశాఖల మధ్య ఈ అంశంపై చర్చలు ముమ్మరంగా జరుగుతున్నాయని చెప్పారు. దేశీయ మార్కెట్లో నకిలీ ఉత్పత్తుల విక్రయాలు జరుగకుండా చూడాలని, ఈ లక్ష్యం కోసం ఈ అంశంపై పలువురు భాగస్వాములతో సంప్రదింపులు జరుపాల్సిన అవసరం ఉన్నదని ఆయన వివరించారు.

పాక్ సెనేటర్‌గా కృష్ణకుమారి ప్రమాణం



ప్రమాణ స్వీకారానికి సంప్రదాయ దుస్తుల్లో వచ్చిన కృష్ణకుమారి

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో సెనేటర్‌గా హిందూ దళిత మహిళ కృష్ణకుమారి కోల్హి (39) సోమవారం ప్రమాణం చేశారు. సెనేట్‌కు ఎన్నికైన 51 మంది సభ్యులతో కలిసి ప్రమాణం చేశారు. ఆమెతో ప్రిసైడింగ్ ఆఫీసర్ సర్దార్ యాకూబ్ ఖాన్ నాసర్ ప్రమాణం చేయించారు. పాక్ సెనేట్‌కు ఎన్నికైన తొలి హిందూ దళిత మహిళగా కోల్హి చరిత్ర సృష్టించారు. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) తరపున సింధ్ ప్రావిన్స్ నుంచి సెనేటర్‌గా గెలుపొందారు.



ముంబైలో నిరసన తెలుపుతున్న రైతులు కమ్యూనిస్టు పార్టీల జెండాలు పట్టుకోవడం నాకు బాధ కలిగించింది. ఇది రాజకీయం కాదని నేను అనుకుంటున్నా. భవిష్యత్తులో రైతులు రాజకీయ ఎజెండాలను ఉపయోగించకూడదు.


పూనమ్ మహాజన్, బీజేపీ నేత

రైతుల విలువ మీకు ఎన్నికల సమయంలోనే తెలుస్తుంది. రాష్ట్రంలో ఇప్పటికీ రైతుల ఆత్మహత్యలు ఆగలేదు. రేపు ప్రభుత్వం కొన్ని వాగ్దానాలు చేయడానికి ప్రయత్నించవచ్చు. కానీ ఈ ప్రభుత్వమే బికారి. కాబట్టి అది మీకు ఏమి అందిస్తుంది?

రాజ్ ఠాక్రే, ఎంఎన్ఎస్ అధినేత



చరిత్రలో నేడు



1781

యురేనస్ గ్రహాన్ని కనుగొన్న విలియం హెర్షల్.

1957



క్యూబా రాజధాని హవానాలో బటిస్టా వ్యతిరేక ప్రదర్శన అనంతరం హింసాత్మక పోరాటాలు.



1985

మాస్కోలో సోవియట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొన్‌స్టాన్‌టిన్ చెర్నెంకో అంత్యక్రియలు.

ఇది మన దేశానికి అతి బలహీనమైన సమయం. ప్రజాస్వామ్య వ్యవస్థలకు ప్రమాదం లోపలి నుంచే ఏర్పడుతున్నది. వాషింగ్టన్‌లో, పలు రాష్ట్రాలలో ఏమవుతున్నదో భయం గొలుపుతున్నది. మీరు వీధుల్లోకి వచ్చి నిరసన తెలుపుతారు. సమావేశాలు జరుపుకొని మీ ప్రతినిధి ఏమి చేయాలో డిమాండ్లు పెడుతరు. సోషల్ మీడియాలో గోలగోల చేస్తారు. కానీ మీరు ఎన్నికలలో ఓటు వేయనంతకాలం ఇవేమీ పనిచేయవు. ఓటు వేయకపోవడం కూడా నిరసనే అని అంటారు. కానీ మీరు ఈ విధంగా చేయడం వల్ల ఓటు వేయవద్దని కోరుకునే వారి చేతిలో అధికారం పెడుతున్నారు.

ది న్యూయార్క్ టైమ్స్

చైనా ప్రతినిధుల సభ రాజ్యాంగ మార్పులను ఆమోదించింది. వీటిలో చైనా అధ్యక్షుడి పదవి పరిమితులను ఎత్తివేయడం ఒకటి. చైనా నిర్ణయాల్లో తలదూర్చడం కొందరు పాశ్చాత్యులకు అలవాటు. రాజ్యాంగ మార్పు చైనా అంతరంగిక విషయమని కొందరు అంటున్నారు. కొందరు మాత్రం చైనా రాజ్యాంగ మార్పులను పాశ్చాత్య రాజకీయ వ్యవస్థలతో పోలుస్తున్నారు. కానీ చైనా సంస్కరణలకు సంబంధించి తీవ్రమైన సవాళ్ళను ఎదుర్కొంటున్నది. దీనికి అనుగుణంగా రాజ్యాంగాన్ని సవరించవలసిన అవసరం ఏర్పడింది.

గ్లోబల్ టైమ్స్

ఫ్రాన్స్‌తో దోస్తీ

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యూల్ మాక్రాన్ నాలుగు రోజుల భారత పర్యటన రెండుదేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసింది. వ్యాపారవేత్తలు, అధికారులతో కూడిన భారీ పరివారంతో వచ్చిన మాక్రాన్‌కు ప్రధాని మోదీ తన సహజశైలిలో గాఢాలింగనంతో స్వాగతం పలికినప్పుడే, ఈ మైత్రి ఎంత పటిష్టమైనదో తెలిసిపోయింది. మాక్రాన్ ఈ పర్యటనలో 16 బిలియన్ డాలర్ల మేర 14 ఒప్పందాలు కుదుర్చుకున్నారు. రక్షణరంగం, భద్రత, అణు ఇంధనం మొదలైన భిన్న రంగాల్లో ఈ ఒప్పందాలు కుదిరాయి. బ్రిటన్‌తో ఉన్న చారిత్రక సంబంధాలను మినహాయిస్తే, ఒక పశ్చిమ యూరోపియన్ దేశంతో ఇంత బలమైన అనుబంధం మరే దేశంతో కూడా ఏర్పడి ఉండదు. సాధారణంగా యూరోపియన్ సమాజాలు భారత్‌ను సహజ మిత్రదేశంగా భావిస్తుంటాయి. ఇక్కడి ఉదారవాద ప్రజాస్వామిక వ్యవస్థ, లౌకిక స్వభావం వల్ల సాన్నిహిత్యం పెంచుకోవడం తేలిక. రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాలను పెంచాలని ఇరువురు నాయకులు భావిస్తున్నారు. భారతీయ విద్యార్థులు యూరప్‌లో ప్రవేశించడానికి తమ దేశం వచ్చి చదువుకోవలసిందిగా చదువుకోవచ్చని మాక్రాన్ ఈ సందర్భంగా ఆహ్వానించారు. విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలు, అంతరిక్షం మొదలైన రంగాలలో విస్తృతంగా సంబంధాలు నెలకొల్పుకోవాలనే భావన రెండు దేశాల్లో ఏర్పడ్డది. యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలిగిన తర్వాత, ఈయూను ఫ్రాన్స్– జర్మనీ కూటమి ముందుండి నడిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యానికి భారత్ ప్రాధాన్యమిస్తున్నది.

అణు విద్యుత్ ఉత్పత్తిలో ఫ్రాన్స్ ప్రపంచంలోనే గణనీయమైనది. ఈ దేశ ఇంధన అవసరాలలో నలభై శాతం అణు విద్యుత్ ద్వారానే తీరుతుంది. గృహావసరాలకు విద్యుత్‌ను అతి చౌకగా అందించే దేశంగా ఫ్రాన్స్ పేరు తెచ్చుకున్నది. అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటులో ఫ్రాన్స్ అనుభవం, పాటవం కాదనలేనిది. కానీ ఇటీవలి కాలంలో అణు విద్యుత్ కేంద్రాలు ప్రమాదకరమనే స్పృహ పెరిగింది. జర్మనీ వంటి దేశాలు క్రమంగా అణు విద్యుత్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకుంటున్నాయి. అందువల్ల భారత్ వంటి వర్ధమాన దేశాలు అణు విద్యుత్‌పై మొగ్గుచూపడం మంచిదా అనే ప్రశ్న తలెత్తుతున్నది.

భారత్ చుట్టూరా దేశాల్లో చైనా పాగా వేయడం, హిందు మహాసముద్రంలో పోటాపోటీగా ఉండటం వల్ల భారత్ ఫ్రాన్స్‌తో సైనిక వసతుల ఉపయోగంపై ఒప్పందం కుదుర్చుకున్నది. ఇప్పటికే అమెరికాతో ఉన్న అవగాహనకు అదనంగా ఫ్రాన్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందం భద్రతారీత్యా కీలకమైంది. భారత్, ఫ్రాన్స్ ఒప్పందం ప్రకారం– ఒక దేశ సైనిక వసతులను మరోదేశం ఉపయోగించుకోవచ్చు. ఇందులో భాగంగా నావికావసతులను యుద్ధ నౌకలు వాడుకోవచ్చు. హిందు మహా సముద్ర ప్రాంతంలో ఫ్రాన్స్‌కు రెండు దీవుల్లో స్థావరాలు ఉన్నాయి. ఇవి భారత్‌కు అందుబాటులోకి వస్తాయి. దీంతోపాటు భారత వసతులు ఫ్రాన్స్‌కు ఉపయోగపడుతయి. ఇటీవల మాల్దీవులలో సంక్షోభం ఏర్పడటం, చైనా తమ నౌకలను అక్కడికి పంపి, భారత్‌కు పరోక్ష హెచ్చరికలు చేయడం గమనార్హం. హిందు మహాసముద్రం మొదలుకొని పసిఫిక్ ప్రాంతం వరకు చైనాకు పోటీగా భారత్‌కు మద్దతు ఇవ్వాలనేది ఫ్రాన్స్ విధానం. మాక్రాన్ పర్యటన సందర్భంగా ఇంధన రంగంలో సహకారం కూడా చర్చకు వచ్చింది. అంతర్జాతీయ సౌరకూటమి వార్షిక సమావేశంలో మాక్రాన్ ప్రసంగించారు. భవిష్యత్తులో సౌరవిద్యుత్ కీలక భూమిక పోషిస్తున్న నేపథ్యంలో భారత్, ఫ్రాన్స్ గతేడాది పలు దేశాలను కలుపుకొని ఈ కూటమి ఏర్పాటుచేశాయి. వాతావరణ మార్పులను అరికట్టాలనే లక్ష్యంతో కుదిరిన ప్యారిస్ ఒడంబడిక నుంచి అమెరికా వైదొలిగిన తర్వాత, పర్యావరణ పరిరక్షణ విషయమై భారత్, ఫ్రాన్స్ ఉమ్మడిగా కృషి చేస్తున్నా యి. ఈ నేపథ్యంలో సౌరకూటమి ఏర్పాటు కీలకమైనది. భూమధ్య రేఖకు కర్కటకరేఖకు మధ్య ఉండి సూర్యతాపం అధికంగా పొందే దేశాల్లో ఒకటైన భారత్ భవిష్యత్తులో సౌర విద్యుత్ ద్వారా లబ్ధి పొందవచ్చు. అందువల్ల ఈ రంగంలో భాగస్వామ్యం భారత్‌కు ఉపయోగపడుతున్నది. సౌర విద్యుత్‌ను మరింత లాభదాయకంగా ఉత్పత్తి చేయడం, నిలువ చేసుకోవడం కోసం మరిన్ని పరిశోధనలకు రెండు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది.

సౌర విద్యుత్ రంగంలో ఫ్రాన్స్‌తో భాగస్వామ్యం వరకు ఇబ్బంది లేనప్పటికీ, అణు విద్యుత్ కేంద్రం విషయంలోనే వివాదం ఉన్నది. ఫ్రాన్స్ సహకారంతో మహారాష్ట్రలోని జైతాపూర్‌లో నిర్మించతలపెట్టిన అణు విద్యుత్ కేంద్రం ప్రపంచంలోనే పెద్దది అవుతుంది. అణు విద్యుత్ ఉత్పత్తిలో ఫ్రాన్స్ ప్రపంచంలోనే గణనీయమైనది. ఈ దేశ ఇంధన అవసరాలలో నలభై శాతం అణు విద్యుత్ ద్వారానే తీరుతుంది. గృహావసరాలకు విద్యుత్‌ను అతి చౌకగా అందించే దేశంగా ఫ్రాన్స్ పేరు తెచ్చుకున్నది. అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటులో ఫ్రాన్స్ అనుభవం, పాటవం కాదనలేనిది. కానీ ఇటీవలి కాలంలో అణు విద్యుత్ కేంద్రాలు ప్రమాదకరమనే స్పృహ పెరిగింది. జర్మనీ వంటి దేశాలు క్రమంగా అణు విద్యుత్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకుంటున్నాయి. అందువల్ల భారత్ వంటి వర్ధమాన దేశాలు అణు విద్యుత్‌పై మొగ్గు చూపడం మంచిదా అనే ప్రశ్న తలెత్తుతున్నది. రాఫెల్ ఒప్పందం విషయంలో అవినీతి చోటు చేసుకుందని మోదీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఒప్పందాన్ని పొడిగించడం సబబు కాదు. మొదట అంగీకరించిన 36 రాఫెల్ జెట్స్ పొందిన తర్వాత, తదుపరి దఫా 36 జెట్స్‌కు కూడా భారత్ అంగీకరించిందని, అయితే ఈ విషయం బయటకుచెప్పడం లేదని– మాక్రాన్ మాటలు, మోదీ మౌనాన్ని బట్టి తెలుస్తున్నది. కేంద్రం ఈ విషయంలో పాదర్శకంగా వ్యవహరించడం మంచిది.

జనగళం

సుప్రీం తీర్పు మంచిదే!

ఎలాంటి అసమానతలు లేకుండా జీవించడానికి అందరూ సమానమే. దీని స్ఫూర్తితో రాజ్యాంగం ద్వారా మనకు హక్కులు కల్పించి వాటిని ఎవరైనా ఉల్లంఘిస్తే తగిన శిక్షలు విధిస్తూ వస్తున్నది. నేడు అత్యున్నత న్యాయస్థానం పరోక్ష కారుణ్య హత్యలపై ఇచ్చిన తీర్పు ఆహ్వానించదగినది.

మనిషి ఎంత గౌరవంగా బతుకుతాడో తన మరణం కూడా అంతే గౌరవంగా ఉండాలని కోరుకుంటాడు. దీంట్లో తప్పులేదు. దాన్ని గ్రహించిన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సరైనదే. కానీ చట్టం చేసేటప్పుడు మాత్రం కఠినమైన విధివిధానాలను పొందుపర్చాలి. లేకపోతే దుర్మార్గులు అమాయకులను చంపే మార్గాల్లో ఇది కూడా ఒకటిగా ఉండిపోయే ప్రమాదం పొంచి ఉన్నది.

మన శరీరానికి నయంకాని జబ్బువచ్చి ఇంకా మనం అందులో నుంచి కోలుకోవడం జరుగదని తెలిసీ, చలనంలేని శరీరంతో బతుకడం కన్నా మరణం కోరుకోవడంలో తప్పులేదు. అది ఆ వ్యక్తి సొంత నిర్ణయం అయితే అంగీకరించవచ్చు. కానీ కుటుంబ సభ్యులు ఆస్తి కోసమో, భారమైనారనో సాకులు చెప్పి ఇలాంటి వాటిని వాడుకునే ప్రమాదం కూడా లేకపోలేదు. కాబట్టి అత్యున్నత సభ దీనిపై సుదీర్ఘంగా చర్చించి సరైన చట్టం చేయాలి.

ఎవరైనా ఈ కారుణ్య హత్యలను సాకుగా తీసుకొని కుటిలమైన పనులు చేస్తే మాత్రం వారిని కఠినంగా శిక్షించాలి. ఏదేమైనా కొన్నిదేశాల్లో ఇప్పటికే అమల్లో ఉన్న ఈ కారుణ్య హత్యలపై అనుమతి మన దేశంలో కూడా రావడం సబబే. కానీ ఇది కేవలం అనారోగ్యంగా ఉన్న వారి సొంత నిర్ణయమై ఉండాలి. నిర్జీవంగా బతుకడం కన్నా మరణమే శరణం అనే వారి అభిప్రాయాన్ని గౌరవించాలి.

- విరాజిత (నిజాగ్ని), సామాజిక విశ్లేషకురాలు

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

విశ్లేషణ



ప్రొఫెసర్ కనకదుర్గ దంటు

దేశాన్ని నడుపగలిగే పాలనాదక్షుడు

భారతదేశంలో కనిపించే వైవిధ్యం బహుశా ఇంకో దేశంలో లేదు. మతాలు, వాటివల్ల వైవిధ్యం అన్నిదేశాల్లో ఉన్నది. ఒకటి కంటే ఎక్కువ భాషలు అన్ని దేశాల్లో ఉన్నాయి. కానీ భారతదేశంలో కనిపించే మతాలు, కులాలు, భాషలు, సంస్కృతిలో వైవిధ్యం చాలా ఎక్కువ. ఈ దేశం బయటివారి దండయాత్రలు, పాలన వచ్చేవరకు శతాబ్దాల పాటు చిన్నచిన్న దేశాలుగా ఉండి వివిధ వంశాల రాజుల చేత పరిపాలించబడినది. విదేశీయులు రాక ముందే ఇప్పుడున్న భాషలన్నీ సంపూర్ణత చెంది, తమ తమ సాహిత్య సౌరభాలతో విలసిల్లాయి. వివిధ దేశాల, ప్రాంతాల సంస్కృతి భిన్నంగా పెరిగింది.

ఆచార వ్యవహారాలు ప్రతి ప్రాంతానికీ స్థిరపడిపోయాయి. అందుకే మతాల మధ్య సంస్కృతుల్లో అంతరాలే కాకుండా, రాష్ట్రాల మధ్య, రాష్ట్రాలలోని ప్రాంతాల మధ్య, ఒకే ప్రాంతంలో కూడా వివిధ కులాల మధ్య, వివిధ భాషలు మాట్లాడేవారి మధ్య వైవిధ్యం కనిపిస్తుంది. మరి ఇంత వైవిధ్యభరితమైన దేశాన్ని సరిగ్గా పాలించాలంటే, సరైన దశ–దిశ ఇవ్వాలంటే ఎటువంటి నాయకుడు ఉండాలి? రాజ్యాంగం ప్రకారం దేశ ప్రధాని చేతిలోనే పాలనా పగ్గాలుంటాయి. అంటే ప్రధానికి ఈ దేశ వైవిధ్యం గురించిన అవగాహన, సమస్యలను అర్థం చేసుకునే సామర్థ్యం ఉండాలి. వాటికి పరిష్కారాలు కనుక్కోగలిగిన మేధ, వాటిని అమలుచేసే ధైర్యం ఉండాలి. ముఖ్యంగా ఏ పని ఎందుకు చేస్తున్నారో ప్రజలకు వివరించగలిగిన నిజాయితీ ఉండాలి. ఈ గుణాలు, నైపుణ్యా లు, సమర్థతలకు తోడు విశాలత్వం, వినమ్రత, ప్రజల కష్టాల పట్ల సహానుభూతి ఉండాలి.

ఇంత వైవిధ్యం, ఇన్ని అంతరాలు ఉన్న ఈ దేశానికి ఒకే పంథాలో, పట్టు విడుపు లేకుండా స్థిరమైన వారి సొంత సిద్ధాంతాలు పాటించే రాజకీయపార్టీ పనికి వస్తుందా? ఈ దేశాన్ని పాలించగలదా? ఐదవ వంతు హిందూయేతరులు నివసించే ఈ దేశంలో సాంకేతికతను, శాస్త్రీయ దృక్పథాన్ని పక్కనపెట్టి సెంటిమెంటలిజం పెంచుతూ, ఒక మతాన్ని రెచ్చగొట్టేవారు ఈ దేశానికి మంచి చేయగలరా? బీజేపీ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి సామాన్య ప్రజలకు శాంతిసౌఖ్యాలు పెరిగాయా? పోనీ వారిని సమర్థిస్తున్న హిందువులకు ఒరిగిందేమిటి?

దేశంలో ఉన్న వైవిధ్యాన్ని ప్రధాని మోదీ అర్థం చేసుకోలేదన్న సంగతి చాలా సందర్భాల్లో రుజువైంది. 70 ఏండ్ల నుంచి ఉన్నట్టే ఉత్తర భారతీయ ప్రధానికి దక్షిణ భారతీయ సంస్కృతి, సమస్యలు కాలేదని తెలుస్తున్నది. తెలంగాణ ఏర్పాటును ఆయన 'తల్లిని చంపి పిల్లను తీశారని' అనడం ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను అవమానించడమే. వారి పోరాటాన్ని హీనపరుచడమే! అన్ని రాష్ట్రాలను సమంగా చూడవలసిన ప్రధా ని లక్షణాలు ఇవేనా? పైగా రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల అంగీకారంతో చేయవలసిన 7 మండలాలు ఆంధ్రాలో విలీనం చేయవలసిన పనిని తెలంగాణ రాష్ట్రాన్ని సంప్రదించకుండా చేయడం ప్రధాని కుంచిత బుద్ధికి నిదర్శనం కాదా? ఊరికే మాటలు చెప్పి ఎన్నికలు గెలిస్తే సరిపోదు. వచ్చిన అవకాశం ఉపయోగించుకుని ప్రజలకు నిజమైన ప్రగతి చూపిస్తే మళ్లీ గెలిచే అవకాశం ఉంటుంది. నిజానికి వాజపేయిని దేశమంతా మంచి, గొప్ప రాజకీయ నాయకుడి గా గుర్తించింది కానీ అఖం డ మెజార్టీ సంపాదించిన మోదీ మాత్రం ఆ ఆదరణ పొందలేకపోయాడు.

వైవిధ్యభరితమైన దేశానికి బీజేపీ అనుసరిస్తున్న సంకుచిత సిద్ధాంతాలు సరిపోవని రుజువైంది. ఇక అత్యధిక సంవత్సరాలు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ దేశాన్ని ప్రగతిపథంలోకి తీసుకెళ్ళటంలో ఘోరంగా విఫలమైంది. దేశంలో అవినీతి, బంధుప్రీతి పెచ్చుపెరిగి, సామాన్యుడి జీవితం దుర్భరమైపోయింది. జాతీయపార్టీగా వారు కూడా దక్షిణాది రాష్ట్రాలను పట్టించుకోలేదు. ముఖ్యంగా 2004లో రాష్ట్ర ఏర్పాటును ఒప్పుకొని ఎన్నికలు గెలిచాక తెలంగాణను మోసం చేసింది. ఈ ప్రాంత కష్టాలు, నష్టాలు ఆ పార్టీకి అర్థమే కాలేదు. ఈ అర్ధ శతాబ్దంలో పార్టీలుగా కాంగ్రెస్ కానీ, బీజేపీ గానీ దక్షిణాది రాష్ట్రాలను సరిగా అర్థం చేసుకున్నదీ లేదు, సహాయం చేసిందీ లేదు.

ఇక మూడో జాతీయ పార్టీ కమ్యూనిస్టు పార్టీ. మతం గురించి అధికంగా మాట్లాడే బీజేపీ ఎందుకు విఫలమౌతుందో, కమ్యూనిస్టు పార్టీలు కూడా అటువంటి కారణానికే భారతదేశాన్ని పాలించలేరు. ఈ దేశం సంప్రదాయిక దేశం. వేల సంవత్సరాల నుంచి పాటిస్తున్న ఆచారాలు, నమ్మకాలు ప్రజలు త్వరగా ఒదులుకోలేరు. వీరు ఈ సంస్కృతిలో ఉన్న శాస్త్రీయ అంశాలను కూడా మూఢ నమ్మకాలని తాము నమ్మటమే కాకుండా జనాలను కూడా నమ్మించాలని చూస్తారు. ఇండియా లాంటి ప్రాచీన నాగరికత కలిగిన దేశంలో కమ్యూనిస్టులు ఇప్పుడే కాదు, ఇంకా వెయ్యేండ్లకు కూడా ప్రజాదరణ, గౌరవం పొందలేరు. మరి భారతదేశానికి ఎటువంటి పాలన కావాలి? ఎటువంటి నాయకుడు కావాలి?

ఒక గొప్ప కవి ఈ రకంగా రాశాడు 'యూనిటి షుడ్ నాట్ బి మిస్టేకన్ ఫర్ యూనిఫామిటీ' అంటే ఏకత్వం సాధించాలంటే ఒకేలా ఉండాలని అర్థం కాదు. వైవిధ్యాలు, వైరుధ్యాలు మరిచి ఒకే దేశంలా ఉండటం. వ్యత్యాసాలను గౌరవించటం. వివిధ మతాలు, కులాలు, జాతుల వారు సామాజికంగా కలిసిమెలిసి ఉండటం. బీజేపీ సిద్ధాంతంలాగా అందరూ హిందులవడం, ఈ దేశాన్ని హిందూ దేశంగా మార్చడమూ కాదు; కమ్యూనిస్టులు బోధించేవిధంగా అన్నీ వదులుకోవటమూ కాదు. ఎవరికి నచ్చినట్టు వారు బతుకుతూ మిగతావారిని గౌరవించటం, అభిమానించటం. నిజానికి ఈ సామాజిక సంతులత ఒకే ఒక్క రాష్ట్రంలో కనిపిస్తున్నది ప్రస్తుతం. అదే తెలంగాణ రాష్ట్రం. ముఖ్యమంత్రికి ఈ వైవిధ్యాలను గౌరవించటం తెలుసు.


ఒక మేధావి, ఎన్నికలు గెలువగలిగిన రాజకీయ నాయకుడు, సాహిత్యవేత్త, పండితుడు, కార్యకర్త, ప్రజ్ఞ కలిగిన వక్త-ఇవన్నీ కలిగిన ఒక నాయకుడు ఉండటం సాధ్యం అన్నది ఇప్పుడే దేశం గమనిస్తున్నది. దేశానికి పనికిరాని జాతీయ పార్టీలు, కేంద్రీయ పాలన మారి కేసీఆర్ లాంటి నాయకుడు సారథ్యం వహిస్తే ఒక్క దశాబ్దంలో భారతదేశం ప్రపంచ పటంలోనే నెంబర్ వన్‌గా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

1776లో స్వాతంత్ర్యం పొందింది అమెరికా. అందరూ బ్రిటిష్ విద్యావిధానంలో చదువుకొని, ఇంగ్లీష్‌ను మాతృభాషగా అంగీకరించినా, తమ, తమ వ్యత్యాసాలను గమనించి, ప్రజాస్వామ్యం పూర్తిగా అమలుకావాలన్న తపన తోటి దేశానికి ఒక సమాఖ్య విధానం ఏర్పర్చుకున్నారు. నిజానికి వారందరూ సొంత సంస్కృతిని, భాషలను వదిలేసి, ఇంగ్లీషును మాతృభాషగా అంగీకరించిన వారు. కానీ తమ తమ రాష్ట్రాలు స్వతంత్రంగా వ్యవహరించాలని ఆశించి తగినట్టు రాజ్యాంగాన్ని రూపొందించుకున్నారు. మరి రెండు రాష్ట్రాల భాషలు కూడా ఒకటి కాని మన దేశంలో ఏం చేయాలి? ఉత్తర భారత సంస్కృతి దక్షిణ భారత సంస్కృతి వేరు. మళ్లీ ఈశాన్య రాష్ట్రాల సంస్కృతి దీనికి భిన్నం. ప్రతి ప్రాంతంలో ఒక్కో రాష్ట్రానికి ఒక్కో భాష. ప్రతి రాష్ట్రంలో వివిధ మతాల, కుల నిష్పత్తి చాలా వ్యత్యాసంగా ఉండటం, ఇన్నిరకాల వైవిధ్యాలతో ఉన్న దేశానికి అన్నీ తన అధీనంలో పెట్టుకునే కేంద్ర ప్రభుత్వం అవసరమా? ప్రాంతీయ అంశాలు అర్థంచేసుకోలేని జాతీయ పార్టీలు న్యాయం చేస్తాయా? అన్ని వనరులతో పాటు మానవవనరులు కూడా పుష్కలంగా ఉండి, 45 శాతం యువశక్తి ఉన్న భారతదేశం ఏ వనరు లేని అతి చిన్న దేశాలైన మలేషియా, సింగపూర్, జపాన్ వంటి దేశాల కంటే ఎందుకు వెనుకబడి ఉండాలి? రాష్ట్రాలు స్వయం ప్రతిపత్తి కలిగి ఉంటే పోటీగా ఒకదాని కంటే ఇంకొకటి బాగుపడుతుంది కదా! మరి పనికిరా ని, పనిచెయ్యలేని ఈ జాతీయపార్టీలు దేశానికి అవసరమా? భారతదేశం నిజంగా ప్రగతి చెందాలంటే, ఈ కేంద్రీకరణ సిద్ధాంతాలు పనికిరావు. వికేంద్రీకరణ జరుగాలంటే అవి ఈ జాతీయ పార్టీలు చేయవు. వచ్చే ఎన్నికలలో ప్రాంతీయ పార్టీలు అఖండ మెజార్టీ సంపాదించి, వారిలోవారు సయోధ్య సాధించి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. పార్లమెంటులో బిల్లు పెట్టి రాజ్యాంగాన్ని ఫెడరల్ సిస్టంలోకి మార్చాలి. రాష్ట్రాలకు తగినంత స్వాతంత్ర్యాన్ని కల్పించాలి. సైన్యం, విదేశాంగ విధానాల వంటివి మొత్తం దేశానికి సంబంధించినవి. కాబట్టి అవి మాత్రం కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉండాలి. పరస్పర పోటీలతో రాష్ట్రా లు తమతమ వనరులు పూర్తిగా ఉపయోగించుకొని స్వయం సమృద్ధి సాధించాలి. సామాజిక సంతులత పొందాలి.

ఇదంతా జరుగాలంటే కేసీఆర్ లాంటి రాజనీతిజ్ఞుడి వలననే సాధ్యమౌతుంది. సమస్యల అవగాహన, పరిష్కారాల సాధన, వాటిని అమలులో స్థైర్యం, ప్రజల సేవకుడిగా వినమ్రత, వ్యత్యాసాలు గౌరవించే సంస్కారం, మానవ కల్పిత సమస్యలకు మానవ మేధే పరిష్కారాలు చూపాలనే పట్టుదల, ఏదైనా పని మొదలుపెడితే దానిని సాధించే పట్టుదల, సమర్థత, ఇతరుల ప్రజ్ఞాపాటవాలు గుర్తించి వారిని సరైన విధంగా ఉపయోగించుకునే తెలివితేటలు, ముఖ్యంగా మానవులందరూ సంతోషంగా బతుకాలనే కాంక్ష.. ఇన్ని విశేష లక్షణాలు కలిగిన విలక్షణ నాయకుడు నేటి భారతీయ రాజకీయరంగంలో ఉన్నది కేసీఆర్ ఒక్కరే. ఒక మేధావి, ఎన్నికలు గెలువగలిగిన రాజకీయ నాయకుడు, సాహిత్యవేత్త, పండితుడు, కార్యకర్త, ప్రజ్ఞ కలిగిన వక్త–ఇవన్నీ కలిగిన ఒక నాయకుడు ఉండటం సాధ్యం అన్నది ఇప్పుడే దేశం గమనిస్తున్నది. దేశానికి పనికిరాని జాతీయపార్టీలు, కేంద్రీయ పాలన మారి కేసీఆర్ లాంటి నాయకుడు సారథ్యం వహిస్తే ఒక్క దశాబ్దంలో భారతదేశం ప్రపంచపటంలోనే నెంబర్ వన్‌గా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

ఆర్థికశక్తిగా తెలంగాణ

ఆర్థికం



మ్యాడం మధుసూదన్

సకల వనరులు కలిగిన భారతదేశంలో దరిద్రమెట్లుందో నాయనా.. అని ఓ కవి ప్రశ్నించాడు. వనరులున్నా దాన్ని సమర్థంగా ఉపయోగించుకొని దరిద్రాన్ని పారదోలే దృఢచిత్తం, దూరదృష్టి పాలకుల్లో ఉంటే సంపద పెరుగుతుంది. ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడుతాయి. ఆర్థికవృద్ధితో సమాజం పురోగమిస్తుంది. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత సరిగ్గా అదే జరిగింది. అరువై ఏండ్ల పాటు పేదరికం, నిర్లక్ష్యం నీడన మగ్గిన రాష్ట్రాన్ని ఆర్థికంగా పటిష్టపరిచి ధనిక రాష్ట్రంగా తీర్చిదిద్దింది టీఆర్ఎస్ సర్కార్. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి దేశానికే నమూనాగా మారింది. ఇందుకు 'బ్యూరో ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్' గణాంకాలే నిదర్శనం. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ) ప్రజల తలసరి ఆదాయం జాతీయ సగటును మించి ఆర్థికవేత్తల అంచనాకు అందనివిధంగా పెరిగింది. ఒకవైపు రాష్ట్ర సంపద పెరిగేలా చర్యలు తీసుకుంటూనే మరోవైపు సొంత పన్నుల రాబడిని పెంచుతూ ప్రభుత్వం ఆర్థిక పథంలో వేగంగా దూసుకుపోతున్నది. ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న పైసాపైసాకు పక్కా లెక్కచూస్తూ ఆదాయ, వ్యయాల్లో సమతుల్యత పాటించింది. రాష్ట్రం నలుదిశలా అన్నిరంగాల అభివృద్ధి కార్యక్రమాలు, భారీ ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలతో రాష్ట్రం దశ,దిశను మార్చింది. మొత్తంగా ఉమ్మడి రాష్ట్రంలో తిరోగమనంలో ఉన్న ఆర్థిక వ్యవ స్థ ముఖచిత్రమే మారిపోయింది. మూడేండ్లలోనే దేశంలోనే 'ది బెస్ట్ ఎకనామిక్ స్టేట్'గా అవతరించింది. రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత పూర్తిస్థాయి చివరి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి ఈటల ఈ నెల 15న శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఈసారి కూడా రెవెన్యూ మిగులు రాష్ట్రంగా రికార్డుకెక్కనున్నది. 2017–18లో సుమారు లక్షా 50 వేల కోట్లుగా ఉన్న వార్షిక బడ్జెట్ వచ్చే ఆర్థిక సంవత్సరానికి భారీ సైజులో ఉంటుందని సమాచారం. ఈ క్రమంలో రాష్ట్ర సొంత రాబడులు మరోసారి భారీగా పెరుగడం, వృద్ధిరేటు చోటుచే సుకోవడం, జీఎస్‌డీపీతో పాటు తలసరి ఆదాయం పెరుగడం వార్షిక బడ్జెట్‌కు మరింత ఊపునిస్తున్నది. సుస్థిరమైన పరిపాలనా, నిర్దిష్ట ప్రణాళికలు, పారదర్శక విధానాలు, శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల పనులు రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నాయి. పెద్దనోట్ల రద్దు, ఆర్థిక సంవత్సరం ఆరంభంలో కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టంలో గందరగోళం వంటి ఎన్నో ప్రతికూల పరిణామాలను ఎదుర్కొని రాష్ట్రం రాబడులను పెంచుకోవడంలో స్థిరమైన వృద్ధిని సాధించింది. కొత్త రాష్ట్రంగా కేంద్రం నుంచి సహకారం లేకపోయినా, రావాల్సిన సాయం అందకపోయినా సొంతరాబడుల్లో వరుసగా 19 శాతం వృద్ధిరేటును సాధించి తన ఆర్థిక సత్తాను చాటుకున్నది. గత నాలుగేండ్లుగా పన్నుల వాటా, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు, సీఎస్‌టీ నష్ట పరిహారం ఇతర గ్రాంట్లు మొత్తం కలిపి రూ.81వేల కోట్లు మాత్రమే అందినా సొంత బలంతోనే ఆర్థిక చక్రాలను పరుగులెత్తించడంతో సీఎం కేసీఆర్ సఫలమయ్యారు. బెస్ట్ ఎకనామీ స్టేట్‌గా దేశంలోనే ప్రముఖ స్థానం కల్పించగలిగారు.

బ్యూరో ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ ప్రాథమిక లెక్కల ప్రకారం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఈసారి కూడా అత్యంత పటిష్టంగా ఉన్నది. వాస్తవానికి గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (స్థూల రాష్ట్రీయ జాతీయోత్పత్తి)ని ఒక రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి ప్రధాన సూచికగా పరిగణిస్తారు. తలసరి ఆదాయాన్ని ప్రజల జీవన ప్రమాణాలకు ప్రామాణికంగా తీసుకుంటారు. ఈ రెండింటిలోనూ తెలంగాణ దేశ సగటునుదాటి అనూహ్యమైన వృద్ధిని సాధించింది. ఉమ్మడి రాష్ట్రంలో 2013–14లో స్థూల రాష్ట్రీయ జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ) స్థిర ధరల వద్ద 4.2 శాతంగా మాత్రమే ఉంది. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014–15లో అది కాస్త ఏకంగా 8.6 శాతానికి పెరుగడం విశేషం. 15–16లో 9.5 శాతానికి పెరిగింది. జీఎస్‌డీపీ వృద్ధి 2016–17లో స్థిర ధరల వద్ద 10.1శాతానికి పెరుగుతుందని బ్యూరో ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ అంచనా వేసింది. ఇదే సమయంలో జాతీయ జీడీపీ 7.1 శాతం వరకు మాత్రమే ఉంటుందని అంచనా. రాష్ట్రంలో ప్రభుత్వం గుర్తించిన రంగాల్లో ఒక నిర్దిష్టమైన సమయంలో ఉత్పత్తయిన వస్తువులు, సేవల మార్కెట్ విలువను జీఎస్‌డీపీగా పరిగణిస్తారు. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి 2015–16లో 5,75,631 రూపాయలు కాగా 16–17లో అది కాస్త 6,54,294కు పెరిగింది. 17–18లో అది 7.3లక్షల కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. ప్రాథమిక అంచనాల ప్రకారం జీఎస్‌డీపీ 10 శాతం వరకు చేరినట్లు సమాచారం. రాష్ట్ర స్థూల ఆర్థిక పరిస్థితి చాలావేగంగా అభివృద్ధి చెందుతున్నది.

అవినీతికి, జాప్యానికి ఏ మాత్రం ఆస్కారం లేకుండా పూర్తిగా పారదర్శక విధానం ద్వారా పరిశ్రమలకు అనుమతులు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది. విశ్వవ్యాప్తంగా ఉన్న ప్రముఖ కంపెనీలు తెలంగాణ వైపు పరుగులు తీశాయి.

ఉమ్మడి రాష్ట్రంలో 4.2 శాతంగా ఉన్న స్థూల రాష్ట్రీయ జాతీయోత్పత్తి (గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్) తెలంగాణ ఆవిర్భవించిన మూడేండ్లలోనే 9 శాతానికి చేరింది. ఉమ్మడి రాష్ట్రంలో దేశ జీడీపీ జాతీయ సగటు 6 శాతం కాగా రాష్ట్ర జీడీపి 4.2 శాతంగా మాత్రమే ఉండేది. కానీ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. జాతీయ జీడీపీ సగటును మించి జీఎస్‌డీపీ సగటు వృద్ధి 9.5శాతం దాటింది. ఇందులో పరిశ్రమల ద్వారా 22 శాతం, సేవారంగాల ద్వారా 63 శాతం, వ్యవసాయం ద్వారా 15 శాతం వాటా ఉంది. ఈ సారి వ్యవసాయరంగం జీఎస్‌డీపీ వాటా మరింత పెంచడానికి ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలను తీసుకుంటున్నది. రైతులకు పంట రుణమాఫీని పూర్తిచేసిన ప్రభుత్వం ఈ సారి నుంచి పంటల పెట్టుబడి సాయం కింద ప్రతీ పంటకు ఎకరానికి రూ.4 వేలను ఆర్థిక సాయాన్ని అం దించాలని నిర్ణయించింది. దేశం లో ఎక్కడా లేనివిధంగా కాళేశ్వరంతో పాటు దాదాపు 40 భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి. వీటి ద్వారా కోటి ఎకరాలకు సమృద్ధిగా నీరంది పంటల ఉత్పత్తులు బాగా పెరి గే అవకాశం ఏర్పడింది. తద్వారా వ్యవసాయ జీడీపీ 25 శాతం వరకు పెరుగవచ్చని అంచనా.

ఉమ్మడి రాష్ట్రంలో 2012–13 బడ్జెట్ మొత్తం 1,61,731 కోట్లు కాగా కేవలం తెలంగాణలో బడ్జెట్ లక్షా 50 వేల కోట్లకు చేరింది. రెవెన్యూ రాబడులు లక్షా 16 వేల కోట్లు కాగా తెలంగాణలో లక్షా 13 వేల కోట్లకు చేరింది. తలసరి ఆదాయంలో 11.5 వృద్ధి ఉంది. అదే సమయంలో జాతీయ తలసరి ఆదాయం 9.5 శాతంగా ఉంది. జాతీయ సగటు తలసరి ఆదా యం రూ.1,03,219లు ఉండగా, తెలంగాణ ప్రజల తలసరి వార్షిక ఆదా యం రూ.1,58,360 ఉంది. వాస్తవానికి 2015–16లో జాతీయ తలసరి ఆదాయం రూ.94,130గా అంటే దేశంలో (7.4) శాతంగా ఉంది. ప్రస్తుత ధరల ప్రకారం 2016–17లో జాతీయ తలసరి ఆదాయం 9.7 శాతంగా ఉంటుందని అంచనా వేశారు. ఇదే సమయంలో తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,40,683 నుంచి రూ.1,58,360లుగా ఉన్నది జాతీయస్థాయిలో తలసరి వార్షిక ఆదాయం 1,03,219 కంటే తెలంగా ణ తలసరి ఆదాయం రూ.52,393లుగా ఉంది. జాతీయస్థాయిలో వార్షి క తలసరి ఆదాయ వృద్ధి 2013–14లో 11.6శాతం ఉండగా 2016–17లో అది 10.2 శాతానికి తగ్గింది. కానీ ఇదే సమయంలో తెలంగాణ తలసరి ఆదాయం 11.2 శాతం నుంచి 12.6 శాతానికి పెరుగడం విశేషం.

రాష్ట్ర ప్రభుత్వ విధానాలు తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ (టీఎస్–ఐపాస్) దేశ పారిశ్రామిక రంగంలోనే విప్లవాత్మక మార్పును తెచ్చింది. అవినీతికి, జాప్యానికి ఏ మాత్రం ఆస్కారం లేకుండా పూర్తిగా పారదర్శక విధానం ద్వారా పరిశ్రమలకు అనుమతులు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది. విశ్వవ్యాప్తంగా ఉన్న ప్రముఖ కంపెనీలు తెలంగాణ వైపు పరుగులు తీశాయి. అన్నివిధాలుగా జరిగిన, జరుగుతున్న అభివృద్ధితో రాష్ట్ర సంపద భారీగా పెరుగుతున్నది.

(వ్యాసకర్త: నమస్తే తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



చేపలమ్మిన చోటే సంపాదన..!

వీళ్లు ముగ్గురు మార్పునకు మారుపేరు. ఎందుకంటే చేపలు పట్టి, అమ్మినచోటే టూరిస్టులకు గైడ్‌గా మారి.. నెలకు వేలల్లో సంపాదిస్తున్నారు. చీదరించుకున్న చోటనే గౌరవంగా బతుకుతున్నారు.

మహారాష్ట్రలోని సముద్రతీర ప్రాంతమైన సింధుదుర్గ్ జిల్లాలోని వెంగుర్లకు చెందిన ఈ ముగ్గురు మహిళా మత్స్యకారులు తమ విధిరాతను మార్చుకున్నారు. ప్రియాంక ధబోల్కర్, గౌతమి, జాహ్నవి అనే ఈ ముగ్గురు టూరిస్ట్‌గైడ్‌లుగా కొత్త జీవితాన్ని ప్రారంభించారు. గతంలో వీళ్లు సముద్రంలో వేటకు వెళ్లి భర్తలు తెచ్చిన చేపలను వెంగుర్లలో అమ్మేవారు. ఒక్కోసారి వీరు మగవారితో పాటు చేపల వేటకు వెళ్లడంతో సముద్రతీరం, పర్యాటక ప్రాంతాలు, సముద్రపు ఆహారంపై పూర్తిగా అవగాహన కలిగింది. దీంతో 'మాంగ్రోవ్ సఫారీ' పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేసి గైడ్‌లుగా మారారు. అప్పటి నుంచి టూరిస్టులను మంచి పర్యాటక ప్రాంతాలకు తిప్పుతున్నారు. నాలుగు నెల్లలో రూ.70వేలు సంపాదించి.. అందర్నీ ముక్కున వేలేసునేలా చేశారు. అలా చేపలు అమ్మినచోటనే గౌరవంగా బతుకుతున్నారు.

బాల్య వివాహాలపై పోరాటం!

ఈ యువతి పోరాటం అనన్యసామాన్యం. ఈమె పోరాటంలో న్యాయం ఉన్నది.. ఈ ఆధునికయుగంలో కూడా మూఢాచారాలను పాటిస్తున్న సమాజంలో మార్పు రావాలన్న తపన ఉన్నది.

బంగ్లాదేశ్‌లోని మౌల్వీబజార్ జిల్లాలోని ములైరా గ్రామానికి చెందిన ఈ యువతి పేరు మోని బేగం. 17 యేండ్ల మోని తమ దేశంలో బాల్యవివాహాలను అడ్డుకొనేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నది. ఎందుకంటే తన కళ్ల ఎదుటే ఎంతోమంది బాలికలు సంసార సాగరం ఈదలేక అష్టకష్టాలుపడుతున్నారు. ఆ బాధితుల్లో తన అక్క, స్నేహితులు కూడా ఉండడంతో 13వ యేట నుంచే బాల్యవివాహాలపై పోరాటం చేస్తున్నది. బాలికలను దొంగతనంగా పెండ్లి చేసుకుంటున్న వారి వివరాలు సేకరించి అధికారులకు అందజేస్తున్నది. పెండ్లి చేసుకునేటప్పుడు వధూవరులిద్దరూ కచ్చితంగా బర్త్ సర్టిఫికెట్ చూపించాలని డిమాండ్ చేస్తున్నది. బాల్యంలో పెళ్లయి ఇబ్బందులు తాళలేక తల్లిదండ్రుల ఇంటికొచ్చిన బాలికలకు బాసటగా నిలుస్తున్నది మోని బేగం. ప్రస్తుతం 40మందిని ఒకచోటికి చేర్చి పునరావాసాన్ని ఏర్పాటు చేసింది.



జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.

zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi





కలలు అందరూ కంటారు.
కొందరే సాకారం చేసుకుంటారు.
కొందరి కలలు కలలుగా మిగిలిపోతాయి.
ఇంకొందరి కలలు అలలొచ్చి ఆపినా ఆగవు.
డాక్టర్ ప్రియాంక పీవీ కూడా కలలు కన్నది.
వాటిని ఎలా సాకారం చేసుకున్నది?
యువ ప్రొఫెసర్‌గా ఎంతో మంది విద్యార్థులకు
మార్గదర్శిగా ఎలా ఎదిగింది?

విద్యార్థులను మలిచి మార్గదర్శిగా నిలిచి

Low aim is a crime.. నీ లక్ష్యం తక్కువదిగా, చిన్నదిగా ఉండడం నేరం అన్నారు అబ్దుల్ కలాం. ప్రియాంక అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని పెద్ద లక్ష్యాన్ని పెట్టుకున్నది. ప్రయత్నించి ఓడిపోయినా పర్వా లేదు. ప్రయత్నించడంలోనే ఓడిపోవద్దనుకున్నది.

డాక్టర్ ప్రియాంక పీవీ యువ ప్రొఫెసర్. భిన్న పద్ధతిలో పాఠాలు చెప్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నది. ఈరోజుల్లో చెప్తే వినే ఓపిక చాలా తక్కువ మందికి ఉంటున్నది. మరి విద్యార్థులకు ఆసక్తికరంగా చెప్పడం ఎలా? అని ఆలోచించి సరికొత్త బోధనా శైలిని రూపొందించింది ప్రియాంక. చెప్పాలనుకున్న విషయానికి టెక్నాలజీ జోడించి ఆ అంశాన్ని ఆసక్తికరంగా మార్చి చెప్తున్నది. బెంగళూరు నుంచి దుబాయ్ వెళ్లి అక్కడ కూడా పాఠాలు చెప్తున్నది ప్రియాంక.

ఉపాధ్యాయ వృత్తి సమాజం మీద ప్రభావం చూపగలిగినది. భవిష్యత్తు తరాలను మార్చేది. నేటి తరానికి దారి చూపేది. ఒక్క వ్యక్తి వేల మందిని ప్రభావితం చేసే అతితక్కువ రంగాల్లో ఈ రంగం ఒకటి. ప్రతిరంగంలో కష్టనష్టాలున్నట్లే ఈ వృత్తిలోనూ ఉంటాయి. వ్యక్తిగత విషయాలు ఎన్ని ఉన్నా పక్కన పెట్టి, విద్యార్థుల బంగారు భవిష్యత్తు మీద ప్రత్యేక దృష్టి పెట్టాలి. అప్పుడే వ్యక్తిగత జీవిత ప్రభావం ఆ విద్యార్థులపై పడదు. ఈ విషయాలన్నింటినీ ప్రియాంక పాటిస్తున్నది. తన జీవితంలో ఎన్ని కష్టాలున్నా.. పాఠాలు చెప్పేటప్పుడు మాత్రం నవ్విస్తూ చెప్తున్నది. అర్థమయ్యేలా వివరిస్తున్నది. లోపలెంత బాధ ఉన్నా.. బయటికి మాత్రం నవ్వుతూనే ఉన్నది. అందుకే ఈ రంగంలో ప్రియాంకకు పలు అవార్డులు కూడా లభించాయి. ప్రత్యేక గుర్తింపును కూడా తీసుకొచ్చాయి. చాలామందికి నవ్వుతూ నవ్విస్తూ చదివించిన గురువులు ఎక్కువ రోజులు గుర్తుంటారు. ఎందుకంటే విద్యార్థులు ఆ గురువులను వేరేవాళ్ల కన్నా ఎక్కువ ఇష్టపడతారు కాబట్టి. ప్రియాంక విషయంలో కూడా ఇలాంటి సందర్భాలు చాలా ఉన్నాయి.

అవార్డులు.. బాధ్యతలు



దుబాయ్‌లోని కర్టిన్ యూనివర్సిటీ ప్రియాంకను గుర్తించి అవార్డు ఇచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 30 జర్నల్స్‌కి రివ్యూయర్‌గా, ఎడిటోరియల్ సభ్యురాలిగా సేవలందిస్తున్నారు ప్రియాంక. ముఖ్యంగా విద్యార్థులు, వారు నేర్చుకోవాల్సిన అంశాల మీద అధ్యయనం చేసి చాలాచోట్ల ప్రజెంటేషన్ ఇచ్చింది. అంతేకాదు ప్రియాంక 'సోషల్‌మీడియా అండ్ మార్కెటింగ్ స్ట్రాటజీ ఇన్ ద ఇండియన్ రిటైల్ ఇండస్ట్రీ' పేరుతో ఒక పుస్తకాన్ని కూడా రాసింది. ఈ పుస్తకాన్ని దేశంలో టాప్ పబ్లిషింగ్ సంస్థ ప్రచురించింది. విద్యారంగంలో కీలకంగా సేవలందిస్తున్నందుకు గానూ చాలా సంస్థలు అవార్డులను ఇచ్చాయి పలు విశ్వవిద్యాలయాలు, అంతర్జాతీయ సంస్థలు. జైన్ యూనివర్సిటీ 2017 అల్యుమినీ అవార్డు, ఎయిమ్స్ అవుట్ స్టాండింగ్ యంగ్ ఉమన్ మేనేజ్‌మెంట్ టీచర్ అవార్డు, అవుట్ స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ ఫర్ ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ కర్ణాటక అవార్డులు ప్రియాంకకు లభించాయి. విద్యతో పాటు విద్యార్థులు సామాజిక సేవ చేయాలని కూడా చెప్తున్నది ప్రియాంక. వరల్డ్ విజన్ ఇండియా కోసం ఇద్దరు చిన్నారులను తన తరపున సిద్ధం చేస్తున్నది. దివ్యాంగులైన ఎంతోమంది విద్యార్థులను ఉచితంగా చదివిస్తున్నది.

భిన్నమైన శైలి..

బెంగళూరుకు చెందిన ప్రియాంక 'ఇన్నోవేటివ్ టీచింగ్ స్టైల్' పేరుతో అనేక కార్యక్రమాలు చేస్తున్నది. హైదరాబాదుకు చెందిన ప్రియాంక కుటుంబం బెంగళూరులో స్థిరపడింది. దుబాయిలో జరిగిన రోచెస్టర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ టెడ్ టాక్ కార్యక్రమంలో ప్రధాన వక్తగా వ్యవహరించింది. ఎంబీఏ చదివే విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులను నిర్వహిస్తున్నది ప్రియాంక. 'భిన్నంగా ఆలోచించడం ద్వారానే సమాజంలో మనకు గుర్తింపు లభిస్తుంది' అంటున్నది ప్రియాంక. తను ఏం చెప్పిన చిత్రాలు వేసి అర్థమయ్యేలా చెప్పడం మరో ప్రత్యేకత. ప్రియాంక వద్ద పాఠాలు విన్న చాలా మంది విద్యార్థులు ఇప్పుడు చాలా రంగాల్లో విజయం సాధించారు. తమదైన శైలిలో రాణిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పెద్ద పెద్ద వ్యవస్థల్లో పనిచేస్తున్నారు. ముఖ్యంగా ప్రియాంక మనం రోజూ వాడే వస్తువులను ఉదాహరణగా చెప్తూ విషయాన్ని సూటిగా వివరిస్తున్నది. క్యాండీ క్రష్, టెంపుల్‌రన్, సోషల్‌మీడియాలోని పదాలను వాడుతూ హిందీ పాటలు పాడుతూ గ్లోబలైజేషన్ వంటి అంశాలను కళ్లకు కట్టినట్లు చెప్పడం ఆమె ప్రత్యేకత. కాలేజీ తరగతి గదుల్లోనే కాదు యూట్యూబ్‌లో కూడా ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నది ప్రియాంక.

తొలి కంబాట్ ఆఫీసర్



బీహార్‌కు చెందిన ప్రకృతి ఇండో టిబెట్ బార్డర్ పోలీస్ విభాగంలో కంబాట్ ఆఫీసర్‌గా ఎంపికైంది. మనదేశంలో ఆమె తొలి కంబాట్ ఆఫీసర్. ఇరువై ఐదేళ్ల ప్రకృతిది బీహార్, సమస్తిపూర్ జిల్లా. యూనిఫామ్‌తో దేశానికి సేవ చేయాలన్నది ఆమె కోరిక. తండ్రి ఎయిర్ ఫోర్స్ అధికారి. ఆయన స్ఫూర్తితోనే ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తయిన తర్వాత సివిల్స్ రాసి తొలి ప్రయత్నంలోనే మంచి ర్యాంక్ సాధించి కంబాట్ ఆఫీసర్ జాబ్ దక్కించుకున్నది.

నిజానికి ప్రకృతి యూనిఫామ్‌తో సర్వీస్ చేసే ఉద్యోగం చేయాలనుకున్నది. కంబాట్ అనుకోలేదు. అయితే పత్రికలో వచ్చిన ఒక వార్త ఆమెను ఇటువైపు నడిపించింది. 2016లో విడుదల చేసిన వెసలుబాటును అనుచరించి బోర్డర్‌లో గస్తీ విధుల్లోకి మహిళల ప్రవేశం కల్పిస్తున్న విషయం తెలుసుకుని ఈ రంగాన్ని ఎంచుకుంది. ఇక్కడ ఒక విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. ఇండో-టిబెట్ బార్డర్ పోలీసుల్లో అసలు మహిళలే లేరా అనే సందేహం అందరికీ వస్తుంది. 1962 చైనా యుద్ధం తర్వాత ఇక్కడ ప్రత్యేక శ్రద్ధతో 83 వేలమందిని నియమించింది. వారిలో 15 వందల మంది మహిళలు ఉన్నారు. అయితే వారంతా తుపాకీ పట్టుకుని పోరాటానికి దిగే ఉద్యోగాల్లో లేరు. వైద్యం, ఇతర సేవా రంగాల్లో ఉన్నారు. సో.. తొలి కంబాట్ ఆఫీసర్ ప్రకృతినే.

వేడినీటితో లాభాలెన్నో..



సాధారణంగా ఉదయం లేవగానే ... బ్రష్ చేసుకోగానే ... కాఫీనో, టీనో తాగే అలవాటు మనలో చాలా మందికి ఉంటుంది. బ్రష్ చేయనిదే మంచినీరు కూడా ముట్టరు. కానీ ఉదయం లేవగానే వేడినీరు తాగితే కలిగే లాభాలేంటో మీకు తెలుసా?

- ఉదయం లేవగానే గోరువెచ్చని నీరు తాగేవారిలో.. జీర్ణ సంబంధ సమస్యలు తొలగిపోతాయి. మలబద్దకం, పైల్స్ లాంటి సమస్యలు కూడా దూరమవుతాయి.
- శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. శరీరంలో పేరుకుపోయిన కొవ్వు కరిగిపోయి, త్వరగా బరువు తగ్గుతారు.
- శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉండి, జ్వరం వంటి అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటాయి. శరీర అవాయవాలన్నీ కూడా ఆరోగ్యంగా ఉంటాయి. దీనివల్ల జీవ ప్రక్రియలన్నీ... సజావుగా సాగుతాయి.
- దగ్గు, జలుబు, గొంతు నొప్పి వంటి శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారు వేడినీరు తాగడం వల్ల మంచి ఉపశమనం పొందుతారు. రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది.
- వేడినీరు తాగడం వల్ల 'కేంద్ర నాడీ వ్యవస్థ' పనితీరు మెరుగుపడుతుంది. దీనివల్ల ఒత్తిడి, ఆందోళన దూరమవుతాయి. చర్మానికి, వెంట్రుకలకు కూడా చాలా మంచిది.
- అర గ్లాసు గోరు వెచ్చని నీటిలో ఒక స్పూను తేనె, సగం నిమ్మ రసం కలిపి రోజూ... పరగడపునే తాగడం వల్ల మలబద్ధకం ,హైపర్ ఎసిడిటీకి చక్కటి పరిష్కారంగా పనిచేస్తుంది.

చెరుకురసంతో ఆరోగ్యం



వేసవికాలంలో చెరుకు రసం తాగితే శరీరానికి గ్లూకోజ్ ఇచ్చినట్టే..వేసవి కాలంలో దీన్ని తాగడం వల్ల అలసట పోవడమే కాకుండా జీర్ణశక్తి మెరుగవుతుంది. ఈ రసంలో కొంచెం అల్లం నిమ్మరసం కలుపుకొని తాగితే.. రక్త హీనతని దూరం చేస్తుంది. అలసట వల్ల వచ్చే ఆయాసాన్ని కూడా దూరం చేస్తుంది. దీనిలో ఉండే మెగ్నీషియం, పొటాషియం, పాస్పరస్ కాల్షియం శరీరాన్ని ఎప్పటికప్పుడు ఉత్తేజంగా ఉంచుతాయి. ఈ రసంలో సుక్రోజ్ రూపంలో ఉండే చక్కెరని శరీరం తేలికగా జీర్ణం చేసుకుంటుంది. శరీరం డీహైడ్రేషన్‌కి లోనయినప్పుడు చెరుకు రసం తాగితే తక్షణ శక్తి వచ్చి త్వరగా కోలుకుంటారు. చెరుకు రసంలో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువ కాబట్టి మధుమేహం ఉన్నవారు కూడా చెరుకు రసం తాగొచ్చు. దీనిలోని సుక్రోజ్ దంత సమస్యలని కూడా నివారిస్తుంది. శరీరంలోకి క్యాన్సర్ కారకాలు రాకుండా నియంత్రించే ప్లేవనాయిడ్స్ చెరుకు రసంలో ఉంటాయి. ఈ యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాలు విస్తరించకుండా చేయడంతో పాటు వాటితో పోరాడి నాశనం చేస్తాయి కూడా. కాలేయ వ్యాధులు, కామెర్ల నుంచి కాలేయానికి రక్షణ ఇస్తుంది..

బిట్స్ కార్నర్

సహజసిద్ధమైన అందానికి..



ఎండాకాలం వచ్చిదంటే మేకప్ అవసరంలేని సహజసిద్ధ అందం కోసం మహిళలు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే ఇంట్లోనే కాంతివంతమైన చర్మాన్ని ఈ చిట్కాల ద్వారా పొందవచ్చు.

- నిమ్మరసం ఆరోగ్యాన్ని రక్షించడంలో ముందుంటుంది. రెండు చెంచాల నిమ్మరసంలో కొద్దిగా నీళ్లు కలిపి ముఖానికి మర్దన చేయాలి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి.
- టమోట ప్యాక్ ముఖంపై మృతకణాలను నివారించడంలో బాగా ఉపయోగపడుతుంది. రెండు టమోలు, రెండు స్పూన్ల నిమ్మరసం కలిపి మిక్సీపట్టాలి. ఆ పేస్టును స్నానానికి ముందు ముఖానికి రాసుకోవాలి.
- ఒక కప్పు పాలు(ఫ్యాట్ ఫ్రీ)లో ఒక నిమ్మకాయ రసాన్ని కలిపి 20 నిమిషాల తర్వాత ముఖానికి పట్టించాలి. ఈ చిట్కాను వారానికి ఒకసారి పాటించాలి.
- ఎక్స్‌ఫోలియేషన్‌లో చక్కెర/ఉప్పు/ఓట్‌మీల్/క్రష్డ్ ఆల్మండ్స్ కలిపి దీని ప్యాక్ సిద్ధం చేసుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని ముఖంపై సున్నితంగా రాయాలి. వారానికి ఒకసారి ఈ ప్యాక్‌ను వాడితే మంచిది.
- స్నానం చేసిన తర్వాత కొబ్బరి నూనెను శరీరంపై పలుచగా రాసుకోవాలి. పది నిమిషాల తర్వాత చర్మం కాంతివంతంగా మారి.. రోజంతా ఫ్రెష్‌గా కనిపిస్తుంది.

అప్పుడే బీపీనా?




అడుగండి చెబుతా

నా వయసు 30. ఒక మార్కెటింగ్ కంపెనీలో పనిచేస్తాను. ఈ మధ్య చాలా త్వరగా అలసటగా అనిపించడం, ఎక్కువ చెమటలు వస్తుండడం, నీరసంగా అనిపిస్తుండటంతో డాక్టర్ దగ్గరకు వెళ్లాను. ఆయన బీపీ పరీక్షించి చూసి బీపి ఎక్కువగా ఉందని చెప్పి మందులు రాసిచ్చారు. నాకు పెద్దగా చెడు అలవాట్లేమీ లేవు. చాలా అరుదుగా ఆల్కహాల్ మాత్రం కొద్ది మోతాదులో తీసుకుంటాను. మా అమ్మనాన్నలిద్దరికి బీపీ ఉంది. కానీ ఇంత చిన్న వయసులో వారికి రాలేదు. నాకు ఇంత త్వరగా ఎందుకు వచ్చింది. ఇలా త్వరగా బీపీ రావడం వల్ల ఏమైనా దుష్ప్రభావాలు ఉంటాయా? నేను ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించగలరు.

-రాజు, జనగాం

దమనుల్లో రక్తపీడనం పెరుగగానే బీపీ లేదా హైపర్ టెన్షన్ అంటారు. ఇలా దమనుల్లో రక్త పీడనం పెరుగడం వల్ల గుండె మీద భారం పడుతుంది. రక్త పీడనాన్ని సిస్టోలిక్/డయాస్టోలిక్ అని రెండు విలువలతో కొలుస్తారు. గుండె సంకోచించినపుడు కొలిచేది సిస్టోలిక్ పీడనం, వ్యాకోచించినపుడు కొలిచేది సిస్టోలిక్ పీడనం. సిస్టోలిక్ పీడనం 100–140 మధ్య, డయాస్టోలిక్ పీడనం 60–90 మధ్య ఉండాలి. అంతకంటే ఎక్కువ ఉంటే దాన్ని బీపీ లేదా హైపర్ టెన్షన్ అంటారు. మీ తల్లిదండ్రులిద్దరికీ బీపీ ఉంది కాబట్టి మీకు కూడా బీపీ వచ్చేందుకు 20–60 శాతం వరకు వచ్చే ఆస్కారాలు ఉన్నాయి. మీ జీవనశైలి, ఒత్తిడి, ఆహారపు అలవాట్లన్నీ కూడా బీపీ వచ్చేందుకు అనుకూలంగా ఉన్నందు వల్ల మీకు మరింత త్వరగా బీపీ వచ్చింది.
అలవాట్లు, శరీర బరువు, చేసే పని, ఎదుర్కొనే ఒత్తిడి వంటి ఎన్నో కారణాలు బీపీకి కారణం అవుతాయి.



డాక్టర్
అనుజ్ కపాడియా
సీనియర్ ఇంటర్వెన్షనల్
కార్డియాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్

బీపీ స్థాయి అదుపులో లేకపోతే గుండె, కిడ్నీ, రక్తనాళాలు, మెదడు వంటి ముఖ్యమైన అన్ని అవయవాల మీద దాని ప్రభావం ఉంటుంది. కాబట్టి తప్పనిసరిగా బీపీని అదుపులో ఉంచుకోవాలి. అందుకోసం తప్పనిసరిగా క్రమం తప్పకుండా వ్యాయామం చెయ్యాలి. బరువు పెరగకుండా చూసుకోవాలి. ఆహారంలో ఉప్పు రోజుకు 3 గ్రాములు మించకూడదు. కొవ్వు పదార్థాలు తగ్గించి తీసుకోవాలి. కొవ్వు తీసిన పాలు, పాల ఉత్పత్తులు తీసుకోవాలి. పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే పండ్లు, తాజా కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. పొగతాగడం, ఆల్కహాల్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి. ఎంత మాత్రం ఒత్తిడికి లోనుకాకుండా జాగ్రత్త పడాలి. అందుకు యోగా, ధ్యానం వంటివి అలవరుచుకుంటే మంచిది. ఇలాంటి చిన్నచిన్న జాగ్రత్తలతో బీపీని ఎదుర్కోవడం ఎంత మాత్రము కష్టం కాదు.

నమస్తే తెలంగాణ
జీవనరేఖ
[హైదరాబాద్]
మంగళవారం 13 మార్చి 2018



సిట్ ప్రాపర్లీ

కూర్చున్న సమయంలో సరైన భంగిమను పాటించడం వెన్నెముక ఆరోగ్యానికి మంచిదని అందరూ చెబుతుంటారు. కానీ నిజానికి సరైన భంగిమ పాటించడం అన్ని రకాలుగా మంచిదని నిపుణులు అంటున్నారు. కూర్చున్న తీరు మారుస్తూ సరైన భంగిమకు మారగానే శారీరకంగా సౌకర్యవంతంగా అనిపించడం మాత్రమే కాదు మానసికంగా ఉల్లాసాన్ని అందించే సెరోటోనిన్ వంటి హార్మోన్ల ఉత్పత్తి పెరుగుతుందట. ఫలితంగా ఉత్సాహంగా అనిపిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాదు ఒత్తిడికి కారణమయ్యే కార్టిసోల్ ఉత్పత్తి కూడా గణనీయంగా తగ్గిపోతుందట కూడా. కాబట్టి ఇక నుంచి పనిచేసే సమయంలో సరైన భంగిమను పాటించడం మరచిపోవద్దు.



ఆరోగ్యంతో స్నేహం

మీ స్నేహితులు ఎవరో చెప్పండి మీరెలాంటి వారో చెప్తాను అనేది పాత నానుడి. ఇప్పుడు మీరు ఆరోగ్యవంతులతో స్నేహం చెయ్యండి.. ఆరోగ్యంగా ఉండండి అనేది కొత్తగా చెప్పుకోవాల్సింది. మీ చుట్టూ చనువుగా ఉండే ఐదారుగురు వ్యక్తులు ఆరోగ్యవంతమైన అలవాట్లు కలిగిన వారై ఉండేలా చూసుకోమని అంటున్నారు డాక్టర్లు. ఆరోగ్యం అందించే తిండి తినేవారు, ఆరోగ్యం గురించిన అవగాహన కలిగిన వారు చుట్టూ ఉంటే మనకు తెలియకుండా మనం కూడా అలాగే ఉంటామన్నది వారి వాదన. కాబట్టి స్నేహితులుగా ఆరోగ్యవంతులను ఎంచుకోండి ఇక నుంచి.



రెండు విడతలుగా తీసుకోండి

ప్రతి రోజు మల్టీ విటమిన్ టాబ్లెట్లు తీసుకునే వారు రోజూ ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత ఒక టాబ్లెట్ వేసుకుంటూ ఉంటారు. కానీ అలా కాకుండా ఒక సగం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత మరో సగం రాత్రి భోజనం తర్వాత వేసుకోవడం వల్ల రోజంతా విటమిన్లు సరైన మోతాదులో శరీరానికి అందుతాయి. అయితే ఈ విటమిన్లలో బి కాంప్లెక్స్ విటమిన్లు ఉంటే మాత్రం రాత్రి భోజనం తర్వాత తీసుకోవడం అంత మంచిది కాదు. విటమిన్ బి నిద్రాభంగం కలిగించే ప్రమాదం ఉంటుంది.



"13 ఏళ్ల పాపని హడావుడిగా తీసుకొచ్చారు తల్లిదండ్రులు. విపరీతమైన టెన్షన్ పడిపోతున్నారు. ఎందుకో అనుమానం వచ్చి బీపీ చెక్ చేస్తే..! ఓ.. గాడ్.. చాలా ఎక్కువగా ఉంది. చకచకా అవసరమైన పరీక్షలన్నీ చేయిస్తే చివరికి ఆ పాపకి క్రానిక్ కిడ్నీ డిసీజ్ ఉందని తేలింది."

పిల్లల్లో బీపీ..!
డేంజర్ బెల్స్!

చిన్నారుల్లో అధిక రక్తపోటు ఉండడం ఏంటని అనుకుంటాం గానీ ఇలాంటి కొన్ని సందర్భాల్లో దాని వెనుక ప్రమాదకరమైన కారణం ఉండొచ్చు. అందుకే పిల్లలకు కూడా రెగ్యులర్‌గా బీపీ పరీక్ష చేయించడం అవసరమంటున్నారు నిపుణులు. ఇటీవల లిటిల్ స్టార్స్ హాస్పిటల్, ఛాయిస్ ఫౌండేషన్ సంయుక్త సారథ్యంలో నిర్వహించిన ఓ సర్వేలో ఏడుగురు చిన్నారుల్లో అధిక రక్తపోటు కనిపించి ఆందోళన కలిగిస్తున్నది. ఈ నేపథ్యంలో అధ్యయన సారథి డాక్టర్ సతీష్ ఘంటా పిల్లల్లో అధిక రక్తపోటు గురించి చెబుతున్న నిజానిజాలు...

బీపీ అంటే అదేదో పెద్దవాళ్లకు వచ్చే జబ్బని అనుకుంటాం. అంతేగానీ చిన్నారులకు కూడా వచ్చే అవకాశం ఉంటుందని లేశమాత్రమైనా అనుమానం రాదు. అసలు రక్తపోటు పట్లనే సరైన అవగాహన లేకపోవడం, సమాచారం అందుబాటులో లేకపోవడం, అధ్యయనాలు జరుగక పోవడం వల్ల ఇలాంటి పొరపాటు అభిప్రాయాలు మనకు ఏర్పడ్డాయి. నిజానికి అధిక రక్తపోటుకు చిన్నారులు మినహాయింపేమీ కాదు. వాళ్లలో కూడా రక్తపోటు అదుపు తప్పి పెరుగవచ్చు. కాకపోతే దాని వెనుక ప్రబలమైన కారణాలుంటాయి. చాలా సందర్భాల్లో పెరిగిన బీపీ వెనుక ప్రమాదకరమైన సమస్యలున్నట్టు బయటపడుతుంది.

రక్తపోటు అంటే..?

రక్తనాళాల్లో రక్తం కొంత పీడనంతో ప్రవహిస్తూ ఉంటుంది. ఈ పీడనాన్నే రక్తపీడనం లేదా రక్తపోటు అంటాం. దీనిలో రెండు రకాలుంటాయి. సాధారణ రక్తపీడనం 120/80 కన్నా తక్కువ ఉండాలి. రక్తపోటులో రెండు విభాగాలుంటాయి. కొలతలోని పై అంశాన్ని సిస్టోలిక్ పీడనం అంటారు. గుండె శరీర భాగాలకు రక్తాన్ని పంపు చేసినప్పుడు రక్తనాళాల్లోని రక్తపీడనమే సిస్టోలిక్ ప్రెజర్. ఇకపోతే శరీర భాగాల నుంచి రక్తం గుండెకు చేరేటప్పుడు ఉండే రక్తపీడనం డయాస్టోలిక్ పీడనం. ఇది రక్తపీడనం కొలతలో కింది భాగం. మొన్నటి వరకు సిస్టోలిక్ పీడనం నార్మల్‌గా ఉంటే చాలనుకునేవాళ్లు. కాని ఇప్పుడు డయాస్టోలిక్ పీడనం కూడా అదుపులోనే ఉండాలని కొత్త గైడ్‌లైన్స్ చెబుతున్నాయి.

కొత్త కొలతలివే..

ఇంతకుముందు 140/90 ఉంటేనే అధిక రక్తపోటుగా భయపడాల్సిన అవసరం ఉందనుకునేవాళ్లు. కాని 130/80 కన్నా ఎక్కువ బిపి ఉన్నవాళ్లు సంవత్సరం కల్లా అధిక రక్తపోటుకు చేరుకుంటున్నారు. కాంప్లికేషన్లు, సడన్ డెత్‌లూ పెరిగాయి. అందుకే కొత్తగా చేసిన అధ్యయనమైన స్ప్రిన్ ట్రయల్‌లో భాగంగా రక్తపోటు విలువలు ఎవరికి ఎలా ఉండాలో కొత్త గైడ్‌లైన్స్‌ని రూపొందించారు. ఇందులో భాగంగా సాధారణ రక్తపీడనం 130/80 కన్నా తక్కువ ఉండాలని సూచించారు. వీటి ప్రకారం రక్తపోటును నాలుగు దశలుగా విభజించారు. 120/80 కన్నా తక్కువ ఉండడం సాధారణమైతే, సిస్టోలిక్ పీడనం 120 నుంచి 129, డయాస్టోలిక్ పీడనం 80 కన్నా తక్కువ ఉండడం ఎలివేటెడ్ బ్లడ్ ప్రెజర్. సిస్టోలిక్ పీడనం 130 నుంచి 139, డయాస్టోలిక్ పీడనం 80 నుంచి 89 వరకు ఉండడం మొదటి దశగానూ, సిస్టోలిక్ పీడనం 140, అంతకన్నా ఎక్కువగానూ, డయాస్టోలిక్ పీడనం 90 ఉన్నట్టయితే రెండో దశగానూ సూచించారు.



1 నుంచి 13 ఏళ్ల మధ్య వయసు వాళ్లకు..

నార్మల్	<90వ శతాంశం	
ఎలివేటెడ్ (ఇంతకు ముందు ప్రీ-హైపర్‌టెన్షన్ అనేవాళ్లు)	≥ 90 నుంచి < 95 శతాంశం	>120/80 మి.మీ. మెర్క్యురీ నుంచి <95వ శతాంశం
మొదటి దశ హైపర్‌టెన్షన్	≥ 95వ శతాంశం నుంచి <95వ శతాంశం + 12 మి.మీ. మెర్క్యురీ	130/80 నుంచి 139/89 మి.మీ. మెర్క్యురీ
రెండో దశ హైపర్‌టెన్షన్	≥ 95వ శతాంశం + 12 మి.మీ. మెర్క్యురీ	≥ 140/90 మి.మీ. మెర్క్యురీ

13 ఏళ్ల వయసు దాటిన వాళ్లకు..

నార్మల్ బీపీ	< 120/ < 80 మి.మీ. మెర్క్యురీ
ఎలివేటెడ్ బీపీ (ఇంతకుముందు ప్రీ-హైపర్ టెన్షన్‌అనేవాళ్లు)	120/<80 నుంచి 129 /<80 మి.మీ. మెర్క్యురీ
మొదటి దశ హైపర్‌టెన్షన్	130/80 నుంచి 139/89 మి.మీ. మెర్క్యురీ
రెండో దశ హైపర్‌టెన్షన్	≥ 140/90 మి.మీ. మెర్క్యురీ





సాధారణంగా మనదేశంలో సర్వేలూ, అధ్యయనాలూ తక్కువ. ఎంతమంది, ఎన్ని రకాల సమస్యలతో బాధపడుతున్నారనే గణాంకాలు దొరకడం కష్టం. కానీ ఎంత మంది పిల్లలు ఆరోగ్యంగా ఉన్నారు, ఎలాంటి సమస్యలతో సతమతం అవుతున్నారనే సమాచారాన్ని అధ్యయనం చేయడానికి హైదరాబాద్‌లోని లిటిల్ స్టార్స్ చిల్డ్రన్స్ హాస్పిటల్, ఛాయిస్ ఫౌండేషన్ సంయుక్తంగా శ్రీకారం చుట్టారు. ఈ అధ్యయనంలో ఆందోళన కలిగించే విషయాలు బయటపడ్డాయి. 'మై చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్' అనే కార్యక్రమం పేరిట హైదరాబాద్‌లోని ప్రముఖ పాఠశాలకు చెందిన దాదాపు వెయ్యి మంది పిల్లలను అధ్యయనం కోసం ఎంచుకున్నారు. ఈ అధ్యయనం కోసం సుమారు వెయ్యి మంది పిల్లల్ని ఎంచుకున్నారు. వీరిలో 7 నుంచి 13 ఏళ్ల మధ్య వయసున్న వారిలో ఏడుగురు చిన్నారుల్లో అధిక రక్తపోటు బయటపడింది. నలుగురు మగపిల్లల్లో ఎలివేటెడ్ బ్లడ్ ప్రెజర్, ముగ్గురు ఆడపిల్లల్లో మొదటి దశ హైపర్‌టెన్షన్ ఉన్నట్టు తేలింది. అందుకే అన్ని పాఠశాలల్లోనూ సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటుగా బీపీ పరీక్ష కూడా చేయడం ఉత్తమం.

చిన్నారుల్లో బీపీ..

చిన్నారుల్లో బీపీ సమస్య గుర్తించడం కొంచెం సంక్లిష్టమైన అంశమే. ఎందుకంటే 13 ఏళ్ల వయసు వచ్చేవరకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి బీపీ విలువలు మారుతుంటాయి. వారి వయసుతో పాటు శరీర బరువు, ఎత్తు పెరుగుతున్న కొద్దీ బీపీలో మార్పులు వస్తుంటాయి. ఆడ, మగ పిల్లల్లో కూడా ఈ విలువలు వేర్వేరుగా ఉంటాయి. జెండర్, ఎత్తు, బరువుల పైన బీపీ విలువ ఆధారపడి ఉంటుంది. చిన్నారుల్లో బీపీ విలువలు ఇలా ఎప్పటికప్పుడు మారిపోతుంటాయి కాబట్టి అధ్యయనం చేసి విలువలను సగటున తీసుకుంటారు. ఏడాది వయసు నుంచి 13 ఏళ్లు వచ్చేవరకు పిల్లల్లో నార్మల్ బ్లడ్ ప్రెజర్ 90వ శతాంశం కన్నా తక్కువ ఉండాలి. ఇక ఎలివేటెడ్ బ్లడ్ ప్రెజర్ అంటే 90, అంతకన్నా ఎక్కువగా నుంచి 95వ శతాంశం వరకు ఉంటుంది. మొదటి దశ హైపర్‌టెన్షన్ 95, అంతకన్నా ఎక్కువ శతాంశం నుంచి 95 శతాంశం + 12 మి.మీ.మెర్క్యురీగా ఉంటుంది. ఇక రెండో దశ అధిక రక్తపోటు అంటే 95, అంతకన్నా ఎక్కువ శతాంశం + 12 మి.మి. మెర్క్యురీగా ఉంటుంది.

కారణాలు

చిన్నారుల్లో అధిక రక్తపోటు ఉందంటే దానికి గల కారణాలను తెలుసుకుంటే వాటికి చికిత్స చేస్తే బీపీ నార్మల్‌కి వచ్చేస్తుంది. అందుకే బీపీ చెక్ చేయించుకోవడం, దానికి కారణం కనుక్కోవడం చాలా అవసరం.

- కొంతమంది చిన్నారుల్లో వంశపారంపర్యమైన కారణాలు కూడా ఉంటాయి. కుటుంబంలో అధిక రక్తపోటు, టైప్ 2 మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, ట్రై గ్లిజరైడ్స్ ఉన్నా చిన్నారులకు రిస్కు ఉంటుంది.
- చిన్నారుల బీపీకి ప్రధాన కారణం స్థూలకాయం (బిఎంఐ 25 కన్నా ఎక్కువ). దీంతో పాటు వంశపారంపర్య కారణాలుంటే రిస్కు మరింత ఎక్కువ.
- కిడ్నీకి సంబంధించిన సమస్యలు. వీటిలో రీనో వాస్కులర్ థ్రాంబోసిస్ సర్వసాధారణమైనది. దీని తరువాత నెఫ్రోటిక్ సిండ్రోమ్, స్టిరాయిడ్స్ ఇవ్వడం కూడా ఇందుకు కారణమవుతాయి.
- గుండెకు సంబంధించిన జబ్బులు. వీటిలో ముఖ్యమైనది కోఆర్క్‌టేషన్ ఆఫ్ అయోర్టా. అంటే అతి పెద్ద ధమని అయోర్టా సన్నబడిపోతుంది.
- అడ్రినల్ గ్రంథిలో ట్యూమర్లు ఉన్నా చిన్నారుల్లో రక్తపోటు పెరుగవచ్చు.

చికిత్స ఏమిటి?



చిన్నారులకు బీపీ ఉన్నట్టు తేలితే దానికి కారణమైన దానికి చికిత్స ఇస్తే సరిపోతుంది. ప్రధాన కారణమైన స్థూలకాయం రాకుండా నివారించుకుంటే చిన్నారుల్లో బీపీ రాకుండా చాలావరకు చూసుకోవచ్చు. ఒకవేళ వచ్చినా బరువు తగ్గితే బీపీ కూడా తగ్గిపోతుంది. మిగిలిన సమస్యలకు ఆయా సంబంధిత చికిత్సలు చేయిస్తే బీపీ నార్మల్‌కి వస్తుంది. ఏది ఏమైనా బీపీ రాకుండా ఉండాలంటే పిల్లలకు మంచి ఆహారపు అలవాట్లను నేర్పించాలి. పిల్లల శారీరక ఆరోగ్యాన్ని రెగ్యులర్‌గా పరీక్షించేటప్పుడు బరువు, ఎత్తులతో పాటుగా బీపీ కూడా చెక్ చేయాలి. మూడేళ్ల వయసు నుంచి ప్రతి ఏటా బీపీ చెక్ చేయాలి. నెలలు నిండకుండానే జన్మించడం, తక్కువ బరువుతో పుట్టడం, పుట్టుకతో గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు ఉన్నట్టయితే ఇంకా చిన్నప్పటి నుంచే బీపీ పరీక్షలు చేయించడం ప్రారంభించాలి.

డాక్టర్ సతీష్ ఘంటా
డైరెక్టర్, నియోనేటల్ &
పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ సర్వీసెస్,
లిటిల్ స్టార్స్ చిల్డ్రన్స్ హాస్పిటల్,
హైదరాబాద్





దయచేసి నడవండి

నడక మంచిదని తెలిసి కూడా నడవడానికి బద్ధకిస్తాం. చిన్న చిన్న దూరాలకు కూడా ఏదో ఒక వాహనం వాడడం అలవాటుగా మారింది అందరికీ. వాకింగ్ వెళ్లాలనుకుంటూ బద్ధకించే వాళ్లకు కొదవే లేదు. వాకింగ్‌కు వెళ్లకపోయినా కనీసం రోజుకు 10 వేల అడుగుల వరకు నడిచినా చాలు మీరు ఫిట్‌గా ఉండొచ్చు అంటున్నారు ఫిట్‌నెస్ నిపుణులు. ఈ 10 వేల అడుగుల్లో 30 నిమిషాల పాటు వేగంగా నడవడం లేదా రోజులో మూడు సార్లు 10 నిమిషాల చొప్పున వేగంగా నడిచినా చాలట.

డి విటమిన్ లోపిస్తే....



ఈ మధ్య కాలంలో చాలా మంది శరీరంలో విటమిన్ డి లోపం ఉండడం లేదా సరిపడినంత విటమిన్ లేకపోవడం వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నారు. విటమిన్ డి మన శరీరంలో 30 –100 యూనిట్ల వరకు ఉంటే సాధారణ స్థాయిలో ఉన్నట్టు. 10–30 యూనిట్ల మధ్య ఉన్నవారికి సరిపడినంత లేదని అనుకోవాలి. 10 యూనిట్ల కంటే తక్కువ ఉన్నపుడు లోపంగా భావించాలి. వీరికి 60,000 యూనిట్ల విటమిన్ డి సప్లిమెంట్లు అవసరమవుతాయి. ఈ మొత్తం యూనిట్లను ఎంత లోపం ఉన్నదనే దాని మీద ఆధారపడి రెండు నుంచి నాలుగు వారాల పాటు ఇంజక్షన్లు లేదా టాబ్లెట్ల రూపంలో అందించాల్సి ఉంటుంది. వీటితో పాటు రోజులో కొంత సమయం పాటు చర్మానికి ఎండ తగిలేలా జాగ్రత్త పడడం, పాలు, చికెన్, సోయాబీన్స్, పొద్దుతిరుగుడు గింజలు, చేపల వంటివి ఆహారంలో భాగం చేసుకోవాలి. విటమిన్ డిని శరీరం గ్రహించాలంటే దీనితో పాటు విటమిన్ సి సప్లిమెంట్లు కూడా తీసుకుంటే మంచిది.

మాకు రాయండి

ఆరోగ్యపరమైన సలహాలు, సూచనలతో పాటుగా వివిధ రకాల జబ్బుల గురించి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నది మన జీవనరేఖ. అంతేగాకుండా వ్యాధుల నివారణోపాయాలు, ఆధునిక చికిత్సలు, కొత్త పరిశోధనల గురించిన సమాచారాన్ని అందిస్తూ మీకూ, మీ కుటుంబానికి ఉపయోగపడుతున్నదని భావిస్తున్నాం.

మీకు ఆరోగ్యాన్ని మరింత చేరువ చేసేందుకు, మీ కథల్ని మరింతమందిలో స్ఫూర్తి నింపేందుకు నడుం కట్టింది జీవనరేఖ. అందుకే మీకు వైద్య, ఆరోగ్య సంబంధమైన సందేహాలు, సమస్యలేవి ఉన్నా మాకు రాసి పంపండి. నిపుణుల చేత సూచనలిప్పిస్తాము. అంతేకాదు.. మీరేవైనా జబ్బుల్ని ధైర్యంగా ఎదుర్కున్నా మాకు చెప్పండి. మీ ధైర్యం పదిమందికి ఆశ కల్పించగలుగుతుంది.

డాక్టర్లు, హాస్పిటల్స్‌తో మీకు కలిగిన అనుభవాలు మంచివైనా, చెడ్డవైనా మాతో పంచుకోండి. పేషెంట్ డైరీలో భాగంగా ప్రచురిస్తాం.



మా చిరునామా
జీవనరేఖ
నమస్తే తెలంగాణ,
తెలంగాణ పబ్లికేషన్స్ ప్రై. లిమిటెడ్ రోడ్ నెం. 10,
బంజారాహిల్స్,
హైదరాబాద్ - 500 034
jeevanarekha@ntnews.com



మనిషి ఎక్కడ అడుగు పెడితే అక్కడ మార్పు తథ్యం. అయితే ఆ మార్పులో మంచీ ఉంటుంది. చెడూ ఉంటుంది. అందుకు మంచి ఉదాహరణ ఈ భూమండలమే. లక్షల యేళ్ల క్రితం పుట్టిన భూమి.. ఇప్పుడు ఎన్ని రకాలుగా రూపాంతరం చెందిందో చూస్తూనే ఉన్నాం కదా! మానవ మేథస్సు అంతటి విశిష్టతను కలిగి ఉన్నది మరి. విశ్వ రహస్యాలను కనుక్కోవడంలోనూ, ప్రకృతిలో మమేకమవడంలోనూ మనిషికి మనిషే సాటి. మరో వైపు భూగ్రహ విధ్వంసంలోనూ అతని పాత్ర ఉండనే ఉంది. ఇక భూమిని వాడుకోవడం అయిపోయింది.. అందుకే విశ్వాంతరాళాల్లో విహరిస్తూ అంతరిక్షంలోని ఇతర గ్రహాలపైకీ వెళ్లొస్తున్నాడు. కొన్ని దశాబ్దాలుగా మనిషి రాకపోకలు సాగిస్తున్న చంద్రమండలంలోనూ ఆ మార్కు మార్పు కనిపిస్తున్నదట. అదేమిటో తెలుసా?

చంద్రుడిపై చెత్త కథ..!

యుగాలు మారినా, తరాలు ముగిసినా, టెక్నాలజీ ఎంత పెరిగినా.. 'మనిషి మారలేదు.. అతని తీరు మారలేదు'. ఈ భూమ్మీద మంచైనా, చెడైనా మనిషి పుణ్యమే. ప్రకృతిలో పుట్టిన మానవుడు.. అదే ప్రకృతికి విరుద్ధంగా జీవిస్తున్న కాలమిది. మానవుడు చేసే పనిలో ఎంత బెస్ట్ ఉంటుందో అంతే వేస్టు ఉంటుంది. అయితే ఆ వేస్టును తిరిగి ఎలా ఉపయోగించాలి అనే విషయంలో మాత్రం ఒక నిర్దుష్టమైన ప్రణాళిక ఉండదు. అందుకే ఎక్కడపడితే అక్కడ పేరుకుపోయే చెత్తకుప్పలు, దుర్వాసన వెదజల్లే గార్బేజీలు భూమ్మీద దర్శనమిస్తుంటాయి. పర్యవసానమే కాలకూట విషం చిమ్మే కాలుష్యం. అయితే చెత్త ప్రభావం భూమికే పరిమితం కాలేదు. మనిషి అడుగిడిన పుణ్యమో ఏమో.. ఇప్పుడు చంద్రమండలంపైనా కనిపిస్తున్నదట.

అందమైన చందమామ

సైంటిఫిక్‌గా చంద్రుడు భూమి చుట్టూ తిరిగే ఒక ఉపగ్రహమే కావొచ్చు. మానవాళికి మాత్రం ఎప్పటికీ అందమైన చందమామే. చల్లని రాత్రి పూట ఆరుబయట పడుకొని అందమైన చుక్కల మధ్య మెరిసిపోయే చంద్రుణ్ని చూసి మురిసిపోని వారుండరంటే అతిశయోక్తి కాదు. అప్పటి వరకూ మారాం చేసే చిట్టిపాపలు సైతం.. అందమైన చందమామను చూపిస్తూ 'చందమామ రావె.. జాబిల్లి రావె' అని అమ్మ పాటపాడగానే గబుక్కున నాలుగు ముద్దలు తినేస్తారు. నిజంగానే ఆ అందాల చంద్రుడు వచ్చేస్తాడని ఆ చిట్టి మనసుల ఆశ కావొచ్చది. చూడ్డానికి తెల్లగా, చెండులా కనిపించే అందాల చందమామ మనుషుల కారణంగా చెత్తతో నిండిపోయాడట! అంతేమరి మనిషి అడుగు పెట్టిన ఏ ప్రదేశమైనా ట్రాష్‌తో మటాష్ అవ్వాల్సిందే కదా!

పరిశోధకులు తేల్చిన నిజం!

ఎప్పటికప్పుడు చంద్రమండలంపై పరిస్థితులను గమనిస్తూ ఉండే నాసా అంతరిక్ష పరిశోధనా సంస్థ.. అక్కడ చాలా చెత్త పేరుకుపోయిందనే విషయాన్ని తాజాగా గుర్తించింది. అయితే ఇవన్నీ అంతరిక్ష పరిశోధనల్లో భాగంగా అక్కడికి వెళ్లినప్పుడు వ్యోమగాములు వదిలిపెట్టి వచ్చినవేనని తేల్చారు. అక్కడి వాతావరణ పరిస్థితులను అంచనా వేసేందుకు ప్రయోగానికి ముందు నేరుగా భూమి నుంచి పంపిన వస్తువులు కూడా వాటిలో ఉన్నట్టు నిర్ధారించారు.

1969 మొదలు..

చంద్ర మండలంపై పేరుకుపోయిన ట్రాష్ అంతా నాసా వ్యోమగాములు వదిలిపెట్టి వచ్చిందేనట. 1969-1972 కాలంలో అపోలో ప్రోగ్రామ్‌లో భాగంగా వ్యోమగాములు అక్కడి ఉపరితలంపై అడుగు పెట్టారు. ఆ సందర్భంగా తీసుకెళ్లిన అనేక వస్తువులు, మెషిన్లను వ్యోమగాములు అక్కడే వదిలి వచ్చినట్టు నాసా ప్రతినిధులు చెబుతున్నారు. 1971లో జరిపిన అంతరిక్ష ప్రయోగంలో భాగంగా ఉపయోగించిన ఒక జెండా కిట్, ల్యూనర్ ఆర్బిటర్స్, సుత్తి, పక్షి ఈకలతో సహా అనేక వ్యర్థాలు అక్కడ ఉన్నట్టు గుర్తించారు. అయితే ప్రతి వస్తువూ, అక్కడి వాతావరణాన్ని అంచనా వేసే నిమిత్తమై పంపిందేనని స్పష్టం చేశారు. అక్కడి ఉపరితలంపై గురుత్వాకర్షణ శక్తిని పరీక్షించేందుకే ఇలా చేశారన్నారు. అయితే మానవ నిర్మిత మెషిన్ విజయవంతంగా చంద్రుడి ఉపరితలంపై ల్యాండ్ అవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసిందట. శాస్త్రవేత్తల భయాందోళనలు దూరం చేసిందట.

అనేక దేశాల ప్రయోగాలు..

నాసా తర్వాత అనేక దేశాలు చంద్రమండలం యాత్రకు శ్రీకారం చుట్టాయి. అమెరికాతో సహా రష్యా, జపాన్, ఇండియా, యూరప్ వంటి దేశాలు చంద్రుడిపై తమ జెండాను ఎగరేశాయి. అలా విభిన్న దేశాల ప్రయోగాల వల్ల మరిన్ని వ్యర్థాలు అక్కడ జమకూడుకున్నాయి.

ఒకరి చెత్త -మరొకరి నిధి

నాసా పరిశోధనల్లో ఈ కాన్సెప్ట్ బాగా పనిచేస్తున్నదిప్పుడు. ఒకప్పుడు చంద్రమండలంలో వదిలి వచ్చిన వస్తువులు, మెషిన్లలో కొన్ని ఇప్పటికీ ఉపయోగపడుతున్నాయట. వాటిలో ముఖ్యమైనది లేజర్- రేంజ్ రిఫ్లెక్టర్ ఒకటి. దీన్ని భూమ్మీద ఉన్న అంతరిక్ష పరిశోధకులు కూడా పింగ్ చేయగలరు. దీని ద్వారా భూమి, చంద్రుల మధ్య దూరాన్ని కొలువవచ్చుట. తాజా ప్రయోగానుసారం భూమి నుంచి చంద్రుడు సంవత్సరానికి 1.5 అంగుళాల(3.8 సెంటీమీటర్ల) దూరంగా కదులుతున్నట్టు గుర్తించారు శాస్త్రవేత్తలు. అంతేకాదు ఇన్నేళ్ల పాటు అక్కడున్న వస్తువులను పరీక్షించడం ద్వారా చంద్రుడి గురుత్వాక్షరణ శక్తి, కాలాంతరంలో జరిగిన మార్పును అధ్యయనం చేయగలుగుతున్నామంటున్నారు నాసా నిపుణులు. ఇదండీ చంద్రుడిపై చెత్త కథ. సో.. మానవుడు ఏం చేసినా లోక కల్యాణం కోసమేనన్నమాట!

... ✍ సంతోష్‌కుమార్ ప్యాట



చంద్రుడిపైనే ఎల్‌సిరాస్ (LCROSS)

చంద్రమండలంపై నీటి జాడను కనిపెట్టేందుకు, అక్కడున్న హైడ్రోజన్ శాతాన్ని గణించేందుకు కొన్నేళ్ల క్రితం ల్యూనర్ క్రేటర్ అబ్జర్వేషన్ అండ్ సెన్సింగ్ శాటిలైట్(LCROSS)ను చంద్రుడిపైకి పంపించారు అంతరిక్ష పరిశోధకులు. మెషిన్ విజయవంతమైంది. కానీ ఇప్పటికీ అది చంద్రమండల ఉపరితలంపైనే ఉన్నదని నాసా ప్రతినిధులు అంటున్నారు.



ఎంతంటే చెప్పడం కష్టమే!

చంద్రమండలంపై పేరుకుపోయిన చెత్త ఎంతంటే చెప్పడం కష్టమే అంటున్నారు శాస్త్రవేత్తలు. సుమారు దీని బరువు నాలుగు లక్షల పౌండ్లు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అంటే ఇది భూమి మీద 1, 81, 000 కిలోల బరువుతో సమానమన్నమాట. అయితే ఇది మరింత ఎక్కువగానూ ఉండొచ్చని నాసా ప్రతినిధుల అభిప్రాయం.



వాసన చూడడం ద్వారా శునకాలు కావాల్సిన వస్తువులను పసిగడుతాయని మనకు తెలుసు. పోలీసు జాగిలాలు అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పొచ్చు. అయితే ఈ విషయంలో శాస్త్రవేత్తలు ఒక కొత్త విషయాన్ని గుర్తించారు.

శునకాలెలా పసిగడుతాయ్?

తప్పిపోయిన పిల్లాడికి సంబంధించిన సమాచారాన్ని కనిపెట్టేందుకు, జాగిలానికి అతడికి చెందిన ఏవైనా దుస్తుల వాసనను చూపిస్తారు. ఈ ప్రక్రియలో ఇది సర్వసాధారణం. అయితే వాసన చూడడం ద్వారా కుక్కలు కనిపించకుండా పోయిన వ్యక్తి జాడను ఎలా కనిపెడుతాయి అనే అంశంపై శాస్త్రవేత్తలు ఒక పరిశోధన చేశారు. 48 శునకాలను పరీక్షించారు. వీటిలో కొన్ని పోలీసు ట్రైనింగ్ తీసుకున్న జాగిలాలైతే, మరికొన్ని పెంపుడు కుక్కలు. వాటన్నింటినీ ల్యాబ్‌లో పరీక్షించిన పరిశోధకులు.. ఒక్కొక్కదానికి ఒక్కో టాయ్‌ని ఇచ్చారు. తర్వాత ఆ టాయ్స్‌ను వాటికి కనిపించకుండా వేరే రూమ్‌లో దాచిపెట్టారు. కొద్ది సేపటి తర్వాత వాటిని తమ కిష్టమైన బొమ్మలను వెతుక్కుని తీసుకురావాల్సిందిగా ఆదేశించారు. అందర్నీ ఆశ్చర్యపరుస్తూ వాటిలో ఎక్కువ శునకాలు తాము వాసన చూసిన టాయ్స్‌నే కనుగొన్నాయి. జాగిలాలే కాదు, పెంపుడు కుక్కలు కూడా అలాగే చేయడం విశేషం. అయితే కుక్కలు తాము అన్వేషిస్తున్న దాని మానసిక చిత్రాన్ని కలిగి ఉంటాయని ఈ పరిశోధనలో గుర్తించారు శాస్త్రవేత్తలు. ఏనుగులు, ఎలుకలు కూడా తాము వెతుకుతున్న వస్తువు మానసిక చిత్రపటాన్ని కలిగి ఉంటాయని, వాసనతో వాటి మానసిక పరిజ్ఞానం ముడిపడి ఉన్నదని నిర్ధారించారు.

సెకనుకు సరికొత్త నిర్వచనం!

అతితక్కువ వ్యవధి ఉన్న సెకన్‌కు కొత్త భాష్యం చెప్పేందుకు సిద్ధం అవుతున్నారు అణు శాస్త్రవేత్తలు. ఇంతకీ వాళ్లేం చెబుతున్నారు?

సాధారణంగా అధికారిక సమయాన్ని సూచించే పరమాణు గడియారాల ప్రకారం ప్రతి 200 మిలియన్ సంవత్సరాలు ఒక సెకనుకు సమానం అవుతాయి. అణు పరిశోధకుల కాలమానం ఇలాగే ఉంటుంది. అయితే శాస్త్రవేత్తలు దీనిపై కూడా సంతృప్తిగా లేరు. మరింత కచ్చితమైన సమయ ప్రమాణం ద్వారా



అంతరిక్ష నౌకల మార్గదర్శిని మెరుగుపరచడానికి , కొత్త భౌతిక సిద్ధాంతాలను సూచించేందుకు కావాల్సిన ప్రాథమిక స్థిరాంకాలలో వ్యత్యాసాలు కనుగొనేందుకు కొత్త ప్రయోగాలు చేపట్టారు. అందుకే ప్రస్తుత అణు గడియారాలను రీప్లేస్ చేయడానికి చర్యలు మొదలుపెట్టారు. ఇవి మైక్రోవేవ్స్ ఫ్రీక్వెన్సీకి ట్యూన్ చేయబడి ఉంటాయి. కొలరాడోలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్టాండర్డ్స్ అండ్ టెక్నాలజీకి చెందిన భౌతిక శాస్త్ర నిపుణులు మైక్రోవేవ్ గడియారాలపై పరిశోధనలు నిర్వహించారు. సాధారణంగా సెకన్ అనేది భూభ్రమణం ద్వారా సంభవించే రోజు (24 గంటల సమయం) మీద ఆధారపడి ఉంటుంది. అయితే ఈ ఆటామిక్ క్లాక్స్ (అణు గడియారాలు) సూక్ష్మ కిరణ అలల డోలనాల మీద ఆధారపడి ఉంటాయి. రెండు ఆప్టికల్ క్లాక్స్‌తో పరిశోధన చేసిన శాస్త్రవేత్తల బృందం, రెండూ దాదాపు ఒకే రకమైన కాలాన్ని చూపించడం గమనించారు. ఇలా జరుగడం ఇదే మొదటిసారని తేల్చారు. ఎన్నో ఏళ్లుగా దీనిపై పరిశోధన చేస్తున్న శాస్త్రవేత్తలు కీలకదశకు చేరుకున్నారు. త్వరలోనే సెకన్‌కు మరో కొత్త నిర్వచనం చెప్పేందుకు సిద్ధమవుతున్నారు.



కొత్త స్థావరం వెతుకోక్కవాల్సిందే!

గ్లోబల్ వార్మింగ్ భూచరాలనే కాదు, జల చరాలనూ వణికిస్తున్నది. ఆ మూగజీవాలు తమ స్థావరాలనే విడిచి వెళ్లాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది. కింగ్ పెంగ్విన్స్ పరిస్థితి చూస్తే అది నిజమే అనిపిస్తున్నది.

దక్షిణ సముద్రంలో కింగ్ పెంగ్విన్స్ ప్రధాన ఆకర్షణ. అయితే మరో శతాబ్దకాలంలో ఆ ఆకర్షణ అంతర్ధానమైపోయే ప్రమాదం ఉందట. తాజా నివేదికలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

ఇక్కడి వాతావరణంలో వస్తున్న గణనీయమైన మార్పులను అనుసరించి రాబోయే శతాబ్దకాలంలో ఇక్కడున్న కింగ్ పెంగ్విన్స్‌న్నీ లొకేషన్ మార్చుకోవాల్సి ఉంటుందని బీబీసీ న్యూస్ రిపోర్ట్స్ చెబుతున్నాయి. వాతావరణంలో వస్తున్న భయానక మార్పులను అరికట్టడానికి ఎలాంటి చర్యలూ తీసుకోలేకపోతే రాబోయే కాలంలో ఇదే జరుగుతుందని ఈ నివేదిక పేర్కొంటున్నది. సాధారణంగా ఈ పెంగ్విన్లు సమీపంలోని ద్వీపాల్లో తమ సంతానాన్ని వృద్ధి చేసుకుంటాయి. అయితే ప్రస్తుతం విడుదలవుతున్న గ్రీన్ హౌస్ ఉద్గారాలు, వేడుక్కుతున్న సముద్రాలను చూస్తుంటే.. ఆ పరిస్థితి కనిపించడం లేదు. దీని వల్ల ఈ జీవాలు భవిష్యత్తులో మనుగడ సాగించేందుకు పరిస్థితులు దుర్భరంగా మారుతాయని రిపోర్టులు చెబుతున్నాయి. 2100 సంవత్సరం లోపు ఈ పెంగ్విన్లు ఇతర ద్వీపాలకు తరలి వెళ్లకపోతే అంతరించిపోయే ప్రమాదం ఉందంటున్నాయి. వీటిని కాపాడుకొనేందుకు గ్రీన్ హౌజ్ ఉద్గారాలను తగ్గించేలా తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉందని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. అలా చేస్తే ప్రస్తుతం ఉన్న పెంగ్విన్ సముదాయాలు మరింత కాలం మనుగడ సాగించగలవని చెబుతున్నారు.



అంతరిక్షంలో తేలియాడే మస్తిష్కం

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి త్వరలోనే ఒక కొత్త సభ్యుడికి వెల్‌కమ్ చెప్పబోతున్నారు శాస్త్రవేత్తలు. ఆ నూతన సభ్యుడెవరు? చేసే పనేంటి?



ఇంటర్నేషనల్ స్పేస్ సెంటర్ ఒక రకమైన ఫ్లైయింగ్ బ్రెయిన్‌ను రూపొందించింది. త్రీడీ ప్రింటెడ్ మెట్ అండ్ ప్లాస్టిక్ మిశ్రమంగా రూపొందిన ఈ కొత్త పరికరానికి సైమన్ (CIMON, Crew Interactive Mobile Companion)గా నామకరణం చేశారు. ఐబీఎంతో కలిసి ఎయిరోస్పేస్ డిజైన్ కంపెనీ ఎయిర్‌బస్ దీన్ని తయారు చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ప్రత్యేకమైన ఆకృతిని కలిగి ఉండే ఈ పరికరాన్ని ఒక ఫ్లోటింగ్ బ్రెయిన్‌గా అభివర్ణిస్తున్నారు శాస్త్రవేత్తలు. అంతరిక్షంలోని సూక్ష్మమైన గురుత్వాకర్షణలో తేలియాడే సైమన్, వ్యోమగాములకు సహాయసహకారాలు అందిస్తుంది. అక్కడి విశేషాలు, సమాచారాలను ఎప్పటికప్పుడు తెలియపరిచేలా ఒక స్క్రీన్ కూడా దీనికి అమర్చబడి ఉంటుంది. ఐఎస్ఎస్ వ్యోమగాములకు సహాయం చేయడంలో అచ్చం ఒక రోబోలా పనిచేస్తుందన్న మాట. ఇది అంతరిక్షంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ప్రవేశిస్తున్న తొలి మిషన్‌గా చెబుతున్నారు ఎయిర్‌బస్ ప్రతినిధులు. నిత్యం జరిపే పరిశోధనల్లో అంతరిక్ష శాస్త్రవేత్తలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా ఈ తెలివైన మెషిన్ సహాయం చేస్తుంది. ఆ పనిలో తలెత్తిన సమస్యలను తన డిస్‌ప్లే పూర్తిగా చూపించి, పరిష్కారానికి తోడ్పడుతుంది. అంటే వ్యోమగాములకు ఇదొక కొలీగ్‌గా భావించవచ్చు. సుమారు ఐదు కిలోల బరువుండే సైమన్ వ్యోమగాములతో పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వబడి ఉంటుంది. అందువల్లే శాస్త్రవేత్తలతో ఒక పార్ట్‌నర్‌గా కలిసి పనిచేస్తుంది. అందుకే దీనికి ఫ్లోటింగ్ బ్రెయిన్‌గా పేరు పెట్టారు శాస్త్రవేత్తలు. అందుకు తగ్గట్టే తానూ ఒక వ్యోమగామిలా పనిచేసేందుకు సిద్ధం అంటున్నది సైమన్.

సుడోకు

డైలీ సుడోకు 150 సమాధానం

2	1	3	9	6	8	7	4	5
4	6	9	7	5	2	3	1	8
5	7	8	4	3	1	2	9	6
3	9	4	6	8	5	1	2	7
7	5	2	1	4	9	6	8	3
6	8	1	2	7	3	9	5	4
9	4	5	3	1	6	8	7	2
8	2	6	5	9	7	4	3	1
1	3	7	8	2	4	5	6	9


1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -151

							2	
7			1	3			9	
8		9		5		6		
1		8	6					3
			9		3			
2					5	1		4
		2		7		5		9
	7			6	4			2
	8							

ట్వీట్



ఉపాసన కామినేని
@upasanakonidela



సూర్యరశ్మిని గ్రహించడానికి ఉదయం పది కన్నా ముందు మంచి సమయం. దీనివల్ల విటమిన్ డి పుష్కలంగా దొరుకుతుంది. సూర్యుని కిరణాలు తీసుకుని శక్తివంతులు అవండి.

ఉపాసనను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య 503,781

కామన్‌మ్యాన్ వాయిస్

రూపాయి కూడా ఇవ్వను అన్నోన్ని కొట్టి ఉంటే జనాల్లో హీరో అయ్యేవాడివి. కరుడుగట్టిన ఉద్యమకారుని మీద దాడికి తెగబడి పబ్లిగ్గా జీరో అయ్యావు.
-నజీర్ మహ్మద్

అధికారం లేకుంటేనే అసెంబ్లీలో వీధి రౌడీ వేశాలు.. అదే బజార్లో అయితే ఇంకా బరి తెగిస్తాడేమో!
-SandeepReddy Kothapally

ఆస్తులను పోగేసుకోవడంలో.. ఆనందం ఉందనుకునే వారు అక్కడే ఆగిపోతారు.
-Harish Kuvvakula

వైరల్ వీడియో



రంగస్థలం సినిమాలో రంగమ్మ మంగమ్మ పాటను విడుదల చేశారు. ఈ పాట యూట్యూబ్ ట్రెండింగ్‌లో నంబర్ స్థానంలో నిలిచింది.

Rangamma Mangamma Lyrical Video Song || Rangasthalam Songs || Ram Charan, Samantha, Devi Sri Prasad

Total views : 6,886,750+

Published on Mar 8, 2018

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
మంగళవారం 13 మార్చి 2018



కాజల్ అగర్వాల్

సరికొత్త లక్ష్యం

వృత్తిపరంగా తాను కొత్త లక్ష్యాల్ని నిర్దేశించుకున్నానని చెప్పింది పంజాబీ సుందరి కాజల్ అగర్వాల్. భాషాపరంగా ఎలాంటి హద్దులు విధించుకోలేదని, అవకాశమొస్తే హాలీవుడ్‌లో కూడా నటించడానికి సిద్ధమేనని పేర్కొంది. 'కథ, నా పాత్ర చిత్రణ నచ్చితే ఏ భారతీయ భాషా చిత్రంలోనైనా నటించడానికి అభ్యంతరం లేదు. ప్రస్తుతం సృజనాత్మక పరిధులు విస్తరిస్తున్నాయి. నా సమకాలీన కథానాయికలు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. తమ ప్రతిభకు మెరుగులుదిద్దుకుంటూ ప్రపంచ సినిమాపై సత్తా చాటుతున్నారు. ప్రస్తుతం నాకు తెలుగు, తమిళం, హిందీ భాషల్లో మంచి అవకాశాలొస్తున్నాయి. భవిష్యత్తులో అంతర్జాతీయ సినిమా నటించాలని వుంది. ఆ అవకాశం వస్తే సంతోషంగా స్వీకరిస్తాను' అని చెప్పింది. పెళ్లి గురించి ప్రస్తావించగా 'ప్రస్తుతం మూడు భాషల్లో సినిమాలు చేస్తున్నాను. ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఆలోచన లేదు. ప్రేమ పెళ్లా? పెద్దలు కుదిర్చిన పెళ్లా? అనే విషయాన్ని ఇంకా నిర్ణయించుకోలేదు. నా మనసుకు నచ్చిన వ్యక్తి తారసపడితే మాత్రం తాత్సర్యం చేయకుండా ప్రేమ విషయాన్ని అందరికి తెలియజేస్తాను' అని చెప్పింది కాజల్ అగర్వాల్.



నాగార్జున

ఉగాదికి శ్రీకారం



నాని

నాగార్జున, నాని కథానాయకులుగా వైజయంతీ మూవీస్ సంస్థ ఓ చిత్రాన్ని రూపొందించబోతున్న విషయం తెలిసిందే. శ్రీరామ్ ఆదిత్య దర్శకుడు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 18నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెడుతున్నారు. ఈ సందర్భంగా నిర్మాత అశ్వనీదత్ చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ప్రస్తుతం మణిశర్మ సంగీత సారథ్యంలో అమెరికాలో మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయి. మూడు పాటలకు రూపకల్పన చేస్తున్నాం. మా సంస్థలో వచ్చిన మల్టీస్టారర్ చిత్రాలన్ని చక్కటి ప్రేక్షకాదరణ పొందాయి. ఈ సినిమాకు అద్భుతమైన కథ కుదిరింది' అన్నారు. 'వినోదప్రధానంగా సాగే వినూత్న కథాంశమిది. నాగార్జున, నాని పాత్ర చిత్రణలు నవ్యపంథాలో సాగుతాయి. వైజయంతీ సంస్థలో మల్టీస్టారర్ చేయడం ఆనందంగా వుంది' అని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శ్యామ్ దత్, స్క్రిప్ట్ అడ్వైజర్: సత్యానంద్, మాటలు: వెంకట్ డి, శ్రీరామ్, సంగీతం: మణిశర్మ, ఎడిటింగ్: ప్రవీణ్‌పూడి, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: టి. శ్రీరామ్ ఆదిత్య.



సితార, కైరా అద్వాణీ

సెట్‌లో సి'తార'లు

మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'భరత్ అనే నేను'. కొరటాల శివ దర్శకుడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమా సెట్స్‌లో మహేష్‌బాబు కూతురు సితార సందడి చేసింది. రింగుల జుట్టుతో కనిపించే చిన్నారి సితార సరికొత్త కేశాలంకరణతో దర్శనమిచ్చింది. ఈ కొత్త హెయిర్‌స్టైల్‌ను తన తండ్రికి చూపించేందుకు సితార సెట్స్‌కి వచ్చిందట. ఈ విషయాన్ని నమ్రతశిరోద్కర్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించింది. షూటింగ్ లొకేషన్‌లో సితార చిత్ర కథానాయిక కైరా అద్వాణీతో ఓ ఫొటో తీసుకుంది. 'ఇద్దరు అందగత్తెలలో ఎవరి జుట్టు పొడవుగా ఉంది?' అంటూ సితార, కైరా అద్వాణీలతో కూడిన ఈ ఫొటోను నమ్రతా శిరోద్కర్ అభిమానులతో పంచుకుంది. ఈ ఫొటో అభిమానులను ఆకట్టుకుంటున్నది. కొత్త హెయిర్‌స్టైల్‌లో సితార చూడముచ్చటగా వుందంటూ వారు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.



'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' చిత్రంలో అల్లు అర్జున్

మధ్యతరగతి మందహాసాలు



సాట్నా టైటస్, శ్రీవిష్ణు

'పుత్రోత్సాహం తండ్రికి పుత్రుడు జన్మించినపుడే కలగదు. జనులా పుత్రుని గనిగొని పొగడగా పుత్రోత్సాహంబు కలుగును. అలా తండ్రి పేరును నిలబెట్టడానికి ఓ కొడుకు ఏ విధమైన ప్రయత్నాలు చేశాడు? ఈ క్రమంలో ఎలాంటి సంఘర్షణను ఎదుర్కొన్నాడు? అనేది తెలియాలంటే తెరపై చూడాల్సిందే' అంటున్నారు శ్రీవిష్ణు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'నీది నాది ఒకే కథ'. ప్రశాంతి, కృష్ణవిజయ్, అట్లూరి నారాయణరావు నిర్మిస్తున్నారు. వేణు ఊడుగుల దర్శకుడు. సాట్నా టైటస్ కథానాయిక. ఈ నెల 23న ఈ చిత్రం విడుదలకానున్నది. నిర్మాతలు మాట్లాడుతూ 'నవతరం మనోభావాలకు దర్పణంలా నిలిచే చిత్రమిది. వాస్తవికతకు, బాధ్యతలకు మధ్య నలిగిపోయే ఓ మధ్యతరగతి యువకుడి కథతో తెరకెక్కిస్తున్నాం. చదువుపై ఇష్టం లేకపోయినా తండ్రి మాటకు కట్టుబడిన అతడు ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కొన్నాడనేది హృద్యంగా అనిపిస్తుంది. చిత్తూరు యాసలో శ్రీవిష్ణు చెప్పే సంభాషణలు ఆకట్టుకుంటాయి. ఇటీవలే విడుదలైన గీతాలకు, ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. 'బిచ్చగాడు' ఫేమ్ సాట్నా టైటస్ పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది' అని తెలిపారు. పోసాని కృష్ణమురళి, దేవిప్రసాద్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, ఛాయాగ్రహణం: రాజ్ తోట, ఆర్ట్స్: టి. ఎన్. ప్రసాద్.

కథ ఎంపికలో పొరపాట్లు చేశా!



అనిల్ సుంకర

'ఇంజనీరింగ్ చదివే యువతీయువకుల జీవనశైలిని సహజకోణంలో ఆవిష్కరించే చిత్రమిది. కళాశాలలో చేరిన కాలక్రమంలో వారి మనస్తత్వాల్లో వచ్చే మార్పులు, తదనంతర పరిణామాల నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది' అని అన్నారు అనిల్ సుంకర. ఆయన నిర్మించిన తాజా చిత్రం 'కిరాక్ పార్టీ'. నిఖిల్, సంయుక్త హెగ్డే, సిమ్రాన్ ఫరీన్జా ప్రధాన పాత్రల్లో నటించారు. శరణ్ కొప్పిశెట్టి దర్శకుడు. ఈ నెల 16న ఈ చిత్రం విడుదలకానున్నది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్మాత అనిల్ సుంకర పాత్రికేయులతో ముచ్చటిస్తూ ''శివ'లాంటి సినిమా చేయాలన్నది నిర్మాతగా నా కల. ఆ సినిమాకు కొంత దగ్గరి పోలికలతో 'కిరాక్ పార్టీ' సాగుతుంది. కాలేజీ బ్యాక్‌డ్రాప్‌లో ప్రేమ, రాజకీయం అంశాలతో ముడిపడిన కథ ఇది. నిర్మాతగా నాకు చక్కటి సంతృప్తిని మిగిల్చింది. దర్శకత్వం చేయాలనే ఆలోచనతో చిత్రసీమలోకి ప్రవేశించాను. 'యాక్షన్ త్రీడీ' చిత్రానికి సంబంధించి బడ్జెట్ ఎక్కువైంది. కథ ఎంపికలో కొన్ని పొరపాట్లు చేశాను. అందుకే ఆ సినిమా నిరాశపరిచింది. మంచి కథతోనే సినిమాను తెరకెక్కించాలనే ఆలోచనతో దర్శకుడిగా విరామం తీసుకున్నాను. ప్రస్తుతం ఓ కథను సిద్ధం చేసుకున్నాను. అలాగే నిర్మాతగా ప్రస్తుతం అల్లరి నరేష్‌తో ఓ సినిమా చేస్తున్నాను. అలాగే రాజ్‌తరుణ్‌తో నిర్మించిన 'రాజుగాడు' వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. అలాగే శర్వానంద్‌తో మరో సినిమా ఉంటుంది. ఈ సినిమాకు దర్శకుడు ఎవరనేది ఇంకా ఖరారు కాలేదు. అలాగే వెంకటేష్ కథానాయకుడిగా సురేష్‌బాబుతో కలిసి నిర్మించనున్న తాజా చిత్రాన్ని ఈ నెలాఖరున సెట్స్‌పైకి తీసుకొస్తాం' అని తెలిపారు.

అన్నాదమ్ముల పెళ్లి సరదాలు



అనూప్‌రూబెన్స్, జెమిని కిరణ్, రాజేంద్రప్రసాద్, సాక్షిచౌదరి, నిధి ప్రసాద్

'కొత్త తరహా వినోదాన్ని అందించే చిత్రమిది. అర్బన్ కామెడీ కథాంశంతో దర్శకుడు నిధి ప్రసాద్ చక్కగా ఈ సినిమాను తెరకెక్కించారు' అని అన్నారు రాజేంద్రప్రసాద్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఊ.పె.కు.హ'(ఊళ్లో పెళ్లికి కుక్కల హడావుడి). నిధిప్రసాద్ దర్శకుడు. భాగ్యలక్ష్మి నిర్మిస్తున్నారు. రిషి, ఖయ్యూం, సాక్షిచౌదరి కీలక పాత్రలను పోషిస్తున్నారు. అనూప్ రూబెన్స్ స్వరాలను సమకూర్చిన ఈ చిత్ర గీతాలు సోమవారం హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ఆడియో సీడీలను కథానాయకుడు రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 'నా సినీ జీవితంలో చిన్న సినిమాలు అనుకున్నవన్నీ పెద్ద విజయాల్ని సాధించాయి. ఆరుగురు తమ్ముళ్ల కారణంగా ఓ అన్నయ్య ఎదుర్కొనే సరదా సంఘటనలే ఈ చిత్ర ఇతివృత్తం. అందమైన అమ్మాయిని పెళ్లిచేసుకునేందుకు అతడు చేసే ప్రయత్నాలు నవ్విస్తాయి. నిజాయితీతో దర్శకనిర్మాతలు చేసిన ఈ ప్రయత్నం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది' అని అన్నారు. కామెడీ ఎంటర్‌టైనర్ ఇదని, ఇంటిల్లిపాదిని అలరిస్తుందని సాక్షిచౌదరి చెప్పింది. అనూప్ బాణీలు ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, త్వరలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని దర్శకుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెమిని కిరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.


జెనిటిక్ లవ్‌స్టోరీ..



పావని

సంతోష్‌రాజ్, నేహాదేశ్‌పాండే జంటగా నటిస్తున్న చిత్రం 'అనువంశికత'. 'జెనిటిక్ లవ్‌స్టోరీ' చిత్ర ఉపశీర్షిక. రమేష్ ముక్కెర దర్శకత్వం వహిస్తున్నారు. తాళ్లపెల్లి దామోదర్‌గౌడ్ నిర్మిస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర గీతాలు విడుదలయ్యాయి. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన పరకాల శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ 'ఎన్నో కష్టాలకోర్చి నిర్మాత దామోదర్ ఈ సినిమాను నిర్మించారు. ఆయనకు మంచి పేరును తెచ్చిపెట్టాలి' అని అన్నారు. 'రక్త సంబంధీకులు పెళ్లి చేసుకుంటే ఎదురయ్యే పరిణామాల నేపథ్యంలో సాగే ప్రేమకథా చిత్రమిది. సందేశాత్మక కథాంశంతో తెరకెక్కించాం' అని నిర్మాత పేర్కొన్నారు. కుటుంబ బంధాలు, ప్రేమ, వినోదం, యాక్షన్ అంశాల సమాహారంగా ఈ సినిమా సాగుతుందని, తమ తొలి ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకముందని దర్శకుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో సుమన్, కొత్త మనోహర్‌రెడ్డి, తైదల బాపు తదితరులు పాల్గొన్నారు.

వంకాయల సత్యనారాయణ కన్నుమూత



సీనియర్ తెలుగు సినీ నటుడు వంకాయల సత్యనారాయణ(78) సోమవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన ఏపీలోని విశాఖపట్నంలో తుదిశ్వాసవిడిచారు. 1940 డిసెంబర్ 28న విశాఖపట్నంలో జన్మించారాయన. నటన పట్ల మక్కువతో చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టి దాదాపు 180కిపైగా చిత్రాల్లో నటించారు. తెలుగుతో పాటు తమిళ, హిందీ చిత్రాల్లో కూడా నటించారు. సహాయనటుడిగా, హాస్యపాత్రలతో తనదైన శైలి అభినయంతో ప్రేక్షకుల్ని మెప్పించారు. 'నీడలేని ఆడది' సినిమాతో వంకాయల సత్యనారాయణ సినీ జీవితం ప్రారంభమైంది. కె. విశ్వనాథ్ దర్శకత్వంలో రూపొందిన 'సీతామాలక్ష్మి'లో పోషించిన స్టేషన్ మాస్టర్ పాత్ర ఆయనకు మంచి పేరుప్రఖ్యాతులతో పాటు అనేక అవకాశాల్ని తెచ్చిపెట్టింది. సూత్రధారులు, అత్తవారిల్లు, శ్రీనివాసకళ్యాణం, శుభలేఖ, శృతిలయలు, ఊరికిచ్చిన మాట, దొంగకోళ్లు, కుక్క కాటుకు చెప్పు దెబ్బతో పాటు పలు చిత్రాలు వంకాయల సత్యనారాయణ నటనకు నిదర్శనంగా నిలిచాయి. రెండేళ్ల క్రితం విడుదలైన 'కారందోశ' ఆయన నటించిన చివరి చిత్రం.

పూజా తీన్‌మార్..!

అదృష్టమంటే పూజా హెగ్డేదే అంటున్నారు టాలీవుడ్ జనాలు. ఈ కన్నడ కస్తూరి పట్టిందల్లా బంగారమే అవుతున్నది. ఆమెకు భారీ చిత్రాల్లో అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. మహేష్‌బాబు కథానాయకుడిగా వంశీపైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో పూజా హెగ్డే కథానాయికగా ఖరారైన విషయం తెలిసిందే. ఎన్టీఆర్-త్రివిక్రమ్ చిత్రంలో కూడా ఈ అమ్మడే కథానాయిక. తాజాగా ఈ సొగసరి ప్రభాస్‌తో జోడీ కట్టబోతుంది. ఈ విషయాన్ని ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పూజా హెగ్డే వెల్లడించింది. ప్రస్తుతం 'సాహో'లో నటిస్తున్న ప్రభాస్..ఈ సినిమా అనంతరం రాధాకృష్ణకుమార్ దర్శకత్వంలో స్వీయనిర్మాణ సంస్థ గోపీకృష్ణ మూవీస్ పతాకంపై ఓ సినిమా చేయబోతున్నారు. ఇందులో పూజా హెగ్డే కథానాయికగా నటించనుంది. త్వరలో ఈ చిత్రం లాంఛనంగా ప్రారంభంకానున్నట్లు సమాచారం. 'ముకుంద' చిత్రంతో తెలుగులో అరంగేట్రం చేసిన పూజాహెగ్డే ఆ తర్వాత బాలీవుడ్‌లో అదృష్టాన్ని పరీక్షించుకుంది. గత ఏడాది 'దువ్వాడ జగన్నాథమ్' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించింది. ప్రస్తుతం బెల్లంకొండ శ్రీనివాస్ సరసన 'సాక్ష్యం' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. రామ్‌చరణ్ 'రంగస్థలం'లో ఓ ప్రత్యేక గీతంలో నర్తించింది. తాజాగా అగ్ర హీరోల సరసన మూడు భారీ సినిమాల్లో అవకాశాల్ని సొంతం చేసుకొని తారాపథంలో దూసుకెళ్లడానికి సిద్ధమవుతున్నది.



పూజా హెగ్డే

అంగుళీక ప్రేమకథ

ప్రియమణి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'అంగుళీక'. కోటి తూముల, ఎ.హితేష్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ప్రేమ్ ఆర్యన్ దర్శకుడు. దీపక్ ప్రధాన పాత్రధారి. ఈ చిత్ర టీజర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో దర్శకుడు కోడిరామకృష్ణ విడుదలచేశారు. ఆయన మాట్లాడుతూ 'టీజర్ బాగుంది. సినిమా రంగం పట్ల ఇష్టంతో వారు చేస్తున్న ఈ ప్రయత్నం ఫలించాలి' అని అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'సూర్యగ్రహణం, కాలచక్రంలో అంశాల చుట్టూ సాగే చిత్రమిది. ప్రస్తుతం గ్రాఫిక్స్ పనులు జరుగుతున్నాయి' అని చెప్పారు. 'కాలచక్రంతో ముడిపడిన ఓ జంట ప్రేమకథా చిత్రమిది. సూర్యగ్రహణం ఘడియల్లో విడిపోయిన వారు మళ్లీ సూర్యుడి అండతో 585 ఏళ్ల తర్వాత ఎలా కలుసుకుంటారు. కొన్ని దుష్టశక్తుల కారణంగా వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయి. వాటిని ఎలా అధిగమించి ఒక్కటయ్యారన్నదే ఈ చిత్ర కథ. ప్రియమణి పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది' అని దర్శకుడు చెప్పారు.



ప్రియమణి







సోమవారం సరోజినీదేవి కంటి దవాఖానలో చికిత్సపొందుతున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను పరామర్శిస్తున్న స్పీకర్ మధుసూదనాచారి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావు, కేటీఆర్, మహేందర్‌రెడ్డి, మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు. దవాఖానలో చికిత్స పొందుతున్న స్వామిగౌడ్ (ఇన్‌సెట్)



అసెంబ్లీ ఆవాజ్



ఇది ప్రజాస్వామ్యంపై దాడి

- సభలో కాంగ్రెస్ నాయకుల తీరు అత్యంత హేయం
- రాష్ట్రం పరువు తీస్తున్న కాంగ్రెస్ నాయకులు
- నాటి ఘటనకు, నేటి ఘటనకు దేశభక్తికి, దేశద్రోహానికి ఉన్నంత తేడా
- చట్టసభలు దేవాలయాలకంటే తక్కువేమీ కాదు
- కాంగ్రెస్ నాయకుల దగ్గర సరుకులేదు కాబట్టే గొడవ
- కోమటిరెడ్డిపై చర్యల విషయంలో స్పీకర్‌దే నిర్ణయం
- రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి టీ హరీశ్‌రావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు చేసిన దాడి మండలి చైర్మన్ స్వామిగౌడ్‌పైన కాదని, మొత్తం ప్రజాస్వామ్యంపై జరిగన దాడి అని రాష్ట్ర శాసనసభ వ్యవహారాలు, నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అభివర్ణించారు. సోమవారం టీఆర్‌ఎస్ ఎల్పీ కార్యాలయంలో శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిలతో కలిసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగ సమయంలో కాంగ్రెస్ నాయకులు వ్యవహరించిన తీరు అంత్యత హేయమైనదని అన్నారు. గవర్నర్‌ను లక్ష్యంగా చేసుకుని అరాచకం సృష్టించారని మండిపడ్డారు. ఈ దాడిని టీఆర్‌ఎస్‌ఎల్పీ తరఫున ఖండించారు. దాడికి ప్రయత్నించడమే కాకుండా ఏకవచనంతో మాట్లాడారని అన్నారు. రాజ్యాంగ పరిరక్షకుడిగా ఉన్న గవర్నర్‌పైన దాడికి ప్రయత్నించడం ప్రజస్వామ్యంపై దాడి చేయడమేనని చెప్పారు. దేశవ్యాప్తంగా రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తుంటే, కాంగ్రెస్ నాయకులు మాత్రం రాష్ట్ర పరువు తీసేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను కేంద్రంతోపాటు వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు అభినందిస్తుంటే కాంగ్రెస్ నాయకులకు మింగుడు పడటంలేదని అన్నారు. చట్టసభలు దేవాలయాలకంటే తక్కువేమీ కాదని, వాటి పవిత్రను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

కుస్తీ పోటీలకు వచ్చామా?

'అసెంబ్లీని విద్యార్థులు, యువకులు చూస్తున్నారు. భవిష్యత్ తరానికి కాంగ్రెస్ నాయకులు ఏం చెప్పదలుచుకున్నారు? అసెంబ్లీకి కుస్తీపోటీలకోసం వచ్చామా?' అని హరీశ్ నిలదీశారు. సభ జరుగనివ్వకుండా ఇష్టారీతిన గూండాల్లా వ్యవహరించిన తీరు అందరూ గమనిస్తున్నారన్నారు. గవర్నర్‌పై బలంగా పేపర్లు, మైక్‌లు, కళ్లజోళ్లు, హెడ్ ఫోన్లు విసిరారన్నారు. ఈ ఘటన వెనుక ఏదో కుట్ర ఉందని జానారెడ్డి, భట్టి విక్రమార్క చెప్పడాన్ని ప్రస్తావిస్తూ, 'గవర్నర్‌పై దాడి చేసినవారిది కుట్ర అంటారా? సభలో సంయమనం పాటించి గౌరవాన్ని కాపాడిన మాది కుట్ర అంటారా?' అని నిలదీశారు. కాంగ్రెస్ నాయకులు లేవనెత్తదల్చుకున్న అంశాలను మాటల ద్వారా చెప్పవచ్చని, కానీ భౌతికదాడులు సరికాదని, సాంప్రదాయం కాదని చెప్పారు. కాంగ్రెస్ 130 ఏండ్ల చరిత్ర ఇదే చెప్తున్నదా? అంటూ ఎద్దేవాచేశారు. ప్రజాస్వామ్యంపై దాడి చేయడాన్ని సీఎల్పీ నేత జానారెడ్డి ఏ విధంగా సమర్థించుకుంటారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల దగ్గర సరుకు, చర్చించడానికి ఏ అంశం లేకపోవడంతో గొడవచేయాలని చూస్తున్నారని విమర్శించారు. చర్చ సందర్భంగా పదేండ్ల కాంగ్రెస్ పాలనలో ఏం చేశారనే అంశం ముందుకు వస్తుందని, టీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నివర్గాలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న విషయం ప్రస్తావనకు వస్తుందని అన్నారు. దీంతో వారికి ఏం చేయాలో దిక్కుతోచక ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సభలో జరిగిన ఘటనలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఇస్తూ బీఏసీలో నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. రైతుల సమస్యలపై చర్చించడానికి ప్రభుత్వం ఎప్పుడు సిద్ధంగా ఉందని స్పష్టంచేశారు. 'మాదిరైతు ప్రభు త్వం. రాష్ట్రంలో అమలుచేస్తున్న పథకాలు ఇతర రాష్ట్రాలు, కర్ణాటకలో అమలుచేస్తున్నారా అనే విషయం చర్చిద్దామా?' అని ప్రశ్నించారు. రైతు సమస్యలపై కాంగ్రెస్‌ది మొసలికన్నీరు అన్నారు.

ఆనాడు పరాయి పాలన...

ఉద్యమసమయంలో ఘటనకు, ఇప్పటి ఘటనకు చాలా తేడా ఉందని హరీశ్‌రావు స్పష్టంచేశారు. ఈ రెండు ఘటనల్లో దేశభక్తికి, దేశద్రోహానికి ఉన్నంత తేడా ఉన్నదని మంత్రి చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో భగత్‌సింగ్ పార్లమెంట్‌పై చేసిన దాడికి, కొన్నేండ్లక్రితం ఉగ్రవాదులు పార్లమెంటుపై చేసిన దాడికి ఉన్న తేడానే అప్పుడూ.. ఇప్పుడూ ఉందన్నారు. అసెంబ్లీలో ఉద్యమ సమయంలో ఉన్న పరిస్థితులు వేరని, ఈనాడున్న పరిస్థితులు వేరని చెప్పారు. నాడు పరాయి పాలనలో తెలంగాణ ప్రాంతం ఉన్నదని, ఆనాడు తెలంగాణపై తీర్మానం చేయడానికి, ఇక్కడి ప్రజల గోసను తెలుపడానికి అవకాశమివ్వకపోవడంతోనే నిరసనలు తెలుపాల్సి వచ్చిందని వివరణ ఇచ్చారు. 'కానీ తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్షాలు కోరే ఏ అంశంపై అయినా చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం ప్రకటించింది. ఎన్ని రోజులైనా చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అర్ధరాత్రివరకు సభ జరిగిన రోజులు ఉన్నాయి. ప్రభుత్వం ఏ అంశంపై అయినా సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉంది' అని ఆయన చెప్పారు. గవర్నర్ ప్రసంగం మొదలైన ఐదు నిమిషాలవరకు అసెంబ్లీలో మార్షల్స్ ఎక్కడైనా కనిపించారా? అని ప్రశ్నించారు. ఎప్పుడైతే కాంగ్రెస్ నాయకులు గవర్నర్‌పై దాడికి దిగడానికి ప్రయత్నించారో, ఆ సందర్భంలో గవర్నర్‌కు రక్షణగా మార్షల్స్ వచ్చారన్నారు.

కాంగ్రెస్‌ది సంస్కారరహిత రాజకీయం

- అసహనంతో నీతిమాలిన చర్య
- మండిపడిన మంత్రి కే తారకరామారావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాసనసభలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు వ్యవహరించిన తీరు పట్ల మంత్రి కేటీ రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'చీప్ క్రాష్, కల్చర్‌లెస్ యాక్టివిటీస్' అంటూ మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకోవడం, ప్రసంగం ప్రతులను చింపడం, హెడ్‌ఫోన్ విసరడం, వస్తువులు ధ్వంసంచేయడంద్వారా కాంగ్రెస్ తనస్థాయిని మరింత దిగజార్చుకున్నదన్నారు. సోమవారం హోటల్ ఐటీసీ కాకతీయలో జపాన్‌కు చెందిన ఇసే కంపెనీ, తెలంగాణ సర్కారు మధ్య ఒప్పందం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయనను అసెంబ్లీలో జరిగిన ఘటనపై మీడియా ప్రశ్నించగా.. నిరసనలు తెలిపేందుకు పరిమితులు ఉన్నాయని, కాంగ్రెస్ ప్రతినిధులు అనాగరికంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఇలాంటి పనులు చేసినందుకు సిగ్గుపడాలన్నారు. ఇలా చేయడం ప్రజాస్వామ్యం అవుతుందా? అని ప్రశ్నించారు. ప్రజాదరణ తగ్గుతుండటంతో కాంగ్రెస్ నాయకులు ఉక్రోషానికి (ఫ్రస్టేషన్) లోనవుతున్నారని, ఎలా ఉనికిని చాటుకోవాలో తెలియక ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విలువైన సభాకాలాన్ని సద్వినియోగం చేసుకోవడం మానేసి, ఈ తరహా చర్యలతో అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అసెంబ్లీలో దాడికి సంబంధించిన వీడియోలు తమ వద్ద ఉన్నాయని చెప్పారు.

దెబ్బతిన్న కార్నియా

- 40శాతం తగ్గిన స్వామిగౌడ్ కంటిచూపు
- సరోజినీదేవి దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్
- అసెంబ్లీ నుంచి నేరుగా సరోజినీ దవాఖానకు చైర్మన్ తరలింపు
- వెంటవచ్చిన శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి



మెహిదీపట్నం సరోజినీదేవి కంటి దవాఖానలో మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు చికిత్స చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్

నమస్తే తెలంగాణ-సిటీబ్యూరో/మెహిదీపట్నం: మండలి చైర్మన్ స్వామిగౌడ్ కుడికంటికి తీవ్ర గాయమైందని, కార్నియా దెబ్బతినడంతో ఒత్తిడి పెరిగి 40% చూపు తగ్గిందని సరోజినీదేవి కంటి దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్ తెలిపారు. అత్యవసర చికిత్స అందిస్తున్నామని, 24 గంటల పర్యవేక్షణ కోసం ఇన్‌పేషంట్‌గా అడ్మిట్ చేసుకున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం శాసనసభలో హెడ్‌ఫోన్ విసరడంతో కంటికి గాయమైన స్వామిగౌడ్‌ను శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి వెంటరాగా మెహిదీపట్నంలోని సరోజినీదేవి కంటి దవాఖానకు తరలించారు. స్వామిగౌడ్ దవాఖానకు చేరుకోగానే సూపరింటెండెంట్ రవీందర్‌గౌడ్ హుటాహుటిన ప్రథమ చికిత్స ప్రారంభించారు. సూపరింటెండెంట్ పర్యవేక్షణలో కంటి వైద్య నిపుణులు శ్రీనివాస్, రాజలింగం, ఆర్‌ఎంవో నజాఫీ బేగం బృందం చికిత్స అందిస్తున్నారు. స్వామిగౌడ్ కుడికంటి ఐలిడ్‌లో స్వెల్లింగ్ రావడంతో పాటు కార్నియా దెబ్బతిన్నదని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి తెలిపారు.

పరామర్శల వెల్లువ..

కంటికి గాయమై సరోజినీ దవాఖానలో చికిత్స పొందుతున్న మండలి చైర్మన్‌ను శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, ఉప ముఖ్యమంత్రులు మహమూద్‌అలీ, కడియం శ్రీహరి, మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్, నాయిని నర్సింహారెడ్డి, టీఆర్‌ఎస్ సెక్రటరీ జనరల్ కే కేశవ్‌రావు, ఎమ్మెల్సీలు శ్రీనివాస్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, ఎమ్మెస్ ప్రభాకర్, పూల రవీందర్, ఫారూఖ్ హుస్సేన్, మహ్మద్ సలీం, రాములు నాయక్, జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, ప్రకాశ్‌గౌడ్, జాఫర్‌హుస్సేన్ మెరాజ్, కౌసర్ మోయినుద్దీన్, జీహెచ్‌ఎంసీ మేయర్ రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబాఫసియుద్దీన్, సినీనటులు సుమన్, కవిత, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తి ప్రవీణ్, ఉద్యోగ సంఘాల నాయకులు దేవీప్రసాద్, రవీందర్‌రెడ్డి, ముజీబ్ హుస్సేనీ, కృష్ణయాదవ్, కార్వాన్ టీఆర్‌ఎస్ పార్టీ ఇంచార్జి ఠాకూర్ జీవన్‌సింగ్ తదితరులు స్వామిగౌడ్‌ను పరామర్శించారు. టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున దవాఖానకు తరలివచ్చారు.

బోరున విలపించిన స్వామిగౌడ్ సతీమణి

కంటికి గాయమై సరోజినీదేవి కంటి దవాఖానలో చికిత్స పొందుతున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను చూసి ఆయన సతీమణి మనోరమ బోరున విలపించారు. చికిత్స పొందుతున్న చైర్మన్‌ను చూసి ఆమె చలించిపోయారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీలను అడ్డుకున్న టీఆర్‌ఎస్ కార్యకర్తలు

మండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను పరామర్శించేందుకు సరోజినీ దవాఖానకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలను టీఆర్‌ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. స్వామిగౌడ్‌ను పరామర్శించేందుకు వచ్చిన కాంగ్రెస్ ఎమ్మెల్సీలు షబ్బీర్ అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డిలను లోపలకు వెళ్లకుండా కార్వాన్ టీఆర్‌ఎస్ ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్‌సింగ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు అడ్డుకున్నారు. అక్కడే ఉన్న పశ్చిమ మండలం డీసీపీ వెంకటేశ్వర్‌రావు వెంటనే స్పందించి జీవన్‌సింగ్, కార్యకర్తలను శాంతింపచేసి స్వామిగౌడ్‌తో గొడవ గురించి మాట్లాడి ఆయన అనుమతితో కాంగ్రెస్ ఎమ్మెల్సీలను లోపలకు తీసుకెళ్లారు.

ఈ సమావేశాల వరకు సస్పెండ్ చేయాలి

సభలో భౌతికదాడులకు పాల్పడిన కాంగ్రెస్ సభ్యులను ఈ సమావేశాలు పూర్తయ్యేవరకు సస్పెండ్ చేయాలి. కాంగ్రెస్ ప్రవర్తనను చూసి ప్రజలు సిగ్గుపడుతున్నారు. జరుగుతున్న అభివృద్ధి గురించి వినలేక, దేశమే అబ్బురపడేలా సాగుతున్న సంక్షేమ కార్యక్రమాలను కనలేక, పారదర్శక పాలనను చూడలేక కండ్లనిండా విషం నింపుకొని కాంగ్రెస్ నాయకులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు.

– నారదాసు లక్ష్మణరావు

కాంగ్రెస్‌ను బొందపెడతారు

కాంగ్రెస్ ఇప్పటికే ప్రజల్లో చులకన అయింది. స్వామిగౌడ్‌పై దాడి ఘటనతో వెనుకబడిన వర్గాలంతా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొందపెట్టడానికి సిద్ధంగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇప్పుడున్న సీట్లు కూడా కాంగ్రెస్‌కు రావు.

– ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్

వీధి గూండాల్లా వ్యవహరించారు

కాంగ్రెస్ సభ్యులు వీధి గూండాల్లా వ్యవహరించారు. ఇద్దరు బీసీ నేతలు మండలి చైర్మన్‌గా, అసెంబ్లీ స్పీకర్‌గా ఉండటాన్ని ఓర్వలేకనే హేయమైన చర్యకు పాల్పడ్డారు. 70 ఏండ్లుగా బీసీలకు కాంగ్రెస్ తీరని ద్రోహం చేసింది. తెలంగాణ వచ్చాక ఇప్పుడిప్పుడే బీసీల బతుకులు బాగుపడుతుంటే ఓర్చుకోలేకపోతున్నారు. కాంగ్రెస్ సభ్యుల తీరుపై జానారెడ్డి స్పందించకపోతే ఈ దాడి వెనుక ఆయన కూడా ఉన్నారని భావించే అవకాశం ఉంది.

– ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్

కాంగ్రెస్ దుర్నీతికి పరాకాష్ట

స్వామిగౌడ్‌పై దాడి కాంగ్రెస్ దుర్నీతికి పరాకాష్ట. గతంలోనూ ఎమ్మెల్యేగా పనిచేశాను. ఎప్పుడూ ఇలాంటి ఘటనలు జరుగలేదు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ నిరసనలు హుందాగా జరిగాయి. దాడి జరిగింది స్వామిగౌడ్‌పై కాదు.. యావత్ వెనుకబడిన సమాజంపై జరిగిన దాడి.

– ఎమ్మెల్యే గంగుల కమలాకర్

అసెంబ్లీలో దాడులు సరైన పద్ధతికాదు

అసెంబ్లీలో దాడులు పద్ధతికాదు. కాంగ్రెస్ నేతల వద్ద విషయంలేకనే దాడులకు పాల్పడ్డారు. విధానాల్లో వైఫల్యాలుంటే ఎత్తిచూపాలి తప్ప దాడులు సమంజసం కాదు. కాంగ్రెస్ చర్యను ప్రజలు గమనిస్తున్నారు.

– ఎమ్మెల్యే కొండా సురేఖ

విచక్షణ కోల్పోయారు

కాంగ్రెస్ నాయకులు విచక్షణ కోల్పోయి, అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారు. గవర్నర్ ప్రసంగిస్తుండగా మండలి చైర్మన్‌పై హెడ్‌ఫోన్ విసరడం సరికాదు. అసహనంలో ఉన్నందునే దాడులకు పాల్పడుతున్నారు.

– ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

గాంధీభవన్‌లో వ్యవహరించినట్టే అసెంబ్లీలో

కాంగ్రెస్ నాయకులు గాంధీభవన్‌లో ఎట్లా ఉంటారో, అసెంబ్లీలోనూ అదేవిధంగా ప్రవర్తిస్తున్నారు. అభివృద్ధి ఫలాలు ఇప్పుడిప్పుడే ప్రజలకు అందుతున్నాయి. కాంగ్రెస్ నేతలు తమ రాజకీయ భవిష్యత్తు అంధకారం అవుతుందనే ఇలా ప్రవర్తిస్తున్నారు.


– ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

పాత కౌన్సిల్ హాల్‌లోనే నేటినుంచి మండలి సమావేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి రాష్ట్రంలో కౌన్సిల్ సమావేశాలు జరిగిన జూబ్లీహాల్‌లోని పాతహాల్‌లోనే మంగళవారం నుంచి తెలంగాణ శాసనమండలి సమావేశాలు జరుగనున్నాయి. ఈ మేరకు తెలంగాణ లెజిస్లేటివ్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్యులు సోమవారం నోటిఫికేషన్ జారీచేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఈ హాల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలో ఉన్నది. అందులో ఏపీ కౌన్సిల్ సమావేశాలు జరిగేవి. గత ఏడాదికాలంగా ఏపీ అసెంబ్లీ, కౌన్సిల్ బడ్జెట్ సమావేశాలు అమరావతిలో కొనసాగుతున్నాయి. హాల్ ఖాళీగా ఉండటంతో తెలంగాణ కౌన్సిల్‌కు ఇవ్వాలని రాష్ట్ర మండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్లు కోరిన మీదట ఏపీ ప్రభుత్వం ఆ హాల్‌ను తెలంగాణ ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేసింది. మండలి సమావేశాలకు ఈ హాల్ అనువుగా, సౌకర్యంగా ఉండటంతో, అసెంబ్లీ సచివాలయ అధికారులు హుటాహుటిన దానిని శుభ్రంచేసి, రంగులు వేసి సిద్ధంచేశారు.

గవర్నర్ ప్రసంగం అడ్డుకునేందుకే విసిరాను..

- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ : గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే ఉద్దేశంతోనే హెడ్‌ఫోన్ విసిరానని, అది పొరపాటున శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు తాకిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం అసెంబ్లీ మీడియాపాయింట్‌లో ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతు ధరపై నిరసన వ్యక్తం చేయడానికి వెళితే తమను కొట్టించారని ఆరోపించారు. అసెంబ్లీలో పోడియం వద్ద నిరసన వ్యక్తం చేయడం మామూలేనన్నారు. ఈ రోజు జరిగిన సంఘటనకు ముఖ్యమంత్రి కారణమని చెప్పారు. తన కాళ్లకు కూడా గాయాలయ్యాయని కోమటిరెడ్డి తెలిపారు.

జాతీయగీతంకోసం బాధ దిగమింగాను

- ప్రశ్నించే హక్కు అందరికీ ఉంటుంది
- కానీ.. దాడులుచేయడం అప్రజాస్వామికం
- సరోజినీ కంటి దవాఖానలో మీడియాతో స్వామిగౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అసెంబ్లీలో కాంగ్రెస్ నాయకులు వ్యవహరించిన తీరు బాధాకరమని శాసనమండలి చైర్మన్ కే స్వామిగౌడ్ వ్యాఖ్యానించారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్య అన్నారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో గవర్నర్ ప్రసంగం ముగిసే సమయంలో కాంగ్రెస్ నాయకులు ముందుగా మైక్‌తో దాడి చేశారని, అది తగులలేదని, చివరిలో మరోమారు హెడ్‌సెట్ విసరడంతో అది తగులడంతో తన కంటికి గాయమైందని చెప్పారు. ఈ క్రమంలో జాతీయగీతం కోసం బాధను దిగమింగుకుని, జాతీయగీతాలాపన ముగిసి, గవర్నర్‌ను పంపించిన తర్వాత సీఎం కేసీఆర్ సూచనతో సరోజినీదేవి కంటి హాస్పిటల్‌కు చికిత్సకోసం వచ్చానని తెలిపారు. దవాఖానలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంటుందని, కానీ, ఇలా అప్రజాస్వామిక పద్ధతుల్లో, దాడులుచేయడం సిగ్గుచేటన్నారు. సభ గౌరవాన్ని ఉల్లంఘిస్తూ కాంగ్రెస్‌సభ్యులు చేసిన దాడిని ఖండించారు. దీనిపై వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. పెద్ద పార్టీగా చెప్పుకొనే కాంగ్రెస్.. ఈ దాడి ద్వారా ఏం సందేశం పంపాలనుకుంటున్నదని ఆయన ప్రశ్నించారు.

స్వామిగౌడ్‌పై దాడి దురదృష్టకరం



మండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై దాడి దురదృష్టకరం, చాలా సిగ్గు చేటైన విషయం. గౌరవమైన చైర్మన్‌పై దాడి ప్రజాస్వామ్యానికే మాయనిమచ్చ.

–డిప్యూటీ సీఎం మహమూద్ అలీ


హేయమైన చర్య



స్వామిగౌడ్ పై అసెంబ్లీలో జరిగిన దాడి హేయమైన చర్య.ఇది చాలా దారుణ సంఘటన. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించాం.

– డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెప్తారు



తెలంగాణలోకాంగ్రెస్ నాయకులకు పుట్టగతులు లేవన్న విషయం స్వామిగౌడ్‌పై దాడితో అర్థమైంది. వారికి ప్రజలే బుద్ధి చెప్తారు. దాడిపై స్పీకర్ చర్యలు తీసుకుంటారు. ఎంతటివారైనా కఠినంగా వ్యవహరిస్తాం.

–హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి

కాంగ్రెస్ గూండాయిజం సాగదు



కాంగ్రెస్ నాయకులు ఇంకా ఎంతకాలం గూండాయిజం చెలాయిస్తారు? కాంగ్రెస్ తీరు చూశాక ఆ పార్టీ నాయకులకు బడుగు బలహీన వర్గాలపై ఎంత అక్కసు ఉందో తేటతెల్లమైంది.

– పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని

కాంగ్రెస్ నేతలను ప్రజలే తరుముతారు



ఒకప్పుడు అసెంబ్లీ నిర్వహణకు ప్రభుత్వాలు భయపడుతుండేవి. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలే భయపడుతున్నాయి. ప్రజావ్యతిరేక పనులకు పాల్పడుతున్న నాయకులను ప్రజలే తన్ని తరిమే కాలం వస్తుంది.

– వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి

బీసీల జోలికొస్తే పాతరేస్తాం



బీసీల జోలికొస్తే కాంగ్రెస్ నేతలను ప్రజాక్షేత్రంలో పాతరేస్తాం. ఉద్యమకాలంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం స్వామిగౌడ్‌పై హత్యాయత్నం చేయగా, ఇప్పుడు విపక్షంలో ఉన్న అదే పార్టీ సభ్యులు రెండోసారి కుట్రచేశారు.

– బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగురామన్న

కాంగ్రెస్ దాడి హేయమైన చర్య



అసెంబ్లీలో మండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై కాంగ్రెస్ హెడ్‌ఫోన్ విసరడం హేయమైన చర్య. సభలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరు దారుణంగా ఉంది. ప్రజాసమస్యలను సభ దృష్టికి తీసుకురావాలంటే చర్చించాల్సిందిపోయి భౌతికదాడులకు దిగడం దారుణం.

– దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

పథకం ప్రకారమే దాడి



కాంగ్రెస్ సభ్యులు పథకం ప్రకారమే గవర్నర్, స్పీకర్, మండలి చైర్మన్‌లను లక్ష్యంగా చేసుకొని అరాచకానికి పాల్పడ్డారు. భౌతికదాడులకు పాల్పడాలన్న వ్యూహంతో కాంగ్రెస్ సభ్యులు సిద్ధమవుతున్నారని మాకు రెండ్రోజుల క్రితమే సమాచారం ఉంది.

– శాసనమండలిలో చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి

కొందరు మద్యం తాగారు, ఊగారు



సభలో దాడులు కాంగ్రెస్ దుర్మార్గానికి, ఆ పార్టీ నాయకుల్లో పెరిగిన అసహనానికి నిదర్శనం. కొందరు కాంగ్రెస్ సభ్యులు మద్యం సేవించి వచ్చారు. మద్యం మత్తులో సరిగ్గా నిలబడలేక ఊగారు. ఒక సభ్యుడు మత్తుతో తూలి జానారెడ్డిపై పడగా ఆయన సభ నుంచి బయటకు వెళ్లిపోయారు.

– శాసనమండలిలో విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఇది బలహీన వర్గాలపై జరిగిన దాడి



మండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై జరిగిన దాడి మొత్తం బడుగు బలహీన వర్గాలపై జరిగిన దాడి. ప్రజాస్పందన లేక కాంగ్రెస్ నాయకులకు మతి భ్రమించి, సభలో వీరంగం వేశారు. ఈ రోజు తెలంగాణ చట్టసభల చరిత్రలోనే బ్లాక్‌డే.

– ప్రభుత్వ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు

సిద్దిపేట జిల్లాలో జపాన్ పౌల్ట్రీ

- 140 ఎకరాల్లో నెలకొల్పనున్న ఇసే సంస్థ
- సుజుకీ కంపెనీ సాయంతో బ్యాటరీల ఆర్ అండ్ డీ కేంద్రం
- రెండుమూడేండ్లలో ఉత్పత్తి ప్రారంభం
- అనుమతులు, రాయితీల పత్రాలను అందించిన ప్రభుత్వం
- జపాన్‌తో తెలంగాణకు సత్సంబంధాలు: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రానికి మరో ప్రముఖ పరిశ్రమ తరలివచ్చింది. జపాన్‌కు చెందిన ఇసే ఫుడ్స్ సంస్థ సిద్దిపేట జిల్లాలో పౌల్ట్రీ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. హైదరాబాద్‌లోని హోటల్ ఐటీసీ కాకతీయలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ అనుమతులు, రాయితీల పత్రాలను రాష్ట్ర మంత్రులు కే తారక రామారావు, ఈటల రాజేందర్, పట్నం మహేందర్‌రెడ్డి సమక్షంలో పరిశ్రమల శాఖ తరఫున ఐటీశాఖ ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ ఇసే కంపెనీ సీనియర్ ప్రతినిధి బృందానికి అందజేశారు. అనంతరం జపాన్ ప్రధాని మంత్రి ప్రత్యేక సలహాదారు మియకోషి, ఇసే ఫుడ్స్ చైర్మన్ హికనోబు, కంపెనీ ప్రతినిధి బృందంతో మంత్రులు సమావేశమై చర్చించారు. జపాన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే ఇసే ఫుడ్స్ గత ఏడాది రూ.2,868 కోట్ల (47 బిలియన్ యెన్‌లు) అమ్మకాలను నమోదు చేసింది. కంపెనీకి పలు దేశాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్లు ఉన్నాయి. ఇప్పుడు సిద్దిపేట జిల్లా నంగనూరు మండలం నర్మెట్లలో 140 ఎకరాల్లో పరిశ్రమను ఏర్పాటు చేయనున్నది. ఇక్కడ కోడి గుడ్ల ప్రాసెసింగ్, కోళ్ల ఫాంలలో లభించే వ్యర్థాలతో సేంద్రియ ఎరువులను తయారు చేయనున్నది. పౌల్ట్రీ టెక్నాలజీలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతోపాటు ఇక్కడి విద్యార్థులను శిక్షణ కోసం జపాన్‌కు తీసుకెళ్లనున్నది. దీంతోపాటు ఇసే సంస్థ సుజుకీ కంపెనీ భాగస్వామ్యంతో లిథియం అయాన్ బ్యాటరీల ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుంది. ఈ కేంద్రంలో రాబోయే రెండుమూడేండ్లలో బ్యాటరీల ఉత్పత్తి ప్రారంభం అవుతుంది. అంతేకాకుండా టోక్యో ఒలంపిక్స్‌లో పాల్గొననున్న భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు హైదరాబాద్‌లోని నేషనల్ బ్యాడ్మింటన్ అకాడమీతో ఇసే సంస్థ పరస్పర అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నది.



మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్, పట్నం మహేందర్‌రెడ్డి సమక్షంలో ఇసే ఫుడ్స్ కంపెనీ ప్రతినిధికి రాష్ట్ర ప్రభుత్వ అనుమతులు, రాయితీల పత్రాలను అందజేస్తున్న ఐటీశాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్

ఎగ్ బాస్కెట్ ఆఫ్ ఇండియాగా రాష్ట్రం

జపాన్‌కు చెందిన ప్రముఖ కంపెనీ రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం హర్షణీయమని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పెట్టుబడుల కోసం జపాన్‌లో పర్యటించిన సందర్భంగా ఇసే సంస్థతో ఎంవోయూ కుదుర్చుకున్నామని గుర్తుచేశారు. తెలంగాణకు, జపాన్‌కు మధ్య మంచి సంబంధాలున్నాయన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులకు జైకా సహకారం అందిస్తున్నదని చెప్పారు. తెలంగాణను సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా మార్చాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో ఒక ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటుచేస్తామని చెప్పారు. రాష్ట్రం ఇప్పటికే 'ఎగ్ బాస్కెట్ ఆఫ్ ఇండియా'గా ఉన్నదని, ఇప్పుడు ఇసే ఫుడ్స్ కంపెనీ రావడం హర్షణీయమని ఆర్థికశాఖమంత్రి ఈటల పేర్కొన్నారు. అనంతరం జపనీస్ భాషలో ముద్రించిన తెలంగాణ పాలసీ ప్రతిని రాష్ట్ర మంత్రులు జపాన్ ప్రతినిధులకు అందించారు.

ప్రభుత్వం చొరవ అభినందనీయం: జపాన్ ప్రధాని సలహాదారు

తెలంగాణకు జపాన్ పరిశ్రమలను రప్పించాలన్న ప్రభుత్వ చొరవను జపాన్ ప్రధాన మంత్రి సలహాదారు మియకోషి అభినందించారు. గతంలో మంత్రి కేటీఆర్ జపాన్ పర్యటనకు వచ్చినప్పుడు ఇక్కడి విధానాలను అద్భుతంగా వివరించారని కొనియాడారు. ఇసే పరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో సహకరిస్తున్నదంటూ కృతజ్ఞతలు తెలిపారు. ఇతర రంగాల్లోనూ సహకారం కొనసాగుతుందని చెప్పారు. తెలంగాణలో చేపట్టిన ప్రాజెక్టులు పూర్తయితే వ్యవసాయోత్పత్తులు మరింత పెరుగుతాయని, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అవకాశాలు విస్తరిస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు నచ్చడంతోపాటు ఇక్కడి ప్రభుత్వం చూపిన చొరవ వల్లే ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నామని ఇసే కంపెనీ చైర్మన్ హికనోబు ఇసే పేర్కొన్నారు. గుడ్ల ఉత్పత్తిలో తమ కంపెనీ సరికొత్త టెక్నాలజీని వినియోగిస్తున్నదని, ఈ ప్రక్రియలో ఎలాంటి యాంటీ బయోటిక్స్ వినియోగించడం లేదని చెప్పారు.

బల్దియా ఉద్యోగులకు ఉగాది కానుకగా హెల్త్‌కార్డులు!

ఇండ్ల పట్టాలు, పదోన్నతులకూ చర్యలు

మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

జీహెచ్ఎంసీ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో ప్రచారం



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: జీహెచ్ఎంసీ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు, ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నదని, సాధ్యమైనంత తొందరగా వీటిని పంపిణీచేసేందుకు చర్యలు తీసుకుంటామని మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ హామీ ఇచ్చారు. ముఖ్యంగా హెల్త్‌కార్డులు ఉగాది కానుకగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. అర్హతలకు అనుగుణంగా పదోన్నతులు, ఇతర బెనిఫిట్స్ ఇచ్చేందుకు కూడా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. జీహెచ్ఎంసీ కార్మిక సంఘం గుర్తింపుకోసం ఈనెల 17న జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో సోమవారం టీఆర్‌ఎస్‌కేవీ అనుబంధ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో టీఆర్‌ఎస్ కేవీ అధ్యక్షుడు రాంబాబు, జీహెచ్ఎంఈయూ అధ్యక్షుడు యూ గోపాల్ ప్రచార సభ ఏర్పాటుచేశారు. ఈ సభలో రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ నెలరోజుల్లోనే హెల్త్‌కార్డులు జారీచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఉద్యోగుల ఇండ్ల స్థలాల కోసం శామీర్‌పేట వద్ద స్థలాన్ని గుర్తించామని, ఏదో ఒక ప్రాంతంలో తప్పనిసరిగా ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వీటితోపాటు పదోన్నతులు, వారికి రావాల్సిన ఇతర ప్రయోజనాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం కే చంద్రశేఖర్‌రావు కార్మికుల పక్షపాతి అని, ఉద్యోగుల ఫిట్‌మెంట్‌తో పాటు ఇతర అంశాల్లో కార్మికులు, ఉద్యోగులు అడిగినదానికన్నా అధికంగానే సహాయం అందించినట్టు గుర్తుచేశారు. ఇదే క్రమంలో వచ్చే బల్దియా కార్మిక సంఘం ఎన్నికల్లో కూడా గోపాల్ నేతృత్వంలోని టీఆర్‌ఎస్ కేవీ అనుబంధ జీహెచ్ఎంఈయూను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తిచేశారు.

వేటు వేయండి

మూడోపేజీ తరువాయి...

నిపుణులతో స్పీకర్ సంప్రదింపులు జరుపుతున్నారని తెలిసింది. మంగళవారం స్పీకర్ తన నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత మరుసటిరోజుకు సభను వాయిదావేసిన స్పీకర్ మధుసూదనాచారి.. తన చాంబర్‌లో బీఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యుల ప్రవర్తనపైనే ప్రధానంగా చర్చ జరిగినట్టు తెలిసింది. తొలుత స్పీకర్ ఈ అంశాన్ని లేవనెత్తినట్టు సమాచారం. గవర్నర్‌పై దాడిచేయడం బాధాకరమని, కౌన్సిల్ చైర్మన్‌ను గాయపర్చడం అత్యంత దారుణమైన విషయమని, కాంగ్రెస్ సభ్యుల తీరు చట్టసభలను అగౌరవపరిచేలా ఉందని చెప్పారని తెలిసింది. మైకులు విరిచి, ఉద్దేశపూర్వకంగా దాడికి ఉపక్రమించడాన్ని ప్రజాస్వామికవాదులెవ్వరూ హర్షించబోరన్నారు. తాను ఈ తరహా చర్యలను సమర్థించబోనని స్పష్టం చేశారు. శాసనసభ సమావేశాలు, తొలి రోజు గవర్నర్ ప్రసంగం నేపథ్యంలో స్వయంగా కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, మల్లు భట్టివిక్రమార్కలకు ఫోన్‌చేశానని, గవర్నర్ ప్రసంగానికి సహకరించాలని కూడా కోరానని గుర్తుచేశారు. స్పీకర్ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నట్లుగానే కాంగ్రెస్ పక్ష నేత జానారెడ్డి మాట్లాడుతూ జరిగిన ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నామని చెప్పారు. ఈ ఘటన విచారకరమని వ్యాఖ్యానించారు.

మొత్తం సభ నుంచి సస్పెండ్ చేయాలి: ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్

శాసనసభ అంటే దేవాలయంకన్నా గొప్ప స్థలమని, ఇలాంటి సభలో కాంగ్రెస్ పార్టీ సభ్యులు అత్యంత దారుణంగా వ్యవహరించారని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. ఇలా వ్యవహరించిన వారిని మొత్తం సభ, సమావేశాల నుంచి శాశ్వతంగా సస్పెండ్ చేయాలని బీఏసీ సమావేశంలో డిమాండ్ చేశారు. ఎట్టిపరిస్థితుల్లోను ఇలాంటి పెడ ధోరణులను ఉపేక్షించవద్దని కోరారు. అవసరమైతే పోలీసు కేసు పెట్టాలని, కాగ్నిజెన్స్ అఫెన్స్ కింద కేసు బుక్ చేయాలని అన్నారు. అలా చేస్తేనే మరోసారి ఈ తరహా ఘటనలు పునరావృతం కావని అభిప్రాయపడ్డారు. 'శాసనసభ కుస్తీ మైదానం కాదు. ఇది ప్రజాస్వామ్య దేవాలయం. వాస్తవానికి ఇంత జరిగినపుడు బీఏసీ పెట్టకుండా ఎమర్జెన్సీ సమావేశాన్ని ఏర్పాటుచేసి, గవర్నర్, కౌన్సిల్ చైర్మన్‌లపై దాడులు చేసినవారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించాల్సింది. ఇది కేవలం మండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై దాడి కాదు.. ప్రజాస్వామ్యంపై దాడి' అని అక్బరుద్దీన్ అన్నారు. బీఏసీలో మెజార్టీ సభ్యులు ఈ తరహా అప్రజాస్వామిక చర్యలపై కఠినంగా ఉండాలన్న అభిప్రాయం వ్యక్తంచేశారు. గతంలో పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యే రోజాను ఏడాదికిపైగా సస్పెండ్ చేశారని, మహారాష్ట్రలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా అడ్డుకొని, గవర్నర్‌పై దాడిచేసిన సభ్యులను మూడేండ్లకుపైగా సస్పెండ్ చేశారని, పార్లమెంటులో కూడా ఇటువంటి దుష్ప్రవర్తనకు పాల్పడ్డవారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించారని పలువురు సభ్యులు ప్రస్తావించినట్టు తెలిసింది. అవసరమైతే సభ్యత్వ రద్దుకు శాసనసభలో తీర్మానం చేద్దామని కూడా పలువురు సభ్యులు స్పీకర్‌కు ప్రతిపాదించినట్టు సమాచారం.

చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు అప్పగిస్తూ నిర్ణయం..

గవర్నర్ ప్రసంగం సందర్భంగా గవర్నర్, మండలి చైర్మన్‌పై దాడి చేసినవారిపై ఎలాంటి చర్యలైనా తీసుకునే అధికారాన్ని బీఏసీ సమావేశం స్పీకర్ మధుసూదనాచారికే అప్పగించిందని సమాచారం. స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని సభ్యులు చెప్పారని తెలిసింది. వీడియో ఫుటేజీ చూసి స్పీకర్ తగు నిర్ణయం తీసుకోవాలని కోరారని సమాచారం.

న్యాయనిపుణులతో స్పీకర్ చర్చలు..

గవర్నర్ ప్రసంగం సందర్భంగా జరిగిన ఘటనలపై స్పీకర్ మధుసూదనాచారి, శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు సోమవారమే విచారణ ప్రారంభించారు. బీఏసీ సమావేశం అనంతరం స్పీకర్ స్వయంగా చీఫ్‌మార్షల్‌తో మాట్లాడారు. అక్కడ విధుల్లో ఉన్న మార్షల్స్‌తో, శాసనసభ సిబ్బంది నుంచి సమాచారం సేకరించారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా హాలులో ఉన్న ఐదు కెమెరాలు చిత్రీకరించిన వీడియో ఫుటేజీని తెప్పించుకుని పరిశీలించారు. మొత్తం నాలుగు హెడ్‌ఫోన్ సెట్లను విసిరినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. దీంతోపాటు ఒక కళ్లజోడు, పుస్తకాలు, కాగితాలు కూడా విసిరినట్లు, మార్షల్స్‌పై దాడికి పాల్పడ్డట్టు తేలింది. రాజ్యాంగం ప్రకారం, శాసనసభ నిబంధనల ప్రకారం ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నదానిపై న్యాయనిపుణులు, రాజ్యాంగ నిపుణులతో సైతం స్పీకర్ చర్చించారని సమాచారం.

కాంగ్రెస్ గూండాగిరీ

మూడోపేజీ తరువాయి...

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీకే అరుణ, రామ్మోహన్‌రెడ్డి, వంశీచందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డి, ఇతర సభ్యులు వెల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. వెకిలినవ్వులు నవ్వుతూ గవర్నర్ ప్రసంగాన్ని అపహాస్యం చేశారు. వెల్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్న మార్షల్స్‌పైనా కొందరు కాంగ్రెస్ సభ్యులు దౌర్జన్యం చేశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఓ మార్షల్ ముఖంపై దాడిచేశారు. మార్షల్ నోట్లోంచి రక్తంకారుతున్నా రామ్మోహన్‌రెడ్డి పట్టించుకోలేదు. కాంగ్రెస్ సభ్యుల దాడిలో మరికొందరు మార్షల్స్ స్వల్పంగా గాయపడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మార్షల్స్‌పై దాడులకు తెగబడుతూనే అసహనంతో ఊగిపోయారు. మరోవైపు బడ్జెట్ ప్రసంగపాఠాన్ని చించి, గవర్నర్‌పై విసిరేశారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మైక్‌లను విరిచారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కళ్లద్దాలను సైతం ఆయన గవర్నర్ పైకి విసరడం కనిపించింది. నాలుగు హెడ్‌సెట్‌లను విరిచి గవర్నర్ వైపు విసిరారు. ప్రసంగం పూర్తవుతున్న క్రమంలో కోమటిరెడ్డి గవర్నర్‌వైపు విసిరిన హెడ్‌ఫోన్.. వేగంగా దూసుకుపోయి, ఆయన పక్కనే నిల్చున్న స్వామిగౌడ్ కంటిపైన తాకింది. నేరుగా తాకడంతో కార్నియా దెబ్బతిన్నది. అయినప్పటికీ నొప్పిని భరించిన స్వామిగౌడ్ జాతీయగీతాలాపన అనంతరం స్పీకర్ మధుసూదనాచారితో కలిసి గవర్నర్‌కు సభనుంచి ప్రోటోకాల్ ప్రకారం వీడ్కోలు పలికారు. ఆ తర్వాత అసెంబ్లీలోని డిస్పెన్సరీలో వైద్యులు మండలి స్వామిగౌడ్ కంటికి ప్రాథమిక చికిత్స చేసి, సరోజినీదేవి నేత్రవైద్యశాలకు తీసుకువెళ్లాలని సూచించారు. మెహిదీపట్నంలోని సరోజినీదేవి హాస్పిటల్‌లో సూపరింటెండెంట్ రవీందర్‌గౌడ్ పర్యవేక్షణలో వైద్యుల బృందం స్వామిగౌడ్‌కు చికిత్స చేసింది. హెడ్‌ఫోన్ తగలడంవల్ల సున్నితమైన కార్నియా కొంత దెబ్బతిన్నదని డాక్టర్ రవీందర్‌గౌడ్ తెలిపారు. స్వామిగౌడ్‌ను 24 గంటలపాటు వైద్యుల పర్యవేక్షణలోనే ఉంచుతున్నట్టు చెప్పారు. మంగళవారం మధ్యాహ్నానికి దవాఖాననుంచి డిశ్చార్జిచేసే అవకాశముందని తెలిపారు. కాంగ్రెస్ సభ్యులు సభలో అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా భౌతికదాడులకు పాల్పడటం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతున్నది.

దాడికి ప్రయత్నిస్తూ.. పడిపోయి.. లేవలేక!

శాసనసభలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రెచ్చిపోయి గవర్నర్ లక్ష్యంగా వీరంగం వేశారు. మైకులు విరిచి, హెడ్‌ఫోన్లను ఊడబీకి వాటిని గవర్నర్‌పైకి విసిరారు. చేతికి అందుబాటులో ఉన్న వస్తువులను విసిరేక్రమంలో సభలో సభ్యుల కుర్చీల ముందుండే బెంచ్‌పైకి ఎక్కారు. హెడ్‌ఫోన్‌ను బలంగా విసిరిన ఆయన పట్టుతప్పి కిందపడిపోయారు. ఒక నిమిషంవరకు పైకి లేవలేకపోయారు. చివరకు ఎమ్మెల్సీలు షబ్బీర్‌అలీ, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేయి అందించి పైకిలేపారు. పట్టుతప్పి పడిపోయిన కోమటిరెడ్డి పైకి లేవలేకపోవడం సొంతపార్టీలోనే చర్చనీయాంశంగా మారింది. ఆయన మద్యం తాగి సభకు వచ్చారన్న ఆరోపణలు కూడా వినిపించాయి.

టీఆర్‌ఎస్ సభ్యుల సంయమనం

సభలో కాంగ్రెస్ సభ్యులు అకారణంగా రెచ్చిపోయి ప్రవర్తించినా, దౌర్జన్యంగా వ్యవహరించినా టీఆర్‌ఎస్ సభ్యులు సహనంతో సంయమనం పాటించారు. గవర్నర్ ప్రసంగం సమయంలో ప్రతిపక్ష సభ్యులు రెచ్చిపోయేలా ప్రవర్తించే అవకాశముందని, సభ్యులంతా సంయమనం పాటించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదివారంనాటి టీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశంలో ముందుగానే అప్రమత్తంచేశారు. సభానాయకుడి సూచనను అనుసరించి టీఆర్‌ఎస్ సభ్యులు సహనంతో ఉన్నారు.

వాణిజ్య

WWW.NTNEWS.COM | నమస్తే తెలంగాణ

మంగళవారం 13 మార్చి 2018 [హైదరాబాద్] 13

సెన్సెక్స్	నిఫ్టీ
33,918	10,421
↗ 611	↗ 194

ముడి చమురు (బ్రెంట్) ↘ 64.65 డాలర్లు

బంగారం ధరలు

ముంబై (రూ.లలో)	
24 క్యారెట్లు	30,430
22 క్యారెట్లు	30,280
వెండి (కిలో)	38,335

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	59.11	68.54
బహ్రెయిన్ దినార్	160.09	183.46
కువైట్ దినార్	178.88	222.68
సౌదీ రియాల్	15.72	18.62
యూఏఈ దిర్హామ్	16.09	18.81

చికెన్ ధరలు

	(రూ.లలో)
ఫారం ధర	63.00
రిటైల్ లైవ్	85.00
డ్రెస్డ్	123.00
స్కిన్‌లెస్	140.00

నెక్ (వంద గుడ్లకు)

	(రూ.లలో)
హైదరాబాద్	330-00
రంగారెడ్డి	330-00
మెదక్	330-00
కరీంనగర్	332-00
వరంగల్	332-00
రిటైల్ ప్రైస్	3-90

పోటెత్తిన పెట్టుబడులు



దేశీయ స్టాక్ మార్కెట్లలో గ్లోబల్ ర్యాలీ
సెన్సెక్స్ 611, నిఫ్టీ 195 పాయింట్ల వృద్ధి

ముంబై, మార్చి 12: అంతర్జాతీయ పరిణామాలు కలిసొచ్చాయి. మదుపరులు పెట్టుబడులతో కదం తొక్కారు. బుల్ రంకేసింది. దేశీయ స్టాక్ మార్కెట్లలో లాభాల పంట పండింది. సోమవారం భారతీయ ఈక్విటీ మార్కెట్లలో కనిపించిన పరిణామ క్రమమిది. ప్రపంచ మార్కెట్‌లో తొలగిన వాణిజ్య యుద్ధ భయాలు.. రెండేండ్లలో ఎన్నడూ లేనంతగా ఈ ఒక్కరోజే సూచీలను పుంజుకునేలా చేశాయి. సెన్సెక్స్ 610.55 పాయింట్లు ఎగబాకి 33,917.94 వద్ద ముగియగా, 2016 మార్చి 1 (777.35 పాయింట్లు) తర్వాత ఈ స్థాయిలో లాభాలు రావడం ఇదే తొలిసారి. ఇక నిఫ్టీ సైతం 194.55 పాయింట్లు ఎగిసి 10,421.40 వద్ద నిలిచింది. ఉదయం ఆరంభం నుంచి సూచీలు లాభాల్లోనే కదలాడగా, ఒకానొక దశలోనైతే సెన్సెక్స్ 33,962.48 పాయింట్లు, నిఫ్టీ 10,433.65 పాయింట్ల స్థాయిని చేరుకున్నాయి. ఇక ఆటో, మెటల్, చమురు, గ్యాస్, ఎఫ్‌ఎంసీజీ, విద్యుత్, బ్యాంకింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, టెక్నాలజీ, ఐటీ, క్యాపిటల్ గూడ్స్, పీఎస్‌యూ, హెల్త్‌కేర్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియల్టీ రంగాల షేర్లకు పెద్ద ఎత్తున మదుపరుల నుంచి కొనుగోళ్ల మద్దతు లభించింది. ముఖ్యంగా విదేశీ మదుపరులు అమితాసక్తిని ప్రదర్శించడంతో ఆటో షేర్లు 7.77 శాతం, మెటల్ షేర్లు 4.43 శాతం మేర లాభాలను అందుకున్నాయి. స్పెక్ట్రమ్ అవసరాల కోసం చెల్లింపులు, రుణాల రీఫైనాన్స్‌కు రూ.16,500 కోట్ల నిధుల సమీకరణకు బోర్డు ఆమోదం తెలుపడంతో భారతీ ఎయిర్‌టెల్ షేర్ విలువ 4.68 శాతం పుంజుకున్నది. మూడీస్ ఇన్వెస్టర్స్ సరీస్ ఎన్టీపీసీకి బీఏఏ2 రేటింగ్‌ను ఇవ్వడంతో ఆ సంస్థ షేర్ విలువా 4.33 శాతం పెరిగింది. ఇక ఇటీవలి వస్తు, సేవల పన్ను మండలి (జీఎస్టీ కౌన్సిల్) సమావేశంలో సిగరెట్లపై సెస్సును యథాతథంగానే ఉంచడంతో ఐటీసీ షేర్ల విలువ కూడా 4.09 శాతం పెరిగింది. బీఎస్‌ఈ మిడ్-క్యాప్ సూచీ 0.76 శాతం, స్మాల్-క్యాప్ సూచీ 0.56 శాతం మేర లాభపడ్డాయి.

లాభాల్లో అంతర్జాతీయ మార్కెట్లు

సోమవారం అంతర్జాతీయంగానూ స్టాక్ మార్కెట్లు ఆకర్షణీయ లాభాలను అందుకున్నాయి. ఆసియా మార్కెట్లలో కీలక సూచీలైన హాంకాంగ్ 1.93 శాతం, జపాన్ 1.65 శాతం, సింగపూర్ 0.97 శాతం, చైనా 0.59 శాతం చొప్పున పెరిగాయి. ఐరోపా మార్కెట్లలోనూ ప్రధాన సూచీలైన జర్మనీ 0.52 శాతం, ఫ్రాన్స్ 0.14 శాతం, లండన్ 0.04 శాతం మేర వృద్ధి చెందాయి.

7 శాతం నష్టపోయిన ఆంధ్రా బ్యాంక్ షేర్

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ ఆంధ్రా బ్యాంక్ షేర్ విలువ సోమవారం ట్రేడింగ్‌లో దాదాపు 7 శాతం పడిపోయింది. రూ.5,000 కోట్ల మోసం కేసులో ఆంధ్రా బ్యాంక్ మాజీ డైరెక్టర్ అనూప్ ప్రకాశ్ గార్గ్‌పై ఉన్న ఆరోపణలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చార్జిషీట్ దాఖలు చేసింది. దీంతో ఒక్కసారిగా బ్యాంక్ షేర్లు కుప్పకూలాయి. ఒకానొక దశలో బీఎస్‌ఈలో 15.45 శాతం మేర దిగజారి రూ.32.55 వద్దకు క్షీణించిన ఆంధ్రా బ్యాంక్ షేర్ విలువ.. మార్కెట్ ముగిసే సమయానికి 6.88 శాతం నష్టంతో రూ.35.85 వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఈలోనూ 6.74 శాతం పతనంతో రూ.35.95 వద్ద నిలిచింది. ఫలితంగా బ్యాంక్ మార్కెట్ విలువ ఈ ఒక్క రోజే రూ.231 కోట్లు నష్టపోయి రూ.3,128.99 కోట్లకు తగ్గింది. ఐడీబీఐ బ్యాంక్ (8.49 శాతం), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (3.04 శాతం), బ్యాంక్ ఆఫ్ ఇండియా (2.51 శాతం), సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (2.22 శాతం), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (0.94 శాతం), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (0.12 శాతం) షేర్లూ పడిపోయాయి. కాగా, గుజరాత్‌కు చెందిన ఔషధ రంగ సంస్థ స్టెర్లింగ్ బయోటెక్ లిమిటెడ్ ప్రమేయమున్న ఈ మోసం కేసులో ఆంధ్రా బ్యాంక్ నేతృత్వంలోని బ్యాంకుల కూటమికి రూ.5,000 కోట్లు నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే.

పారిస్, లండన్ ఎక్స్ఛేంజీలకు ఇన్ఫీ గుడ్‌బై

యూరోనెక్స్ట్ పారిస్, యూరోనెక్స్ట్ లండన్ ఎక్స్ఛేంజీల నుంచి ఇన్ఫోసిస్ స్వచ్ఛందంగా వైదొలిగింది. వీటిలోని తమ అమెరికన్ డిపాజిటరీ షేర్స్ (ఏడీఎస్) డీలిస్టింగ్‌ను సోమవారం ప్రకటించింది. తమ షేర్ల ట్రేడింగ్ నిరాశాజనకంగా ఉండటమే ఇందుకు కారణమని తెలిపింది. అయితే న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కొనసాగుతామని ఇన్ఫోసిస్ స్పష్టం చేసింది.

రూ.1.78 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద

దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాలను అందుకున్న నేపథ్యంలో మదుపరుల సంపద ఈ ఒక్కరోజే లక్షలాది కోట్ల రూపాయలు ఎగిసింది. బీఎస్‌ఈలోని సంస్థల మార్కెట్ విలువ రూ.1.78 లక్షల కోట్లు ఎగబాకింది. సెన్సెక్స్ 611 పాయింట్లు పుంజుకున్న క్రమంలో రూ.1,78,393.67 కోట్లు పెరిగి రూ.1,44,52,009 కోట్లకు చేరింది. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 28 షేర్లు లాభాల్లోనే ముగియగా, భారతీ ఎయిర్‌టెల్, ఎన్టీపీసీ, ఐటీసీ, టాటా మోటార్స్, టాటా స్టీల్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యెస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఓఎన్‌జీసీ, విప్రో, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, ఆర్‌ఐఎల్, హెచ్‌యూఎల్, ఎల్‌అండ్‌టీ, సన్ ఫార్మా, కొటక్ మహీంద్రా, డాక్టర్ రెడ్డీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్, హీరో మోటోకార్ప్, మారుతి సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఆటో షేర్లు చెప్పుకోదగ్గ స్థాయిలో లాభపడ్డాయి.

ఎస్‌బీఐకి ఝలక్

కార్డు పరిమితి రూ.13 వేలైతే.. రూ.9 కోట్ల కొనుగోళ్లు చేశాడు!

న్యూఢిల్లీ, మార్చి 12: పరిమితికి మించి ఎస్‌బీఐ కార్డు ద్వారా కోట్ల రూపాయల్లో ఆన్‌లైన్ షాపింగ్ జరిపాడో ముంబై వాసి. రూ.13,000 (200 డాలర్లు) దాటి కొనుగోళ్లు చేయలేని కార్డుపై బ్రిటన్ ఈ-కామర్స్ వెబ్‌సైట్లలో ఏకంగా రూ.9.1 కోట్ల (1.41 మిలియన్ డాలర్లు) బిల్లులు చేశాడు. ఎస్‌బీఐ ఫిర్యాదుతో సదరు వ్యక్తిపై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ సోమవారం ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. నవీ ముంబైలోగల ఎస్‌బీఐ ఎన్నారై సీవుడ్స్ శాఖ.. యలమంచిలి సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్‌కు ఫారిన్ ట్రావెల్ కార్డులను జారీ చేసింది. ఒక్కో కార్డుపై ఖర్చుకున్న పరిమితి 200 డాలర్లు మాత్రమే. అయితే సందీప్ కుమార్ రఘు పూజారి అనే ఉద్యోగి 2016, నవంబర్ 8 నుంచి 2017, ఫిబ్రవరి 12 మధ్య 1.41 మిలియన్ డాలర్ల విలువైన దాదాపు 374 లావాదేవీలు జరిపాడు. నెటెల్లర్‌డాట్‌కామ్, ఎంట్రోపే, స్విఫ్ట్‌వోచర్, ఎస్‌కేఆర్ త్రిల్‌డాట్‌కామ్ అనే ఈ-కామర్స్ వెబ్‌సైట్లపై ఈ లావాదేవీలు జరుగగా, ఈ సమాచారాన్ని సంస్థ సీవోవో బ్యాంకుకు 2017, ఫిబ్రవరి 28న అందించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే మోసపూరితంగా సందీప్‌కు మొత్తం 3 కార్డులందినట్లు బ్యాంక్ ఆరోపిస్తుండగా, సందీప్‌తోపాటు మరికొందరిపై నేరపూరిత కుట్ర, మోసం, ఫోర్జరీ, ఐటీ చట్టం ఉల్లంఘనల కింద కేసులు నమోదయ్యాయి.

అమెజాన్‌కు రూ.1.3 కోట్ల కుచ్చుటోపీ

బెంగళూరు: అమెజాన్‌కు రూ.1.3 కోట్ల మేరకు టోకరా వేశాడో కొరియర్ బాయ్. ఏకదంత కొరియర్ ఏజెన్సీలో పనిచేస్తున్న 25 ఏండ్ల దర్శన్.. తన స్నేహితులతో కలిసి అమెజాన్‌లో వస్తువులను ఆర్డర్ చేస్తూ ఈ మోసానికి పాల్పడ్డాడు. తమ ఏజెన్సీకి అమెజాన్‌తో ఉన్న ఒప్పందాన్ని ఆసరా చేసుకున్న దర్శన్.. గతేడాది సెప్టెంబర్ నుంచీ ఈ ఏడాది ఫిబ్రవరి మధ్య ఖరీదైన వస్తువులను ఆర్డర్ చేసి, వాటికి డబ్బులు చెల్లించకుండా ఎగవేశాడు. అమెజాన్ కార్డ్ పేమెంట్ వ్యవస్థను హ్యాక్ చేసి కస్టమర్లు డబ్బులు చెల్లించినట్లు చూపగా, ఆ తర్వాతి ఆడిటింగ్‌లో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై దృష్టి సారించిన అమెజాన్ వర్గాలు.. మోసాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాయి. కాగా మొత్తం 4,604 ఆర్డర్లు చేసినట్లు తెలుస్తుండగా, రూ.25 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

'ఫైర్‌స్టార్' సీఎఫ్‌వోను ప్రశ్నించిన సీబీఐ

జతిన్ మెహతా సహచరుడి అరెస్టు

న్యూఢిల్లీ, మార్చి 12: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో భారీ కుంభకోణానికి పాల్పడి రూ.12,700 కోట్లు కొల్లగొట్టిన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీపై నమోదైన రూ.321.88 కోట్ల రుణ ఎగవేత కేసులో ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లకు చెందిన ఉన్నతాధికారులపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దృష్టి కేంద్రీకరించింది. ఈ కేసులో నిందితునిగా ఉన్న నీరవ్ మోదీ కంపెనీ ఫైర్‌స్టార్ డైమండ్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీఎఫ్‌వో రవి శంకర్ గుప్తాను సీబీఐ సోమవారం ప్రశ్నించింది. బ్యాంకు రుణాలు ఎలా మంజూరయ్యాయి, వాటిని ఏవిధంగా దారి మళ్లించారు, ఈ వ్యవహారాల్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల ప్రమేయం ఏమేరకు ఉందన్న ప్రశ్నలతో రవి శంకర్ గుప్తాను సీబీఐ ఉక్కిరి బిక్కిరి చేసినట్లు ఒక అధికారి వెల్లడించారు. ఇదిలావుంటే, విన్సమ్ డైమండ్ సంస్థపై దాఖలైన మరో రుణ ఎగవేత కేసులో ఆ సంస్థ చీఫ్ జతిన్ మెహతాకు సన్నిహితుడైన హస్ముఖ్‌ను సీబీఐ అరెస్టు చేసింది.

ఇండిగో, గో ఎయిర్ సంస్థలపై డీజీసీఏ ఆగ్రహం

11 విమానాల దింపివేతకు ఆదేశం.. ఇంజిన్ల వైఫల్యాలే కారణం


న్యూఢిల్లీ, మార్చి 12: ఇండిగో ఎయిర్‌లైన్స్, గో ఎయిర్ సంస్థలకు చెందిన 11 ఏ-320 నియో విమానాలను తక్షణమే కిందికి దింపేయాలని దేశీయ విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) సోమవారం ఆదేశించింది. వీటిలో ఇండిగో సంస్థకు చెందిన ఎనిమిది విమానాలు, గో ఎయిర్‌కు చెందిన మూడు విమానాలు ఉన్నాయి. ఆ విమానాల్లో అమర్చిన ప్రాట్ అండ్ విట్నీ (పీడబ్ల్యూ) ఇంజిన్లు తరచుగా విఫలమవుతుండమే ఇందుకు కారణం. నెల రోజుల కంటే తక్కువ వ్యవధిలోనే మూడుసార్లు ఇటువంటి వైఫల్యాలు తలెత్తడంతో డీజీసీఏ ఈ ఆదేశాలు జారీ చేసింది. ప్రయాణ సమయంలో ఇంజిన్ వైఫల్యం వలన ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానాన్ని సోమవారం ఉదయం అత్యవసరంగా అహ్మదాబాద్‌లో దించేయాల్సి వచ్చింది. దీంతో ఇటువంటి విమానాల భద్రత పట్ల ఆందోళనలు పెరగడం, మరోవైపు ఈ సమస్యను పరిష్కరించేందుకు ఆయా సంస్థల నుంచి ఇప్పటివరకూ స్పష్టమైన ప్రతిపాదన రాకపోవడంతో డీజీసీఏ ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. పౌర విమానయాన సేవల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, అందుకే పీడబ్ల్యూ-1100 సిరీస్ ఇంజిన్లను అమర్చిన ఏ-320 నియో విమానాలను తక్షణమే కిందికి దింపేయాల్సిందిగా ఆదేశించామని డీజీసీఏ వెల్లడించింది. ఇండిగో, గో ఎయిర్ సంస్థల వద్ద ఇప్పటికే విడిగా కొన్ని పీడబ్ల్యూ ఇంజిన్లు ఉన్నాయని, వాటిని తిరిగి అమర్చవద్దని ఆ సంస్థలకు స్పష్టం చేశామని డీజీసీఏ ఒక ప్రకటనలో పేర్కొన్నది. ప్రస్తుతం మొత్తం 14 ఏ-320 నియో విమానాల్లో పీడబ్ల్యూ-1100 సిరీస్ ఇంజిన్లను అమర్చారు. వీటిలో 11 విమానాలను ఇండిగో ఎయిర్‌లైన్స్, మరో 3 విమానాలను గో ఎయిర్ నడుపుతున్నాయి.

జీఎంఆర్‌కు అవార్డుల పంట

న్యూఢిల్లీ, మార్చి 12: కమ్యూనికేషన్స్ విభాగంలో జీఎంఆర్ గ్రూపునకు అవార్డుల పంటపడింది. గడిచిన సంవత్సరానికిగాను పబ్లిక్ రిలేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌సీఐ) ఇటీవల పుణెలో నిర్వహించిన 12వ గ్లోబల్ కమ్యూనికేషన్స్ కాంక్లేవ్‌లో ఆరు ప్రతిష్ఠాత్మక అవార్డులను సొంతం చేసుకున్నది. వీటిలో సోషల్ మీడియాలో ప్రచారం, కార్పొరేట్ ఈవెంట్, కార్పొరేట్ ఫిల్మ్, కార్పొరేట్ బ్రోచర్, పీఆర్ కేస్ స్టడీ, సీఎస్‌ఆర్ ఫిల్మ్ విభాగాల్లో ఒక పసిడి పతకంతో పాటు మూడు వెండి, క్రిస్టల్, కాంస్య పతకాలను అందుకున్నట్లు జీఎంఆర్ వర్గాలు వెల్లడించాయి. వీటితోపాటు జీఎంఆర్ (గ్రూపు హెడ్ (కార్పొరేట్ కమ్యూనికేషన్స్) యువ్‌రాజ్ మెహతాకు బెస్ట్ పీఆర్ ప్రొఫెషనల్ అవార్డు లభించింది.

రెండింతలైన పారిశ్రామికోత్పత్తి


జనవరిలో 7.5 శాతంగా నమోదు



న్యూఢిల్లీ, మార్చి 12: పారిశ్రామిక రంగం పరుగుపెట్టింది. ఈ ఏడాది తొలి నెలలో ఏకంగా 7.5 శాతంగా నమోదైంది. తయారీ రంగం నుంచి వచ్చిన సానుకూల అంశాలతోపాటు కన్స్యూమర్, క్యాపిటల్ గూడ్స్ విభాగాల నుంచి ఆశించిన స్థాయిలో వృద్ధిని నమోదుచేసుకోవడంతో 2017 జనవరిలో నమోదైన 3.5 శాతంతో పోలిస్తే రెండురెట్లు పెరిగినట్లు కేంద్ర గణాంకాల శాఖ సోమవారం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. గతేడాది చివరి నెలలో ఇది 7.1 శాతంగా ఉన్నది. పారిశ్రామిక వృద్ధిలో 77.63 శాతం వాటా కలిగిన తయారీ రంగం 8.7 శాతం వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు కలిసొచ్చింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో వృద్ధి 2.5 శాతంగా ఉండేది. పెట్టుబడులకు కేంద్రబిందువైన క్యాపిటల్ గూడ్స్ విభాగం జెట్‌స్పీడ్ వేగంతో దూసుకుపోయింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో 0.6 శాతంగా ఉన్న క్యాపిటల్ గూడ్స్..ఈ ఏడాది జనవరికిగాను ఇది 14.6 శాతానికి చేరుకున్నది. కన్స్యూమర్ గూడ్స్ విభాగం 8 శాతం వృద్ధిని కనబరుచగా, నాన్-డ్యూరబుల్ గూడ్స్ రంగం 10.5 శాతంగా నమోదయ్యాయి. కానీ గనుల రంగం నిరాశపరిచింది. ఏడాది క్రితం 8.6 శాతం వృద్ధిని నమోదు చేసుకున్న గనులు.. జనవరిలో 0.1 శాతానికి జారుకున్నాయి. ప్రాథమిక వస్తువులు 5.8 శాతం, మధ్యంతర వస్తువులు 4.9 శాతం, మౌలికం/నిర్మాణ రంగ పరికరాల్లో వృద్ధి 6.8 శాతంగా నమోదైందని నివేదిక వెల్లడించింది. 23 రంగాల్లో 16 వృద్ధిని నమోదు చేసుకోగా, ఏడు నిరాశాజనక పనితీరు కనబరిచాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి మధ్యకాలంలో ఐఐపీ రేటు 4.1 శాతంగా నమోదైంది.

దిగొచ్చిన రిటైల్ ద్రవ్యోల్బణం

ఫిబ్రవరిలో 4.44 శాతానికి తగ్గుదల



న్యూఢిల్లీ, మార్చి 12: రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఆహార పదార్థాలు, చమురు ధరలు దిగిరావడంతో గడిచిన కొన్ని నెలలుగా ఎగువముఖం పట్టిన రిటైల్ ద్రవ్యోల్బణం ఫిబ్రవరి నెలకుగాను 4.44 శాతంగా నమోదైంది. జనవరిలో నమోదైన 5.07 శాతంతో పోలిస్తే స్వల్పంగా తగ్గగా, అదే గతేడాది ఇదే నెలలో నమోదైన 3.65 శాతం పోలిస్తే మాత్రం భారీగా పెరిగినట్లు కేంద్ర గణాంకాల శాఖ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. నవంబర్ 2017లో ఇది 4.88 శాతంగా ఉన్నది. గతనెలలో వినియోగదారుల ఆహార పదార్థాల ధరల సూచీ 4.7 శాతం నుంచి 3.26 శాతానికి తగ్గడం కొంత ఉపశమనాన్ని ఇచ్చింది. జనవరిలో 26.97 శాతంగా ఉన్న కూరగాయల ధరల సూచీ ఆ మరుసటి నెలకుగాను 17.57 శాతానికి తగ్గగా, పండ్లు 4.80 శాతంగా నమోదయ్యాయి. వీటితోపాటు పాలు, పాల ఉత్పత్తుల సూచీ 4.21 శాతానికి పరిమితమవగా, చిరుధాన్యాలు 2.10శాతం, మాంసం-చేపలు 3.31 శాతం, కోడిగుడ్ల ధరల సూచీ 8.51 శాతానికి తగ్గాయి. చమురు, లైట్ విభాగ ఉత్పత్తుల సూచీ 6.80 శాతానికి తగ్గినట్లు నివేదిక వెల్లడించింది. కానీ రవాణా, కమ్యూనికేషన్స్ సేవల సూచీ మాత్రం 1.97 శాతం నుంచి 2.39 శాతానికి పెరిగింది.

యూనిటెక్‌కు షాక్

ఆస్తుల వేలానికి సుప్రీం కోర్టు ఆదేశం
బయ్యర్లను మోసగించారని ఆగ్రహం

న్యూఢిల్లీ, మార్చి 12: ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ యూనిటెక్‌పై సుప్రీం కోర్టు మరోసారి ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఇండ్ల కొనుగోలుదారులను యూనిటెక్ దారుణంగా మోసగించిందని, కనుక కొనుగోలుదారుల సొమ్మును తిరిగి చెల్లించాలంటే ఆ సంస్థ ఆస్తులను వేలం వేయాల్సిందేనని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. కొనుగోలుదారుల నుంచి డబ్బులు తీసుకుని, వారికి సరైన సమయంలో ఇళ్లను నిర్మించి ఇవ్వలేదన్న ఆరోపణలతో యూనిటెక్‌పై అనేక కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. కొనుగోలుదారుల డబ్బును తిరిగి చెల్లించేందుకు యూనిటెక్ ఆస్తులను వేలం వేయాలని సంబంధిత అధికారులను ధర్మాసనం ఆదేశించింది. కంపెనీ డైరెక్టర్ల ఆస్తులు సహా సంస్థ ఆస్తులను గుర్తించి వాటిని వేలం వేయాలని సూచించింది. అయితే ఈ ఆస్తులు ఎటువంటి వివాదాల్లో చిక్కుకుని ఉండరాదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. అలాగే సంస్థ ఆస్తుల వివరాలను అందజేయాలని యూనిటెక్‌ను ఆదేశించింది. యూనిటెక్ ఇప్పటికే ఈ వివరాలను సమర్పించినప్పటికీ అవి అసంపూర్ణంగా ఉన్నాయని, కనుక పూర్తి జాబితాను 15 రోజుల్లోగా మళ్లీ అందజేయాలని ధర్మాసనం స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది.



సోమవారం రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో హెచ్‌ఎఫ్‌సీఎల్ ఫైబర్ ప్లాంటుకు శంకుస్థాపన చేస్తున్న ఐటీ, పరిశ్రమశాఖల మంత్రి కే తారక రామారావు. చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

ఇంటింటికీ బ్రాడ్‌బ్యాండ్ ఓ విప్లవం

- ఏడాది చివరికల్లా కోటి కుటుంబాలకు ఇంటర్నెట్ సేవలు
- హెచ్‌ఎఫ్‌సీఎల్ సంస్థకు శంకుస్థాపన చేసిన మంత్రి కేటీఆర్
- సీఎస్‌ఆర్ కింద ఐదు మొబైల్ మెడికేర్ క్లినిక్‌లను అందించిన సంస్థ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇంటింటికీ బ్రాడ్ బ్యాండ్ పథకం విప్లవాత్మకమైనదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు తెలిపారు. ప్రభుత్వ పాలన ఇంటింటికీ చేరాలని.. అందుకు సాంకేతిక సాధనంగా ఉండాలనే లక్ష్యంతో దేశంలో మరే రాష్ట్రం ప్రవేశపెట్టని విధంగా ఇంటింటికీ బ్రాడ్ బ్యాండ్ పథకాన్ని తాము చేపట్టామని పేర్కొన్నారు. ఈ ఏడాది చివరికల్లా రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందించనున్నామని వివరించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల గ్రామ రెవెన్యూలోని ఫ్యాబ్‌సిటీ (ఈసిటీ)లో 20 ఎకరాల్లో హిమాచల్ ఫ్యూచరిస్టిక్ కమ్యూనికేషన్ లిమిటెడ్ (హెచ్‌ఎఫ్‌సీఎల్) గ్రూపునకు చెందిన ఆప్టికల్ ఫైబర్ ప్లాంటుకు రాష్ట్ర రవాణా శాఖమంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, స్థానిక సర్పంచ్ జెల్లల లక్ష్మయ్యతో కలిసి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. కేంద్ర ప్రభుత్వం భారత్‌నెట్ పథకం ద్వారా గ్రామం వరకు ఇంటర్నెట్‌ను ఇచ్చేందుకు సిద్ధమవగా తాము ఇంటింటికీ బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ ఇచ్చేందుకు టీ ఫైబర్ ప్రాజెక్టును తీసుకొచ్చామని మంత్రి కేటీఆర్ వివరించారు. హెచ్‌ఎఫ్‌సీఎల్ సంస్థ మొదటిదశలో ఫైబర్, తదుపరి దశలో కేబుల్, మూడోదశలో ఆప్టిక్ ఫైబర్ కేబుళ్ల ముడిసరుకును తయారు చేయనుండటం సంతోషకరమన్నారు. దీనిద్వారా మొదటివిడుతలో వెయ్యి మందికి, రెండో విడుతలో 4 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ఇక్కడి యువతీ యువకులకు ఉద్యోగాలు లభించాలని కోరుతున్నారని, ఈ విషయంలో జయేశ్‌రంజన్ ప్రత్యేకంగా చొరువ తీసుకొని టాస్క్ ద్వారా యువతకు అవసరమైన శిక్షణ ఇప్పించి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. దేశంలో ఆప్టిక్ ఫైబర్ తయారీ సంస్థలు కేవలం నాలుగు మాత్రమే ఉండగా అందులో కీలక సంస్థ తెలంగాణలో తమ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటుచేయడం సంతోషకరమని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రథమ స్థానంలో ఉన్నదని గుర్తుచేశారు. డిఫెన్స్ రంగంలోకి కూడా విస్తరించాలని హెచ్‌ఎఫ్‌సీఎల్ ఆకాంక్షించడం ఆనందకరమని.. ఈ విషయంలో రాష్ట్రాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఇటీవలే కేంద్ర రక్షణశాఖ మంత్రి హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మక టాటా బోయింగ్ కేంద్రాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రూపొందించిన విధానాలు, మంత్రి కేటీఆర్ చొరువ వల్ల రాష్ట్రంలోకి పెద్దఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని చెప్పారు. ఇప్పటికే పలు కంపెనీల ద్వారా స్థానికంగా వేలమందికి ఉద్యోగాలు లభించాయని వివరించారు. హెచ్‌ఎఫ్‌సీఎల్ చైర్మన్ మహేంద్రప్రతాప్ శుక్లా మాట్లాడుతూ ఈ కేంద్రంలో ఏటా 6.4 మిలియన్ కిలోమీటర్ల ఆప్టికల్ ఫైబర్ ఉత్పత్తి చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం దాదాపు రూ.260 కోట్లు ఖర్చు అవుతుందని చెప్పారు. ఈ ఫైబర్‌ను టెలికమ్యూనికేషన్ (4జీ, 5జీ), బ్రాడ్‌బ్యాండ్.. ఎఫ్‌టీటీఎక్స్‌ను దేశంతోపాటు విదేశాల్లో నెట్‌వర్క్ ఏర్పరిచేందుకు వినియోగిస్తున్నారని తెలిపారు. తదుపరి దశలో రూ.700 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ మహేంద్ర నహతా, ఐటీశాఖ ఎలక్ట్రానిక్స్ డైరెక్టర్ సుజయ్ కారంపూరి, డిజిటల్ మీడియా డైరెక్టర్ దిలీప్ కొణతం తదితరులు పాల్గొన్నారు. హెచ్‌ఎఫ్‌సీఎల్ సంస్థ సీఎస్‌ఆర్‌లో భాగంగా అందించిన 5 మొబైల్ మెడికేర్ క్లినిక్‌లను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. రూ.5 కోట్లతో ఏర్పాటుచేసిన ఈ మొబైల్ వ్యాన్లు పూర్తి స్థాయి సిబ్బందితో రంగారెడ్డి జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తాయి.

కేటీఆర్‌తో 15 నిమిషాల సమావేశమే కారణం

రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌తో జరిపిన 15 నిమిషాల సమావేశమే తెలంగాణలో తమ కంపెనీ ఏర్పాటుకు కారణమని హెచ్‌ఎఫ్‌సీఎల్ కంపెనీ చైర్మన్ మహేంద్రప్రతాప్ శుక్లా తెలిపారు. 'దేశంలో మా కంపెనీ విస్తరణకు ఏ రాష్ట్రాన్ని కేంద్రంగా చేసుకోవాలనే అన్వేషణలో భాగంగా తెలంగాణ ఐటీశాఖ ఎలక్ట్రానిక్స్ డైరెక్టర్ సుజయ్ కారంపూరితో సమావేశం అయ్యారు. మాతో ప్రాథమిక భేటీ జరిపిన సుజయ్.. మంత్రి కేటీఆర్‌తో ఒక్కసారి సమావేశం అవ్వాల్సిందిగా మాకు సూచించారు. అనంతరం ఢిల్లీలో మంత్రి కేటీఆర్‌తో సమావేశమయ్యాం. 15 నిమిషాలపాటు జరిగిన సమావేశం అనంతరం తెలంగాణ తప్ప మరే రాష్ట్రాన్ని ఎంచుకోవద్దని నిర్ణయం తీసుకున్నాం. ఎందుకంటే రాష్ట్రం కోసం ఆయన చూపుతున్న ఆసక్తి మమ్మల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. అభివృద్ధి కోసం వారు రూపొందించిన ప్రణాళికలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఒక రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగాలంటే ఇలాంటి నాయకులు కావాలి. ఇలాంటి నాయకులు సారథ్యం వహిస్తే దేశం ఎంతో అభివృద్ధి చెందుతుంది' అని ఆయన ప్రశంసించారు.

భద్రాద్రిపై కుట్ర



రామాలయంపై శివస్వామి తీరు స్వార్థపూరితం.. వైష్ణవ క్షేత్రంతో శైవపీఠాధిపతికి సంబంధమేమిటి?
మండిపడుతున్న తెలంగాణ ఆలయాల పండితులు, ప్రధాన అర్చకులు

శైవపీఠాధిపతి శివస్వామి ఆదివారం భద్రాద్రి అంతరాలయంలో వ్యవహరించిన తీరుపై తెలంగాణ వ్యాప్తంగా అటు భక్తులు, ఇటు అర్చకులు, వేద పండితులు భగ్గుమంటున్నారు. శైవ పీఠాధిపతి వైష్ణవ దేవాలయానికి వచ్చి అనవసర రాద్ధాంతం చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. శైవ-వైష్ణవ తగాదాలు సృష్టించడానికా? అంటూ మండిపడుతున్నారు. రామనారాయణుడు అని పిలువడం ఈ క్షేత్రం ప్రత్యేకత అని దీనిపై రాద్ధాంతం చేయాల్సిన అవసరం లేదని సూచిస్తున్నారు. భక్తరామదాసు నిర్మించిన భద్రాద్రి పుణ్యక్షేత్రంలో సుమారు 400 ఏండ్ల నుంచి కూడా అదే పద్ధతిలో కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వారు చెబుతున్నారు. భద్రాద్రి పుణ్యక్షేత్రానికి పెరుగుతున్న ఆదరణను చూసి జీర్ణించుకోలేక కొందరు ఉద్దేశపూర్వకంగా సరికొత్త అంశాలను తెరపైకి తెచ్చి వివాదాలు సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్

శైవపీఠాధిపతికి సంబంధమేమిటి?



వైష్ణవ క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన భద్రాద్రి పుణ్యక్షేత్రంలో శైవ పీఠాధిపతికి సంబంధం ఏమిటి?. భద్రాద్రి పుణ్యక్షేత్రాన్ని భూలోక వైకుంఠంగా పిలుస్తాం. కానీ కైలాసం అని సంబోధించం కదా?. ఆలయంపై శిల్పాలు ఉండకూడదని ఎక్కడా లేదు. శిల్పాలన్నీ శిల్పశాస్త్రం ప్రకారమే ఉంటాయి.

– స్థలసాయి, స్థానాచార్యులు, భద్రాచలం

ఆధ్యాత్మిక భావనను దెబ్బతీసేందుకే..



రాష్ట్రంలో ఆధ్యాత్మిక భావనను దెబ్బతీసేందుకే కావాలని కొందరు తెలంగాణలోనే ప్రముఖ ఆలయాలైన భద్రాద్రి, యాదాద్రిలో ఇబ్బందులు కలిగించాలని చూస్తున్నారు. వైష్ణవ క్షేత్రాలలో శైవ పీఠాధిపతి చెప్పే మాటలను వినాలని లేదు. వైష్ణవ ఆలయాలకు జీయర్‌లు దిశాదశ నిర్దేశం చేస్తారు. భద్రాద్రి వైష్ణవ క్షేత్రం.

– నల్లందిగల్ లక్ష్మీనరసింహాచార్యులు, యాదాద్రి దేవస్థానం ప్రధానార్చకులు

వైదికపరమైన పద్ధతిలోనే పూజలు



భద్రాద్రి అంతరాలయంలో అమరావతి శివక్షేత్ర పీఠాధిపతి శివస్వామి బైఠాయించిన ఘటనపై విచారణకు ఆదేశించాం. నివేదిక రాగానే దేవాదాయ శాఖ కమిషనర్‌కు పంపిస్తాం. శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో వైదిక పరమైన పద్ధతిలోనే పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి.

– ప్రభాకర శ్రీనివాస్, ఈవో, భద్రాచల దేవస్థానం


రామచంద్రుడు నారాయణుడే..



సాక్షాత్తు పరమశివుడే విచ్చేసి రామచంద్రుడిని నారాయణుడని సంబోధించాడు. అలాంటప్పుడు రాముడు నారాయణుడా కాదా? అనే సందేహం ఎందుకు వస్తుందో అర్థం కావడం లేదు. అనవసరంగా వివాదాలను సృష్టించి శైవ, వైష్ణవ అనే భేదాలు పెట్టి సమాజంలో చిచ్చురేపే ప్రయత్నాలు చేయడం సరికాదు.

– త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి

రామనారాయణుడిగా ఓ ప్రత్యేకత..



కలియుగ వైకుంఠంగా పిలువబడుతున్న భద్రాద్రి పుణ్యక్షేత్రంలో విష్ణుమూర్తికి చిహ్నంగా శ్రీరాముడు ధనుర్బాణాలతో శంఖచక్రధారియై నాలుగు హస్తాలతో ద్విభుజ రఘునందనంతో అవతరించాడు. అందువల్ల రామనారాయణుడు అని పిలువడం ఈ క్షేత్రం ప్రత్యేకత.– పీ జగన్నాథాచార్యులు, ప్రధాన అర్చకులు, భద్రాద్రి ఆలయం


స్వార్థంతోనే భద్రాద్రి అంశం తెరపైకి..



సనాతన సంప్రదాయాలు, ఆచారాలను కాదని కొత్త సంప్రదాయాలను జోడించాలని చూడకూడదు. కొంత మంది స్వార్థం కోసం భద్రాద్రి అంశాన్ని తెరమీదికి తెస్తున్నారు. ఎక్కడైనా చిన్న లోపాలుంటే వాటిని పీఠాధిపతులు, పండితులు కూర్చొని చర్చించుకొని పరిష్కరించుకోవాలి.

–గంగు ఉపేంద్రశర్మ, తెలంగాణ అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్, వేయి స్తంభాల గుడి ప్రధాన అర్చకులు

శివస్వామిపై చర్యలు తీసుకోవాలి



భద్రాద్రి అంతరాలయంలో నిరసన తెలిపిన శివస్వామిపై చర్యలు తీసుకోవాలి. భద్రాద్రిపై ఏ మాత్రం అవగాహన లేకుండా మాట్లాడారు. ఒక పీఠానికి అధిపతి మరో క్షేత్రానికి వచ్చి అనాలోచితంగా మాట్లాడడం సబబుకాదు.

– డాక్టర్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యులు, మహామహోపాధ్యాయ, కవిశాబ్దిక కేసరి, శాస్త్రరత్నాకర

భద్రాద్రి ఆలయ అర్చకులదే తుది నిర్ణయం



తాజాగా నెలకొన్న వివాదంలో భద్రాచల ఆలయం అర్చకులదే తుది నిర్ణయం. ఈ క్షేత్రంలో నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణం అద్భుతంగా నిర్వహించడం ఆనవాయితీ. శంఖచక్రాలు ధరించడం నారాయణమూర్తి స్వరూపంగా మరెక్కడా లేదు.అందుకే ఈ స్వామివారిని వైకుంఠ రాముడిగా పిలుస్తారు. ఇది సంప్రదాయం. – గోపయ్యగారి శంకరయ్య, వేములవాడ రాజన్న ఆలయ స్థానాచార్యులు

నేటి తెలంగాణ బంద్ రద్దు: ఎమ్మార్పీఎస్

ఉస్మానియా యూనివర్సిటీ/బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో కేంద్రం జాప్యాన్ని నిరసిస్తూ మంగళవారం తలపెట్టిన తెలంగాణ బంద్‌ను రద్దు చేసుకుంటున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ చెప్పారు. దానికి బదులుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని అంబేద్కర్ విగ్రహాల ఎదుట మహాధర్నా చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఓయూ గెస్ట్‌హౌజ్‌లో సోమవారం మీడియాతో మందకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని బంద్‌ను రద్దు చేసుకుంటున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 14న తలపెట్టిన కలెక్టరేట్ల ముట్టడిని వాయిదా వేసినట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జీ చెన్నయ్య ప్రకటించారు.

రిజర్వేషన్ల పోరాటానికి సిద్ధం కండి
ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రిజర్వేషన్లు పెంచుకొనే అధికారాన్ని రాష్ట్రాలకు ఇవ్వాలని సీఎం కేసీఆర్ కేంద్రంపై పోరాడుతున్నారని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. ఆయన పోరాటానికి కులసంఘాలు అండగా నిలువాలని కోరారు. సోమవారం తెలంగాణ భవన్‌లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేల్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. రిజర్వేషన్లు పెంచాలనే ఉద్యమం సామాజిక బాధ్యత అని చెప్పారు. రిజర్వేషన్లు పెంచుకునే అధికారం రాష్ట్రాలకు ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ సీఎం కేసీఆర్ కొట్లాటతో కేంద్రానికి కనువిప్పు కలుగాలన్నారు. ఆర్టికల్ 16 (4) సవరించాలని టీఆర్‌ఎస్ ఎంపీలు చేస్తున్న పోరాటాన్ని స్వాగతించారు. ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బైండ్ల విజయ్‌కుమార్, జోగు అశోక్, వీరాచారి పాల్గొన్నారు.

ప్రమాణాలకు అనుగుణంగా భగీరథ నీరు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రమాణాలకు అనుగుణంగా మిషన్ భగీరథలో తాగునీటి శుద్ధి జరుగుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ బీ సురేందర్‌రెడ్డి తెలిపారు. ఆర్వో వాటర్ ప్రజల ఆరోగ్యానికి అంత మంచిదికాదని పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ ప్రధాన కార్యాలయంలో నీటి నాణ్యత, పర్యవేక్షణపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజినీర్లు కృపాకర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డితోపాటు కన్సల్టెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

షీలాబిడే కమిటీ పదవీ కాలం పొడిగింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 9, 10 షెడ్యూళ్ల పరిధిలోకి వచ్చే సంస్థల విభజన, ఆస్తుల పంపకానికి నియమించిన షీలాబిడే కమిటీ పదవీకాలాన్ని పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీచేసింది. ఏడాదిపాటు కమిటీని కొనసాగిస్తూ ఉత్తర్వులిచ్చింది. కాగా సోమవారం ఢిల్లీలో కేంద్ర హోంశాఖ ఉన్నతాధికారులతో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల అధికారులు సమావేశమై 13వ షెడ్యూల్‌లో పేర్కొన్న సంస్థల ఏర్పాటుపై చర్చించారు.

ఉద్యోగుల విభజన పూర్తిచేయండి: హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైద్య విధాన పరిషత్తు ఉద్యోగుల విభజన ఎనిమిది వారాల్లో పూర్తిచేయాలని తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలకు ఉమ్మడి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. విభజన విధివిధానాలను నాలుగు వారాల్లో ఖరారు చేయాలని ఆదేశించింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోబడి విధివిధానాలను ఖరారుచేయాలని తేల్చిచెప్పింది.

మరో ఇద్దరు పోలీసు అధికారుల బదిలీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మరో ఇద్దరు పోలీసు అధికారులను బదిలీ చేశారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ డీసీపీగా పనిచేస్తున్న ఏవీ రంగనాథ్‌ను నల్లగొండ ఎస్పీగా నియమించారు. నల్లగొండ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావును డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

కావాలంటే శ్రీశైలం నీళ్లు వాడుకోండి!

- మే 31 దాకా సాగర్‌లో 510 అడుగులు ఉండాల్సిందే
- ఎండీడీఎల్ దిగువన నీళ్లు తాగునీటికే వాడాలి
- కృష్ణా బోర్డుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోషి ఘాటైన లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వాటాను మించి నీటిని వాడుకొని, శ్రీశైలం-నాగార్జునసాగర్‌లో ఎండీడీఎల్ దిగువన ఉండే నీటి కోసం ఆరాటపడుతున్న ఆంధ్రప్రదేశ్.. అందుకు వంత పాడుతున్న కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ సర్కారు ఘాటైన సమాధానమిచ్చింది. కేవలం తాగునీటికే ఉద్దేశించిన ఈ నీటిని ఎడాపెడా ఎలా వాడుతారంటూ ప్రశ్నించింది. కావాలంటే శ్రీశైలం జలాశయంలో 800 అడుగుల వరకు ఉన్న నీటిని వాడుకోవాలని, అందులోనూ బచావత్ అవార్డు ప్రకారం తెలంగాణకు 69 శాతం వాటాను కేటాయించాలని స్పష్టం చేసింది. కానీ నాగార్జునసాగర్‌లో ఎండీడీఎల్ (510 అడుగులు)కు దిగువ నీటిని వాడుకునేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ తాము అంగీకరించేదిలేదని, ఈ ఏడాది మే నెలాఖరు వరకు ఎండీడీఎల్ నిర్వహించాల్సిందేనని కుండబద్దలు కొట్టింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి కృష్ణా బోర్డు చైర్మన్ వైకే శర్మతోపాటు కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖకు సుదీర్ఘ లేఖ రాశారు. ప్రధానంగా నాలుగు అంశాలను ఆయన బోర్డు ముందుంచారు. లేఖ సారాంశం ఇలా ఉంది..

'తాజా నీటి సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వం కృష్ణా బోర్డు ముందు అనేక అంశాలను ఉంచింది. ఏపీ కృష్ణా డెల్టాకు గోదావరి జలాల మళ్లింపు కొనసాగించడం, పోతిరెడ్డిపాడు ద్వారా ఎక్కువ నీటిని వాడుకొని తక్కువగా రికార్డుల్లో నమోదు చేయడం, శ్రీశైలం అవుట్‌ఫ్లో-సాగర్ ఇన్‌ఫ్లో మధ్య ఉన్న భారీ వ్యత్యాసం తదితర అంశాలను తేల్చమని కోరినా.. బోర్డు మాత్రం ఇప్పటిదాకా స్పందించలేదు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో ఎండీడీఎల్ (కనీస నీటి సేకరణ స్థాయి) కంటే ఎగువన ఉన్న నీటి నిల్వలను ఏపీ-66 శాతం, తెలంగాణ-34 శాతం దామాషా ప్రకారం వాడుకోవాలని రెండు రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఈ నేపథ్యంలో 2017-18 నీటి సంవత్సరంలో రెండు రాష్ట్రాల వినియోగం తర్వాత శ్రీశైలం ఎండీడీఎల్ ఎగువన 1.92 టీఎంసీలు, నాగార్జునసాగర్‌లో ఎండీడీఎల్ ఎగువన 18.70 టీఎంసీల నిల్వలున్నాయి. ఈ నేపథ్యంలో రెండు రిజర్వాయర్లలో ఎండీడీఎల్ దిగువన నీటిని వాడకానికి సంబంధించి నాలుగు ప్రధాన సూచనలను బోర్డు ముందు ఉంచుతున్నాం.

- రెండు రిజర్వాయర్లలో ఎండీడీఎల్ దిగువ నీటిని కేవలం తాగునీటి కోసమే వాడుకోవాలి. ఎండీడీఎల్ దిగువ నీటి నిల్వల్లో బచావత్ అవార్డు ప్రకారం.. తెలంగాణ వాటా 69 శాతం, ఏపీ వాటా 31 శాతంగా బోర్డు పరిగణనలోనికి తీసుకోవాలి.
- తాగునీటి అవసరాలకు శ్రీశైలంలో 800 అడుగుల వరకు నీటిని వాడుకునేందుకు మాకెలాంటి అభ్యంతరం లేదు. అయితే బచావత్ అవార్డు ప్రకారం అందులో తెలంగాణకు 17.16 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 7.71 టీఎంసీలు కేటాయించాలి.
- హైదరాబాద్ మహానగరం, ఫ్లోరైడ్‌పీడిత ప్రాంతాల తాగునీటి అవసరాల దృష్ట్యా నాగార్జునసాగర్‌లో 31.05.2018 వరకు కచ్చితంగా ఎండీడీఎల్ (510 అడుగులు) నిర్వహించాల్సిందే. అంతకంటే తక్కువకు మేం అంగీకరించం.
- ఒక రాష్ట్రం వాటా కంటే మించి వాడుకున్న నీటి పరిమాణాన్ని తదుపరి సంవత్సరంలో మరో రాష్ట్రానికి ఎండీడీఎల్ ఎగువన వాటాలో (క్యారీఓవర్) కలపాలి.'

రూటుమార్చిన బోర్డు

ఈ నెల 2వ తేదీన త్రిసభ్య కమిటీలో ఎండీడీఎల్ ఎగువ నీటిని పంచిన కృష్ణా బోర్డు.. ఈనెల 20 తర్వాత ఎండీడీఎల్ దిగువన నీటిపై మరోసారి సమావేశం అవుదామని రాష్ట్రాలకు సూచించింది. కానీ అందుకు భిన్నంగా.. ఈనెల 7వ తేదీనే ఎండీడీఎల్ దిగువన నీటి వాడకంపై రెండు రాష్ట్రాలకు లేఖ రాసింది. సోమవారంలోగా రాష్ట్రాలను అభిప్రాయాలు చెప్పమన్నది. దీనిపై ఈ నెల 9వ తేదీన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు సమీక్ష నిర్వహించి, తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలుగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందుకు అనుగుణంగా తెలంగాణ సీఎస్ లేఖ రాశారు. దీంతో ఖంగుతున్న బోర్డు.. పరిస్థితులు ఏపీకి ప్రతికూలంగా మారుతున్నాయని ఆందోళన చెందిందో ఏమో.. గంటల వ్యవధిలోనే త్రిసభ్య కమిటీ భేటీపై నిర్ణయం తీసుకున్నది. వాస్తవంగా ఈనెల 20 తర్వాత సమావేశం అవుదామని చెప్పిన బోర్డు సభ్య కార్యదర్శి.. ఈనెల 14వ తేదీన త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశామంటూ రెండు రాష్ట్రాలకు లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలంగాణ తరపున తన అభిప్రాయాన్ని చెప్పగా.. ఈఎన్సీలు సభ్యులుగా ఉండే త్రిసభ్య కమిటీ సమావేశం ఏర్పాటు చేసి, రెండు జలాశయాల్లో ఎండీడీఎల్ దిగువన నీటి వాడకంపై చర్చిద్దామని అనడం ఎంత వరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.



ఏపీలోని గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజా సమీపంలో సొంత ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దంపతులు

గవర్నర్‌కు కాగ్ నివేదిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఆర్థికస్థితి, బడ్జెట్ తీరుతెన్నులపై 2017 మార్చితో ముగిసిన ఆర్థికసంవత్సరానికి సంబంధించి రూపొందించిన నివేదికను గవర్నర్ నరసింహన్‌కు భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) సోమవారం సమర్పించింది. ఈ నివేదికను బడ్జెట్ సమావేశాల చివరిరోజు శాసనసభ ముందుంచుతారు.

వక్ఫ్‌భూములను పరిరక్షించండి: డిప్యూటీ సీఎం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని వక్ఫ్ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ అన్నారు. అవసరమైతే భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని తన చాంబర్‌లో వక్ఫ్‌భూములపై అధికారులతో సమీక్షించారు.

ఉద్యోగావకాశాలపై ప్రభుత్వాలు ఆలోచించాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలుగు, హిందీ, ఉర్దూ తదితర మాతృభాషలు అభ్యసించే విద్యార్థులకు ఉద్యోగవకాశాలు కల్పించే విషయంలో ప్రభుత్వాలు చొరవచూపాలని ఉమ్మడి హైకోర్టు అభిప్రాయపడింది. అందరూ సాంకేతిక విద్యలనే ప్రోత్సహిస్తే మాతృభాష కనుమరుగయ్యే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. విశ్వవిద్యాలయాల్లో భాషాశాస్త్ర అధ్యాపక పోస్టులపై దాఖలైన వ్యాజ్యం విచారణలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

ప్రేమజంట ఆత్మహత్య



ప్రవీణ్ , మంజుల (ఫైల్)


దౌల్తాబాద్: క్షణికావేశంలో ఓ ప్రేమజంట ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం పోల్కంపల్లిలో సోమవారం జరిగింది.దౌల్తాబాద్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాలు ఇలా.. పోల్కంపలికి చెందిన ప్రవీణ్ (18), మంజుల(18) స్నేహితులు. ప్రవీణ్ ఐటీఐ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. మంజుల ఇంటర్ పూర్తిచేసింది. వీరిద్దరు కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. మంజులకు వేరే అబ్బాయితో వివాహం జరిపించేందుకు ఆమె కుటుంబసభ్యులు ప్రయత్నిస్తున్నారు. మంజుల ఈ విషయాన్ని ప్రవీణ్‌కు తెలిపింది. తమ వివాహం జరుగదేమోననే బెంగతో ప్రవీణ్, మంజుల కలిసి ఒకే తాడుతో ఆదివారం రాత్రి ప్రవీణ్ సొంత పొలం దగ్గర చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సోమవారం ఉదయం పొలానికి వెళ్లిన పలువురు మృతదేహాలను చూడగా అప్పటికే వారు మరణించినట్టు గుర్తించారు.

చిరుత దాడిలో దూడలు హతం

రామాయంపేట: మెదక్ జిల్లా రామాయంపేట శివారు అటవీప్రాంతం అక్కన్నపేటలో ఆదివారం రాత్రి చిరుత రెండు దూడలను చంపి తిన్నది. గ్రామానికి చెందిన వెల్మూల లక్ష్మి పశువుల కొట్టంలో రాత్రి పదిగంటల ప్రాంతంలో చిరుత రెండు దూడలపై దాడిచేశాయి. పశువులు పెద్దగా అరువడంతో గ్రామస్తులు మేల్కొని చిరుత కోసం గాలించారు.

బయటపడుతున్న అక్రమాస్తులు
తెలంగాణ గ్రామీణ బ్యాంకు స్కామ్‌లో సిబ్బంది చేతివాటం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ గ్రామీణ బ్యాంకు రంగారెడ్డి జిల్లా అజిజ్‌నగర్‌శాఖలో రూ. 8.94 కోట్ల నిధుల కుంభకోణంపై సీబీఐ దర్యాప్తులో బ్యాంకు సిబ్బంది అక్రమాస్తులు బయటపడుతున్నాయి. సీబీఐ అధికారులు బ్యాంకు సిబ్బంది ఆస్తులపై నిఘా పెట్టగా ఆదాయానికి మించిన ఆస్తులు వెలుగుచూస్తున్నాయి. బ్యాంకు అకౌంటెంట్ జైపాల్‌రెడ్డి వద్ద ఆదాయానికి మించి రూ.73.38 లక్షల ఆస్తులు ఉన్నట్టు సీబీఐ గుర్తించి, అతడిపై మరో కేసు నమోదుచేసింది. నిందితుల్లో ఐదుగురు మేనేజర్ స్థాయి అధికారులు ఉద్యోగ విరమణ చేసినట్టు తెలిసింది. వీరితోపాటు విధుల్లో ఉన్న సిబ్బంది ఆస్తులపై సీబీఐ ఆరా తీస్తున్నది. మరో ముగ్గురు అధికారుల వద్ద ఆదాయానికి మించి ఆస్తులు బయటపడ్డాయి. ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలిస్తున్న సీబీఐ అధికారులు ఇతరశాఖల సహాయం కూడా తీసుకుంటునట్టు తెలిసింది.



జనగామ జిల్లా బచ్చన్నపేట మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్‌గా నియామక పత్రాన్ని అందుకుంటున్న కల్లూరి సంజీవరెడ్డి. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ.. రైతు సమక్షేమానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనను కన్వీనర్‌గా నియమించడంపై ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
మంగళవారం 13 మార్చి 2018

ఎస్జీ బంతులే వాడుదాం

కెప్టెన్-కోచ్‌ల సమావేశంలో ప్రతిపాదనలు

ముంబై: కోకబుర్రా బంతుల స్థానంలో ఎస్జీ కంపెనీ బంతులను వన్డే, టీ20లకూ ఉపయోగించాలని బీసీసీఐ సమాలోచనలు చేసింది. సోమవారం ఇక్కడ జరిగిన వార్షిక కెప్టెన్-కోచ్‌ల సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. భారత్‌లో టెస్ట్ మ్యాచ్‌లు, ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లకు ఎస్జీ బంతులనే వాడుతున్నారు. వన్డేలకు మాత్రం కోకబుర్రా బంతులను ఉపయోగిస్తున్నారు. అయితే ఈ మధ్య జరిగిన ముస్తాక్ అలీ టీ20, విజయ్ హజారే టోర్నీల్లో ఎస్జీ బంతులను ప్రయోగాత్మకంగా వాడారు. ఈ విషయమై క్రికెట్ ఆపరేషన్స్ జీఎం సాబాకరీంతో చర్చ జరగ్గా, భవిష్యత్‌లో భారత్ వన్డే, టీ20లకు ఎస్జీ తెల్ల బంతులను వాడుతుందని తేల్చారు. ఇక అంపైర్ల వివాదాస్పద నిర్ణయాలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. దేశవాళీ మ్యాచ్‌ల్లోనూ డీఆర్ఎస్‌ను ఉపయోగించాలని కొందరు ప్రతిపాదించగా, ఆ అంశాన్ని పక్కనపెట్టారు. ఇటీవల బీసీసీఐ అంపైర్ల పరీక్ష కోసం తయారుచేసిన ప్రశ్నల్లో కొన్ని జోన్‌లకు సంబంధించిన అంపైర్లకు ప్రాథమిక ప్రశ్నలు సంధించారని, కొన్ని జోన్‌లకు మాత్రం అత్యంత కఠినమైన ప్రశ్నలు ఇచ్చారని ఆరోపించారు.

రంజీలో మూడు గ్రూపులే..

రంజీ ట్రోఫీలో జట్లను మూడు గ్రూపులుగా చేయాలని కొందరు కెప్టెన్లు ప్రతిపాదించారు. మొత్తం 28 జట్లను మూడు గ్రూపులకే కుదించి, ఒక గ్రూపులో పది, మిగతా రెండు గ్రూపుల్లో తొమ్మిది చొప్పున జట్లు ఉండాలని ప్రతిపాదించారు. దీని వల్ల ఆటగాళ్లకు ఎక్కువ మ్యాచ్‌లు ఆడే అవకాశం లభిస్తుందని తెలిపారు. దాదాపు అందరు కెప్టెన్లు దీనికి మద్దతు తెలిపారు.

ఢిల్లీ డుమ్మా

ముంబైలో జరిగిన ఈ సమావేశానికి ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) గైర్హాజరైంది. ఈ ఏడాది ఢిల్లీ తరపున ముగ్గురు కెప్టెన్లుండగా ఒక్కరు కూడా సమావేశానికి హాజరుకాలేదు. రిషబ్ పంత్ శ్రీలంక పర్యటనలో ఉన్నాడు. ఇషాంత్, ప్రదీప్ సాంగ్వాన్‌లలో ఒకరైనా రిప్రజెంట్ చేస్తారనుకుంటే సమావేశానికి డుమ్మా కొట్టారు.



భారత మహిళలకు షాక్

ఆసీస్ చేతిలో 8 వికెట్ల తేడాతో ఓటమి

వడోదర: భారత మహిళల వరుస విజయాలకు బ్రేక్ పడింది. ఆసీస్ ఓపెనర్ బోల్టన్ శతకంతో విజృంభించడంతో ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో భారత్ 8 వికెట్ల తేడాతో ఓడింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0 ఆధిక్యం సంపాదించింది. అనారోగ్యం కారణంగా కెప్టెన్ మిథాలీరాజ్ ఈ మ్యాచ్‌కు దూరమవడంతో హర్మన్ ప్రీత్ కౌర్ జట్టును నడిపించింది. సోమవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత మహిళా జట్టు 50 ఓవర్లలో 200 పరుగులకు ఆలౌట్ అయింది. వస్త్రాకర్ (51), సుష్మ (41), పూనమ్‌రౌత్ (37) ఫరవాలేదనిపించారు. ఈ మ్యాచ్ ద్వారా అరంగేట్రం చేసిన ముంబై యువ సంచలనం జెమీమా(1) నిరాశ పరిచింది. ఆసీస్ బౌలర్లలో జొనాసెన్ (4/30), వెల్లింగ్టన్ (3/24) భారత్‌ను తక్కువ స్కోరుకు కట్టడి చేయడంలో సఫలమయ్యారు. 201 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా మహిళా జట్టు ఆడుతూ పాడుతూ 32.1 ఓవర్లలో (202/2) ఛేదించింది. ఓపెనర్ బోల్టన్ (100 నాటౌట్) అజేయ శతకంతో దుమ్మురేపగా, హీలే (38), లానింగ్ (33) సహకారం అందించారు. భారత బౌలర్లో శిఖా పాండేకు ఒక వికెట్ దక్కింది.



అద్దింట్లో ముద్దులాట

ముంబై: టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ తన భార్య అనుష్కశర్మతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. అది కూడా నెలకు రూ.15లక్షలు చెల్లిస్తున్నాడు. కోహ్లీ 2016లోనే ముంబైలోని ఒర్లీలో రూ.34కోట్లు పెట్టి ఒక విలాసవంతమైన ఫ్లాట్‌ను ఖరీదు చేశాడు.34వ అంతస్థులో ఉన్న ఫ్లాట్‌ను తనకు నచ్చినరీతిలో తీర్చిదిద్దేందుకు ప్రముఖ నిర్మాణ సంస్థ ఓంకార్1973ప్రాజెక్ట్స్‌కి అప్పగించాడు. గత ఏడాది డిసెంబర్‌లో పెండ్లి చేసుకున్న ఈ జోడి, ఆ వెంటనే కొత్త ఫ్లాట్‌లోకి దిగాలనుకోగా, బిల్డర్ సకాలంలో పూర్తి చేయలేకపోయాడు. దీంతో ఒర్లీలోనే మరో ఫ్లాట్‌ను అద్దెకు తీసుకోవాల్సి వచ్చింది. కేవలం 24 నెలల కోసమే రహేజా లెజెండ్స్ అపార్ట్‌మెంట్ 40వ అంతస్తులో ఓ ఫ్లాట్ తీసుకున్నారు. నెలకు రూ.15 లక్షల అద్దె చెల్లిస్తున్నాడు. దీని కోసం రూ.కోటిన్నర డిపాజిట్, రిజిస్ట్రేషన్ కోసం రూ.1.01కోట్లు ఖర్చు చేసినట్టు తెలిసింది. ఏదేమైనా బిజీ షెడ్యూల్ నుంచి విరామం దొరికేసరికి అనుష్క కోహ్లీపై తన ప్రేమను తెలుపుతూ ముద్దు పెట్టిన ఫొటోను తన ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేసింది.ఇది వైరల్ గా మారింది.

కోహ్లీకి నమ్మశక్యం కాని డీల్!

క్రికెట్ ప్రపంచంలో కనీవిని ఎరుగని అత్యంత భారీ డీల్‌ను భారత్ కెప్టెన్ విరాట్ కోహ్లీ 2018లో దక్కించుకుంటాడని ప్రముఖ జ్యోతిష్యుడు నరేంద్ర బుండే చెప్పాడు. ఇంగ్లండ్ లో జరుగబోయే 2019 ప్రపంచకప్‌ను, టీ20 ప్రపంచకప్‌తోపాటు 2025 నాటికల్లా విరాట్.. క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ వంద సెంచరీల రికార్డును బద్దలు కొడుతాడని ఈ నాగ్‌పూర్ జ్యోతిష్యుడు తెలిపాడు. 'సచిన్‌కు భారత రత్న వస్తుందని చెప్పాను. గంగూలీ తిరిగి జట్టులోకి రావడం, భారత్ 2011 ప్రపంచకప్ గెలువడం..అవన్నీ నేను చెప్పినట్టే జరిగాయి' అని అన్నాడు. గంగూలీ, మురళీ కార్తీక్, శ్రీశాంత్, జహీర్‌ఖాన్, గంభీర్, రైనా, ప్రీతీ జింతా గతంలో నరేంద్రను కలిసి అతడి సలహాలను తీసుకున్నారు.

లెక్క సరిచేశారు

నాలుగు వికెట్లతో శార్దూల్ విజృంభణ .. మనీశ్, దినేశ్ మెరుపులు

లంకపై భారత్ ప్రతీకార విజయం


మనీశ్
(42*)

కొలంబో: నిదహాస్ ముక్కోణపు టీ20 టోర్నీలో భారత్ వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. టోర్నీ తొలి మ్యాచ్‌లో శ్రీలంక చేతిలో ఎదురైన పరాజయానికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. వర్షం అంతరాయం మధ్య ఆలస్యంగా మొదలైన సోమవారం మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీని ద్వారా ఫైనల్ అవకాశాలను మరింత మెరుగుపర్చుకున్న రోహిత్‌సేన లంక బెర్తుకు ఎసరు తెచ్చింది. తొలుత శార్దూల్ ఠాకూర్(4/27) బౌలింగ్ విజృంభణతో లంక కుదించిన 19 ఓవర్లలో 152/9 స్కోరు చేసింది. కుశాల్ మెండిస్(38 బంతుల్లో 55, 3ఫోర్లు, 3సిక్స్‌లు) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన టీమ్‌ఇండియా 17.3 ఓవర్లలో 153/4 స్కోరు చేసింది. మనీశ్‌పాండే(31 బంతుల్లో 42 నాటౌట్, 3ఫోర్లు, సిక్స్), కార్తీక్(25 బంతుల్లో 39 నాటౌట్, 5 ఫోర్లు) అద్భుతంగా రాణించారు. ధనంజయ(2/19)కు రెండు వికెట్లు దక్కాయి. నాలుగు వికెట్లతో లంకను కట్టడి చేయడంలో కీలకమైన శార్దూల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. బుధవారం బంగ్లాదేశ్‌తో భారత్ తలపడుతుంది.

లక్ష్యాన్ని అలవోకగా: శ్రీలంక నిర్దేశించిన 153 పరుగుల లక్ష్యఛేదనలో భారత్‌కు మెరుగైన శుభారంభం దక్కలేదు. 22 పరుగులకే ఓపెనర్లు రోహిత్‌శర్మ(11), ధవన్(8) ఔటైయ్యి నిరాశపరిచారు. ధనంజయ తన తొలి ఓవర్లోనే రోహిత్‌ను పెవిలియన్ పంపాడు. ఆ మరుసటి ఓవర్లోనే భారీ షాట్ ఆడబోయిన ధవన్ మిడ్‌ఆన్‌లో తిసారకు క్యాచ్ ఇచ్చి రెండో వికెట్‌గా ఔటయ్యాడు. తర్వాత క్రీజులోకొచ్చిన రైనా(27)ఆదిలోనే రనౌట్ అయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. చమీర వేసిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో రెండు ఫోర్లు, ఓ సిక్స్‌తో రైనా జోరు మీద కనిపించాడు. స్కోరుబోర్డు ఊపందుకుంటున్న దశలో ఫెర్నాండో బౌలింగ్‌లో రైనా అనవసరపు షాట్‌కు పోయి ఔట్ కావడంతో మూడో వికెట్‌కు 40 పరుగుల భాగస్వామ్యానికి ముగింపు పడింది. అప్పటికే క్రీజులో ఉన్న రాహుల్(18)కు మనీశ్ పాండే(42 నాటౌట్) జత కలిశారు. ఓవైపు రాహుల్ నెమ్మదిగా ఆడినా..మనీశ్ బౌండరీలతో ఆకట్టుకున్నాడు. కుదురుకున్నారన్న తరుణంలో రాహుల్ హిట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత దినేశ్ కార్తీక్(39 నాటౌట్) జతగా మనీశ్ జట్టును విజయతీరాలకు చేర్చాడు. పసలేని లంక బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొంటూ స్కోరుబోర్డుకు కీలక పరుగులు జోడించారు. వీరిని విడగొట్టేందుకు తిసార పెరెర చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా సమయోచిత ఆటతీరుతో భారత్‌కు విజయాన్ని కట్టబెట్టారు.


శార్దూల్
(4/27)

శార్దూల్ విజృంభణ: తొలుత టాస్ గెలిచిన భారత్ ప్రత్యర్థి శ్రీలంకను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. తాను ఎదుర్కొన్న తొలి బంతినే కుశాల్ మెండిస్(55) భారీ సిక్స్‌గా మలిచాడు. తానేం తక్కువ కాదన్నట్లు గుణతిలక(17) సిక్స్‌తో ఊపుమీద కనిపించాడు. కానీ శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో రైనా కండ్లు చెదిరే క్యాచ్ ద్వారా గుణతిలక తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఓవైపు సహచరుడు నిష్క్రమించినా వెనుకకు తగ్గని మెండిస్ అదే జోరు కొనసాగించాడు. సిరీస్‌లో సూపర్ ఫామ్‌మీదున్న కుశాల్ పెరెర(3)ను సుందర్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. మెండిస్‌కు ఉపుల్ తరంగ(22) తోడయ్యాడు. ఇక్కణ్నుంచి లంక ఇన్నింగ్స్ స్వరూపామే మారిపోయింది. మెండిస్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. మెండిస్‌కు జతగా తరంగ కూడా ఆడటంతో రన్‌రేట్ 10తో దూసుకెళ్లింది. అయితే విజయ్ శంకర్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయిన తరంగ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. మూడో వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.

39 పరుగులకు 6 వికెట్లు: తిసార పెరెర(15) వచ్చి రావడంతోనే రెండు భారీ సిక్స్‌లతో అలరించినా అదే జోరు కొనసాగించలేకపోయాడు. శార్దూల్ బౌలింగ్‌లో చాహల్ సూపర్ క్యాచ్‌తో పెరెర ఔటయ్యాడు. ఇక్కణ్నుంచి లంక వికెట్ల పతనం మొదలైంది. జీవన్ మెండిస్(1), కుశాల్ మెండిస్, ధనంజయ(5), శనక(19), చమీర(0) వెంటవెంటనే వికెట్లు సమర్పించుకున్నారు. దీంతో ఆఖరి 6 వికెట్లు లంక కేవలం 39 పరుగుల తేడాతో కోల్పోయింది. శార్దూల్ ఠాకూర్(4/27) నాలుగు వికెట్లతో విజృంభించగా, సుందర్(2/21)కు రెండు వికెట్లు దక్కాయి.

స్కోరుబోర్డు:

శ్రీలంక: గుణతిలక(సి)రైనా(బి)శార్దూల్ 17, కుశాల్ మెండిస్ (సి)రోహిత్(బి)చాహల్ 55, పెరెర(బి)సుందర్ 3, తరంగ(బి)శంకర్ 22, తిసార పెరెర(సి)చాహల్(బి)శార్దూల్ 15, జీవన్ మెండిస్(బి)సుందర్ 1, శనక(సి)కార్తీక్(బి)శార్దూల్ 19, ధనంజయ(సి)రాహుల్(బి)ఉనాద్కట్ 5, లక్మల్ 5 నాటౌట్, చమీర(సి)ఉనాద్కట్(బి)శార్దూల్ 0, ఫెర్నాండో 0 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:**10; **మొత్తం:** 19 ఓవర్లలో 152/9; **వికెట్ల పతనం:** 1-25, 2-34, 3-96, 4-113, 5-118, 6-120, 7-146, 8-151, 9-151; **బౌలింగ్:** ఉనాద్కట్ 3-0-33-1, సుందర్ 4-0-21-2, శార్దూల్ 4-0-27-4, చాహల్ 4-0-34-1, శంకర్ 3-0-30-1, రైనా 1-0-6-0.

భారత్: రోహిత్(సి)మెండిస్(బి)ధనంజయ 11, ధవన్(సి)తిసార పెరెర(బి)ధనంజయ 8, రాహుల్ హిట్‌వికెట్(బి)జీవన్ 18, రైనా(సి)తిసార (బి)ఫెర్నాండో, మనీశ్ 42 నాటౌట్, కార్తీక్ 39 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 8; **మొత్తం:** 17.3 ఓవర్లలో 153/4; **వికెట్ల పతనం:** 1-13, 2-22, 3-62, 4-85; **బౌలింగ్:** లక్మల్ 2-0-19-0, ధనంజయ 4-0-19-2, చమీర 3-0-33-0, ఫెర్నాండో 2.3-0-30-1, జీవన్ 4-0-34-1, పెరెర 2-0-17-0.

షమీ.. దక్షిణాఫ్రికా పర్యటన వివరాలు ఇవ్వండి

బీసీసీఐకి కోల్‌కతా పోలీసుల లేఖ



కోల్‌కతా: భార్యతో విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని చూస్తున్న భారత సూపర్ పేసర్ మహ్మద్ షమీపై కోల్‌కతా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. షమీ దక్షిణా పర్యటన వివరాలు తెలుపాలంటూ కోల్‌కతా పోలీసులు బీసీసీఐకి లేఖ రాశారు. షమీ దుబాయ్ నుంచి భారత జట్టుతో కలిసాడా లేదంటే పర్యటన అనంతరం దుబాయ్ వెళ్లాడా అన్న వివరాలను తెలుసుకోవాలని భావిస్తున్నారు. ఒకవేళ అతని పర్యటన బీసీసీకి సంబంధించినదా లేదా వ్యక్తిగతమైనదా కూడా సమాచారం తెలుపాలని పోలీసులు కోరారు. కాగా, మరోవైపు తన భార్య హసీన్‌తో అన్ని సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని షమీ భావిస్తున్నాడు. ఈ మేరకు హసీన్ న్యాయవాదితో సంప్రతింపులు జరుపుతున్నట్లు తెలుస్తుంది.

భారత్‌తో టెస్ట్‌కు స్టోక్స్ దూరం

మ్యాచ్ రోజే కేసు విచారణ



లండన్: నైట్ క్లబ్ వివాదం ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌ను వెంటాడుతూనే ఉన్నది. కేసు విచారణలు అతడి మ్యాచ్‌లను అడ్డుకుంటూనే ఉన్నాయి. కోర్టు విచారణ కారణంగా యాషెస్ సిరీస్‌కు దూరమైన ఈ ఆల్‌రౌండర్, ఆగస్టులో భారత్‌తో జరుగనున్న టెస్ట్ మ్యాచ్‌కూ దూరమవుతున్నాడు. ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న స్టోక్స్.. కేసుకు సంబంధించి సోమవారం వీడియో లింక్ ద్వారా జడ్జి ఎదుట విచారణకు హాజరయ్యాడు. ఆ కేసులో మరో ఇద్దరు నిందితులు వ్యక్తిగతంగా హాజరయ్యారు. అయితే జడ్జి తదుపరి హియరింగ్‌ను ఆగస్టు 6కు వాయిదావేశారు. ఆగస్టు 9 నుంచి లార్డ్స్‌లో భారత్, ఇంగ్లండ్ మధ్య రెండో టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుండగా, అదే సమయంలో స్టోక్స్ బ్రిస్టల్ క్రౌన్ కోర్టులో విచారణకు హాజరు కావాల్సి ఉండటంతో అతడు రెండో టెస్టుకు అందుబాటులో ఉండటం కష్టమే. ట్రయల్ సుమారు వారం రోజులపాటు జరిగే అవకాశం ఉండటంతో స్టోక్స్ లేకుండానే ఇంగ్లండ్ బరిలోకి దిగనున్నది. విరాట్ కోహ్లీ సారథ్యంలోని టీమ్‌ఇండియా ఆగస్టులో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. అక్కడ మూడు టీ20లు, మూడు వన్డేలతో పాటు ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఆడుతుంది. సుదీర్ఘమైన భారత పర్యటన ఆగస్ట్ 1 నుంచి బర్మింగ్‌హామ్ వేదికగా జరిగే తొలి టీ20తో మొదలుకానుంది.

దక్షిణాఫ్రికాదే రెండో టెస్ట్

పోర్ట్ ఎలిజబెత్: ఆస్ట్రేలియాతో నాలుగు టెస్టుల సిరీస్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికా అదిరిపోయే బోణీ కొట్టింది. ఆసీస్‌పై అన్నింటా ఆధిపత్యం ప్రదర్శించిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో సిరీస్‌లో ఇరు జట్లు ప్రస్తుతం 1-1తో సమంగా నిలిచాయి. ఆసీస్ నిర్దేశించిన 101 పరుగుల లక్ష్యాన్ని సఫారీలు 22.5 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసింది. డివిలీయర్స్(28), ఆమ్లా(27), మక్ర్కామ్(21) జట్టు విజయంలో తలో చెయ్యి వేశారు. 5 పరుగులకే ఓపెనర్ ఎల్గర్ ఔటైనా ఆ తర్వాతి బ్యాట్స్‌మెన్ ఇన్నింగ్స్‌ను గాడిలో పడేశారు. లియాన్(2/44)కు రెండు వికెట్లు దక్కగా, హాజిల్‌వుడ్, కమ్మిన్స్ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు 180/5 ఓవర్‌నైట్ స్కోరుతో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా..రబాడ(6/54) వీరవిహారంతో 79 ఓవర్లలో 239 పరుగులకు ఆలౌటైంది.

యుకీ సంచలన విజయం



ఇండియానా వెల్స్: భారత సింగిల్స్ స్టార్ ఆటగాడు యుకీ బాంబ్రి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయం నమోదు చేసాడు. ఇండియానా వెల్స్ ఏటీపీ టోర్నీలో ప్రపంచ నంబర్ 12 ఫ్రాన్స్‌కు చెందిన లూకాస్ పోయిల్లేను ఓడించి సంచలన విజయంతో మూడో రౌండ్ చేరుకున్నాడు. సోమవారం జరిగిన రెండోరౌండ్ మ్యాచ్‌లో 6-4,6-4 స్కోరుతో గంట 19 నిమిషాల్లో వరుస సెట్లలో తనకన్నా ఎన్నోరెట్లు మెరుగైన లూకాస్‌ను బాంబ్రి చిత్తు చేసి అబ్బురపరిచాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో బాంబ్రి ప్రస్తుతం 110వ ర్యాంకులో కొనసాగుతున్నాడు. కాగా, యుకీ మూడోరౌండ్‌లో అమెరికా స్టార్ ప్రపంచ 21వ ర్యాంకర్ శామ్ కెర్రీతో తలపడనున్నాడు.

రోజర్ ముందుకు.. జొకోవిచ్ ఓటమి

వర్షం పలుమార్లు అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో ప్రపంచ నంబర్ వన్, స్విస్ స్టార్ రోజర్ ఫెదరర్ విజయంతో మూడోరౌండ్ చేరగా..మాజీ ప్రపంచ నంబర్‌వన్, సెర్బియా స్టార్ జొకోవిచ్ ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించాడు. ఫెదరర్ 6-3,7-6(8-6) స్కోరుతో ఫెడెరికో డెల్బోనిస్‌ను ఓడించి మూడోరౌండ్ చేరుకున్నాడు.

చస్తా అన్నందుకు భార్యను ఉరేసి చంపాడు!


నిందితుడు లింగం

మన్సూరాబాద్: రంగారెడ్డి జిల్లా కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 10న జరిగిన ఓ మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని తన కార్యాలయంలో డీసీపీ వెంకటేశ్వరరావు కేసు వివరాలు వెల్లడించారు. కందుకూరు మండలం మాదాపూర్‌కు చెందిన దండు లింగం(27) లారీ క్లీనర్. ఇబ్రాహీంపట్నం మండలం ఎలిమినేడుకు చెందిన కార్వి చంద్రయ్య కూతురు హైమావతి(26)ని 2010లో ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు. చంపాపేట వైశాలీనగర్‌లో కాపురం పెట్టారు. వీరికి ఒక కూతురు పుట్టిన తర్వాత మాదాపూర్‌కు మకాం మార్చారు. లింగం తల్లి కూడా వీరితోనే ఉంటున్నది. కుటుంబ పోషణ ఇబ్బందిగా మారడంతో హైమావతిని తల్లిదండ్రుల నుంచి డబ్బులు తీసుకురావాలని భర్త, అత్త ఒత్తిడి చేశారు. విషయం తెలుసుకున్న హైమావతి తల్లిదండ్రులు కట్నం కింద రూ.లక్ష ఇచ్చారు. అయినా మరింత డబ్బు తేవాలని హైమావతిని వేధించడం ప్రారంభించారు. కోడలు అదనపు కట్నం తేదని గ్రహించిన లింగం తల్లి కొడుకుకు మరో పెండ్లి చేయాలని నిర్ణయించింది. కట్నం కింద రూ.20 లక్షల వరకు వస్తాయని కొడుకుకు నచ్చజెప్పింది. దీంతో భార్యను వదిలించుకోవాలనుకున్న అతను ఈనెల 9న తాను పని చేసే యజమాని వద్ద రూ.2 వేలు తీసుకున్నాడు. ఆ డబ్బుతో బావమరిదితో కలిసి మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. ఈనెల 10న స్వగ్రామానికి వెళ్లేందుకు డబ్బులు కావాలని భర్తను అడుగగా, లేవనడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన హైమావతి తాను ఆత్మహత్య చేసుకుంటానని చీరతో ఉరేసుకునేందుకు ప్రయత్నించింది. చస్తానని నన్ను బెదిరిస్తావా అంటూ అదే చీరతో లింగం తన భార్యకు ఉరేసి చంపి పరారయ్యాడు. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు లింగంను సోమవారం అరెస్ట్ చేశారు.

నడిరోడ్డుపై నరికేశారు

కూకట్‌పల్లిలో ఇంటర్ విద్యార్థి దారుణ హత్య.. పరీక్షకు వెళ్తుండగా కత్తులతో దాడి

- క్రికెట్ గ్రౌండ్‌లో మొదలైన గొడవ
- గ్రూప్‌ల మధ్య ఘర్షణగా రూపాంతరం
- హతుడు, నిందితులు 18 ఏండ్లలోపువారే
- ఒక నిందితుడిని పట్టుకున్న హెడ్‌కానిస్టేబుల్


హతుడు సుధీర్ (ఫైల్), నిందితుడు నవీన్ (ఫైల్)

కూకట్‌పల్లి/హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన చిన్న కొట్లాట ఓ ఇంటర్ విద్యార్థి హత్యకు దారితీసింది. బుద్ధిగా చదువుకోవాల్సిన వయసులో గ్రూపులుగా ఏర్పడి పెంచుకున్న పగ .. నడిరోడ్డుపై వేటకొడవళ్లతో నరికి చంపే స్థాయికి వెళ్లింది. సోమవారం ఇంటర్ పరీక్ష రాసేందుకు వెళ్తున్న ఓ విద్యార్థిని హైదరాబాద్ కూకట్‌పల్లిలో నలుగురు యువకులు కలిసి హత్య చేశారు. జాతీయ రహదారిపై పరిగెత్తించి వేటకొడవళ్లతో నరికి చంపారు. ఈ ఘటనలో హతుడు, నిందితులంతా 18 ఏండ్లలోపు వారే కావడం గమనార్హం. ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంబడించి ఓ నిందితుడిని పట్టుకోవడంతో హత్య గుట్టు వీడింది. ఏసీపీ భుజంగరావు, స్థానికులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. హైదరాబాద్ మూసాపేట్‌లోని యాదవబస్తీకి చెందిన ఎలగల రాజు చిన్న కొడుకు సుధీర్(18) కూకట్‌పల్లిలోని ప్రతిభ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. వార్షిక పరీక్ష రాసేందుకు సోమవారం ఉదయం తన స్నేహితులు మేఘనాథ్, సాయితో కలిసి ఒకే బైక్‌పై బయలుదేరాడు. వారు 8.15 గంటలకు కూకట్‌పల్లిలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న సాగర్ హోటల్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ కాపుకాసి ఉన్న మూసాపేట్‌కు చెందిన మహేశ్, నవీన్, తేజ, కృష్ణ కలిసి సుధీర్‌ను బైక్‌పై నుంచి కిందికి లాగి వేటకొడవళ్లతో దాడి చేశారు. సుధీర్ వారి నుంచి తప్పించుకొని పరుగెడుతూ రోడ్డుపై వెళ్తున్న ఓ స్కూల్ బస్సులోకి ఎక్కాడు. ఆ నలుగురు వెంబడించి సుధీర్‌ను బస్సులో నుంచి బయటికి లాగి రోడ్డుపై పడేసి విచక్షణారహితంగా దాడిచేశారు. మెడ, ముఖంపై తీవ్రగాయాలు కావడంతో తీవ్ర రక్తస్రావమై సుధీర్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. కూకట్‌పల్లి ఏసీపీ భుజంగరావు, సీఐ ప్రసన్నకుమార్ సంఘటనాస్థలాన్ని సందర్శించారు.

కాలర్ పట్టుకోవడంతో మొదలై..

సుధీర్ ఈ నెల 9న క్రికెట్‌గ్రౌండ్‌లో ఆడుతున్న పిల్లలతో గొడవపడ్డాడు. అక్కడే ఉన్న కృష్ణ అతడిని నిలదీసి కాలర్ పట్టుకోవడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ విషయాన్ని సుధీర్ తన సోదరుడు ప్రసాద్‌కు చెప్పడంతో అతడు స్నేహితులను తీసుకొచ్చి కృష్ణను చితకబాదాడు. ఆ మరునాడు సుధీర్ మళ్లీ వచ్చి కృష్ణతోపాటు అతడి స్నేహితులు తేజ, నవీన్‌ను చంపేస్తానని బెదిరించాడు. దీంతో ఎలాగైనా సుధీర్‌ను హత్యచేయాలని ముగ్గురూ నిర్ణయించుకున్నారు. మహేశ్‌ను కూడా తమతో కలుపుకొన్నారు. శనివారం కూకట్‌పల్లిలో ఫుట్‌పాత్‌మీద ఐదు కత్తులు, వేటకొడవళ్లు కొన్నారు. వాటిని సాన పట్టించమని చెప్పి ఆదివారం సాయంత్రం తీసుకున్నారు. సుధీర్ కూకట్‌పల్లిలోని చైతన్య కాలేజీలో పరీక్ష రాసి బయటికి రాగానే హత్య చేసేందుకు ప్లాన్ వేశారు. సోమవారం సుధీర్, మేఘనాథ్, సాయి కలిసి బైక్‌పై బయలుదేరగా నలుగురు నిందితులు వెంబడించారు. 8.15 గంటలకు కూకట్‌పల్లిలోని సాగర్ హోటల్ వద్ద ఒకరికొకరు ఎదురుపడ్డారు. సుధీర్ వారిని చూస్తూ 'ఇవ్వాళ్ల మీ పని అయితదిరా' అంటూ రెచ్చగొట్టడంతో మహేశ్ తన బుల్లెట్ బైక్‌ను సుధీర్ బైక్‌కు అడ్డం పెట్టాడు. వెనుక నుంచి యాక్టివా మీద వచ్చిన నవీన్, కృష్ణ, తేజ బండి డిక్కీ నుంచి కత్తులు, వేటకొడవళ్లు తీసి సుధీర్‌ను నరికిచంపారు. సుధీర్‌తో ఉన్న సాయి, మేఘనాథ్ భయంతో పారిపోయారు.

నవీన్‌ను పట్టుకున్న హెడ్‌కానిస్టేబుల్

ఘటనా స్థలానికి సమీపంలోనే కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ విధులు నిర్వహిస్తున్నారు. ఒకచోట ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఏం జరుగుతుందో కనుక్కునేందుకు వెళ్తుండగా కొందరి చేతుల్లో కత్తులు కనిపించాయి. వెంటనే ఆయన ఘటనా స్థలానికి పరిగెత్తగా నిందితుడు నవీన్ పారిపోతూ కనిపించాడు. దీంతో ఆయన రోడ్డుపై వెళ్తున్న వాహనదారుడి సాయంతో నవీన్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించారు. నవీన్ కత్తితో దాడిచేసేందుకు ప్రయత్నించగా తప్పించుకొన్నారు. నవీన్‌ను అదుపులోకి తీసుకొని కూకట్‌పల్లి పోలీసులకు అప్పగించారు.

పలు గ్రూప్‌లు.. తరుచూ తగాదాలు

మూసాపేట్‌లోని యాదవ బస్తీ, జనతా నగర్‌లో ఉన్న యువత గ్రూప్‌లుగా ఏర్పడి గల్లి గ్యాంగ్, బుల్లెట్ షూటర్స్, మూసాపేట్ రూలర్స్, జిల్లా మైయ్యి పేర్లతో హల్‌చల్ చేస్తున్నట్టు, ఆధిపత్యం కోసం గొడవలు పడుతున్నట్టు తెలుస్తున్నది. కాలనీల్లో కేకలు పెడుతూ తిరుగుతారని, అల్లరి చేస్తుంటారని సమాచారం. వీరికి వాట్సప్‌లో, సోషల్ మీడియాలో ప్రత్యేక గ్రూప్‌లు ఉన్నట్టు తెలువడంతో పోలీసులు నిఘా పెట్టారు. యాదవబస్తీ, జనతానగర్‌లో పికెట్ ఏర్పాటు చేశారు.

5 ఠీ దవాఖానను తనిఖీ చేసిన ఎంసీఐ

వైద్యవిద్య సీట్లు పెంపు నేపథ్యంలో సౌకర్యాలపై సంతృప్తి

ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన టీజీడీఏ వైద్యుల సంఘం

గాంధీ దవాఖాన: వైద్య విద్య సీట్లు పెరుగనున్న నేపథ్యంలో సోమవారం సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ)బృందం తనిఖీ చేసింది. దవాఖాన కళాశాలలో ఉండాల్సిన సదుపాయాలపై ఆరా తీసిన బృంద సభ్యులు తర్వాత వాటిని పరిశీలించారు. లెక్చర్ హాళ్లను, గ్రంథాలయాన్ని అందులో ఉండాల్సిన పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం దవాఖాన, కళాశాలలో ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్లు ఎంత మంది ఉన్నారో రికార్డులతో సహా తనిఖీ చేశారు. వైద్య విద్యార్థులకు వసతి భవనాలు, డైనింగ్ హాళ్లు తదితర అంశాలను పరిశీలించారు. బోధనకు సరిపడే భవనాలు, దవాఖానలో బెడ్ల సంఖ్యకు అనుగుణంగా సౌలభ్యాలు, యంత్ర పరికరాలైన ఎమ్మారై, సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే, ల్యాబోరేటరీ సౌకర్యాలు ఉన్నాయో లేదో పరిశీలించి నమోదు చేసుకున్నారు. ఇటీవల ప్రారంభించిన 65 పడకల ఐసీయూలో వైద్యులు, సిబ్బంది, నర్సింగ్ స్టాఫ్‌తో సహా అక్కడ ఉన్న సౌకర్యాలను గమనించారు. చివరికి అన్ని వసతులు, సౌకర్యాలు, యంత్ర పరికరాలు, భవనాలను గుర్తించిన ఎంసీఐ బృందం సంతృప్తిని వ్యక్తం చేసింది. దవాఖానలో సౌకర్యాలు, భవనాల ఏర్పాటుతో నేడు గాంధీ మెడికల్ కళాశాలకు అదనపు సీట్లు రానున్నాయని టీజీడీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లం ప్రవీణ్‌కుమార్, గాంధీయూనిట్ అధ్యక్షుడు డాక్టర్ సిద్దిపేట రమేశ్,కార్యదర్శి కటకం భూమేశ్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంసీఐ బృందం వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహారావు ఉన్నారు.







ఆస్ట్రేలియాలో ఎంపీ కవిత జన్మదిన వేడుకలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిజామాబాద్ ఎంపీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను ఆస్ట్రేలియాలోని సిడ్నీ, మెల్‌బోర్న్, కాన్‌బెర్రా, బ్రిస్బేన్, అడిలైడ్‌లో టీఆర్‌ఎస్ ఆస్ట్రేలియా విభాగం అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి కాసర్ల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కవిత దీర్ఘాయుష్షు కోసం సిడ్నీలోని రీజంట్స్‌పార్క్ సాయిబాబా ఆలయంలో టీఆర్‌ఎస్ ఆస్ట్రేలియా వైస్ ప్రెసిడెంట్ రాజేశ్ రాపోలు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. కవిత ఆశీస్సులతో ఆవిర్భవించిన టీఆర్‌ఎస్ ఆస్ట్రేలియా అనతికాలంలోనే ఇక్కడి అన్ని నగరాల్లో కార్యవర్గాల్ని ఏర్పరుచుకొని, వివిధ కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నదని రాజేశ్ చెప్పారు. కాన్‌బెర్రా, విక్టోరియా, బ్రిస్బేన్‌లో రవి సాయల, సాయిరామ్ ఉప్పు, శ్రీకాంత్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో కవిత జన్మదిన వేడుకలను నిర్వహించారు.

15న ఎడ్‌సెట్ నోటిఫికేషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఎడ్‌సెట్, లాసెట్, పీజీ లాసెట్ -2018 షెడ్యూళ్లను ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి సోమవారం విడుదలచేశారు. ఈ నెల 15న ఎడ్‌సెట్, 22న లాసెట్, పీజీ లాసెట్ నోటిఫికేషన్‌లను విడుదల చేయనున్నారు. ఎడ్‌సెట్ నోటిఫికేషన్‌ను ఈ నెల 15న విడుదల చేయనున్నారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తుకు సాధారణ రుసుము (ఎస్సీ, ఎస్టీలకు రూ, 450, ఇతరులకు రూ.650)ను చెల్లించాల్సి ఉంటుంది. మే 21 నుంచి 26 వరకు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 31న, జూన్ 1న (రెండురోజులు) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎడ్‌సెట్ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు.

టీఎస్ లాసెట్ షెడ్యూల్: లాసెట్ నోటిఫికేషన్‌ను ఈ నెల 22న విడుదల చేయనున్నారు. ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 25 వరకు సాధారణ రుసుము (ఎస్సీ, ఎస్టీలకు రూ.500, ఇతరులకు రూ.800)తో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఆన్‌లైన్‌లో మే 25న ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు లాసెట్ పరీక్ష నిర్వహిస్తారు.

పీజీ లాసెట్ షెడ్యూల్: పీజీ లాసెట్ నోటిఫికేషన్‌ను ఈ నెల 22న విడుదల చేయనున్నారు. ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 25 వరకు సాధారణ రుసుము (ఎస్సీ, ఎస్టీలకు రూ.600, ఇతరులకు రూ.1,000) తో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. మే 25న ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో పీజీ లా సెట్ పరీక్ష నిర్వహిస్తారు.

ఎల్లుండి నుంచి ఒంటిపూట బడులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులను నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్య కమిషనర్ జీ కిషన్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఇచ్చిన ఐచ్ఛిక సెలవులు పాఠశాలల పరంగా తీసుకునేలా మారుస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పదిరోజుల్లోగా నివేదిక ఇవ్వండి

- **సర్కారు వెబ్‌సైట్లు, పోర్టళ్లపై సమీక్షలో సీఎస్ జోషి ఆదేశం**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వశాఖలు, ఏజెన్సీల వెబ్‌సైట్లను ఐటీశాఖ ద్వారా నిర్వహించే అంశంపై పదిరోజుల్లోగా నివేదికను సమర్పించాలని సీఎస్ ఎస్కే జోషి అధికారులను ఆదేశించారు. వివిధశాఖలకు ఉన్న 265 వెబ్‌సైట్లు, పోర్టళ్ల నిర్వహణ నివేదికను రూపొందించాలన్నారు. ప్రభుత్వానికి ఐటీశాఖ ఐటీ సర్వీసు ప్రొవైడర్‌గా పని చేయాలన్నారు. సోమవారం సచివాలయంలో ప్రభుత్వ వెబ్‌సైట్లు, పోర్టళ్లపై సమీక్షించారు.





ఎంఎస్‌ఐటీ ప్రోగ్రామ్-2018

హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటీ 'మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ' -ఎంఎస్‌ఐటీ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఈ ప్రోగ్రామ్‌ను ఐఐఐటీహెచ్, జేఎన్టీయూ- హైదరాబాద్, కాకినాడ, అనంతపురం, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ లెర్నింగ్ సెంటర్‌లతో ఏర్పడిన కన్సార్టియం ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

- **కోర్స్ పేరు:** మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎంఎస్‌ఐటీ) ప్రోగ్రామ్
- **విభాగాలు:** మెషిన్ లెర్నింగ్, కంప్యూటర్ నెట్‌వర్క్స్, ఈ-బిజినెస్ టెక్నాలజీస్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, డాటా అనలిటిక్స్ అండ్ డాటా విజువలైజేషన్ అండ్ మొబైల్ టెక్నాలజీస్.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్ (బీఈ/బీటెక్) లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.



ఎంఎస్‌ఐటీ సీట్ల వివరాలు

- **మొత్తం సీట్ల సంఖ్య: 360**
- **ట్రిపుల్ ఐటీ హైదరాబాద్-110**
- **జేఎన్టీయూ హైదరాబాద్-100**
- **జేఎన్టీయూ కాకినాడ-50**
- **జేఎన్టీయూ అనంతపురం-50**
- **శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ-50**

- **ఫీజు:** ఐఐఐటీహెచ్‌లో రూ. 2,00,000, జేఎన్టీయూహెచ్‌లో రూ. 1,70,000, జేఎన్టీయూకే,జేఎన్టీయూఏ, ఎస్‌వీయూలో రూ. 1,60,000/- వీటితోపాటు అడ్మిషన్ ఫీజు: రూ. 30,000, ప్రిపరేటరీ ఫీజు: రూ. 10,000/-
- **గమనిక:** ఐఐఐటీహెచ్, జేఎన్టీయూహెచ్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో వచ్చిన ర్యాంక్ ఆధారంగా ఎంఎస్‌ఐటీ మెయిన్ ప్రోగ్రామ్‌లో నేరుగా ప్రవేశాలు కల్పిస్తారు. జేఎన్టీయూకే, జేఎన్టీయూఏ, ఎస్‌వీయూల్లో 4 వారాల ప్రిపరేటరీ ప్రోగ్రామ్ తర్వాత ఎంఎస్‌ఐటీ మెయిన్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ కల్పిస్తారు

- **అప్లికేషన్ ఫీజు:** రూ. 1000/-
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** మే 14
- **రెగ్యులర్ జీఏటీ ఎంట్రెన్స్ టెస్ట్:** మే 27
- **వాక్‌ఇన్ ఆన్‌లైన్ పరీక్ష:** మార్చి 15 నుంచి మే 19 వరకు (ప్రతి గురు, శుక్ర, శని, ఆదివారాల్లో నిర్వహిస్తారు)
- **రెగ్యులర్ జీఏటీ ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాలు విడుదల:** జూన్ 3
- **వెబ్‌సైట్:** www.msitprogram.net

- **ఎంపిక:** ఆన్‌లైన్ పరీక్ష ద్వారా/గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (జీఏటీ)
- గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను రెండు విధాలుగా నిర్వహిస్తారు. మొదటిది అభ్యర్థులు వారి అనుకూలమైన తేదీల్లో ఆన్‌లైన్‌లో www. msitprog ram.net లో స్లాట్ బుకింగ్ చేసికోవాలి. వాక్‌ఇన్ ఆన్‌లైన్ పరీక్షను హైదరాబాద్, కాకినాడలో నిర్వహిస్తారు. రెండోది రెగ్యులర్ జీఏటీ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్ణయించిన తేదీన హైదరాబాద్, వరంగల్, విజయవాడ, కాకినాడ, తిరుపతి, విశాఖపట్నం, అనంతపురంలో పరీక్ష ఉంటుంది.
- **గమనిక:** జీఆర్‌ఈ టెస్ట్‌ను 2015 జూలై తర్వాత జీఆర్‌ఈ స్కోర్ (301/3.5) ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఎంట్రెన్స్ పరీక్ష రాయాల్సిన అవసరం లేదు. వీరు డైరెక్టుగా ఎంఎస్‌ఐటీ మెయిన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందవచ్చు.
- అర్హత కలిగిన అభ్యర్థులు వాక్‌ఇన్ ఎంట్రెన్స్ టెస్ట్ లేదా రెగ్యులర్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్ పొందవచ్చు. వీలైతే రెండు పరీక్షలకు హాజరుకావచ్చు.
- రెండు పరీక్షల్లో బెస్ట్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటారు

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐటీ జోధ్‌పూర్

జోధ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో ఇంజినీర్లు, జూనియర్ అసిస్టెంట్లు, రిజిస్ట్రార్ తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

- రిజిస్ట్రార్ - 1, డిప్యూటీ రిజిస్ట్రార్ - 1, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ - 1, అసిస్టెంట్ రిజిస్ట్రార్ - 1,అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (సివిల్) - 1, ఏఈఈ (ఎలక్ట్రికల్) - 1, జూనియర్ ఇంజినీర్ (సివిల్) - 1, జేఈ (ఎలక్ట్రికల్) - 1, అసిస్టెంట్ మేనేజర్ (హార్టికల్చర్) - 1, అసిస్టెంట్ - 2, జూనియర్ అసిస్టెంట్ - 6, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ (కెమిస్ట్రీ) - 1, జేటీఏ (ఆటోమేషన్) - 1, జేటీఏ (బయోసైన్స్ అండ్ బయో ఇంజినీరింగ్) - 1, జేటీఏ (కెమికల్ ఇంజినీరింగ్) - 2, జేటీఏ (సివిల్ ఇంజినీరింగ్) - 2, జేటీఏ (ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్) - 1,



జేటీఏ (మెకానికల్ ఇంజినీరింగ్) - 1, జేటీఏ (మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్) - 2, జేటీఏ (ఫిజిక్స్) - 2, జేటీఏ (ఇన్‌స్ట్రుమెంటేషన్) - 1 ఖాళీ ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 13
- **హార్డ్‌కాపీ పంపడానికి చివరితేదీ:** మార్చి 20
- **వెబ్‌సైట్:** http://www.iitj.ac.in

వాటర్‌వేస్‌లో కన్సల్టెంట్లు

ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

ఇన్‌లాండ్ వాటర్‌వేస్ కేంద్ర నౌకాయాన శాఖ పరిధిలో పనిచేస్తుంది.

- చీఫ్ కన్సల్టెంట్ (ట్రాఫిక్) - 1, సీనియర్ కన్సల్టెంట్ (ట్రాఫిక్) - 1, సీనియర్ కన్సల్టెంట్ (మార్కెటింగ్ అండ్ లాజిస్టిక్స్) - 2, కన్సల్టెంట్ (మార్కెటింగ్ అండ్ లాజిస్టిక్స్) పాట్నా - 1, కన్సల్టెంట్ (మార్కెటింగ్ అండ్ లాజిస్టిక్) గువాహటి - 1, కన్సల్టెంట్ (ఎం & ఎల్) - 1, కన్సల్టెంట్ (అడ్మిన్ & ఫైనాన్స్) - 1 ఖాళీ ఉన్నాయి.
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** ఏప్రిల్ 5
- **వెబ్‌సైట్:** www.iwai.nic.in

నైపర్‌లో ఖాళీలు

గువాహటిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (నైపర్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

దేశంలోని ఔషధ విజ్ఞానశాస్త్రంలో నాణ్యమైన విద్య, ఉన్నత పరిశోధనలు చేయడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రం నైపర్.

- మొత్తం పోస్టుల సంఖ్య-10 (అసోసియేట్ ప్రొఫెసర్-3, అసిస్టెంట్ ప్రొఫెసర్-3, సిస్టమ్ ఇంజినీర్-1, సెక్షన్ ఆఫీసర్-1, అసిస్టెంట్ గ్రేడ్3 (అడ్మినిస్ట్రేషన్-1, అకౌంట్స్-1)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత మాస్టర్ డిగ్రీ/ఎం ఫార్మా లేదా ఎంఎస్ ఫార్మా, ఎంసీఏ, బీఈ, పీజీ, ఏదైనా బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణత.
- **ఎంపిక:** రాత పరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్
- **చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **వెబ్‌సైట్:**http://niperguwahati.ac.in

జిప్‌మర్‌లో ఎంబీబీఎస్ ప్రవేశాలు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (జిప్‌మర్) 2018-19 విద్యాసంవత్సరానికి ఎంబీబీఎస్ కోర్సు ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:


దేశంలోని ప్రతిష్ఠాత్మక వైద్య విజ్ఞాన సంస్థల్లో జిప్‌మర్ ఒకటి. ఈ ఇన్‌స్టిట్యూట్‌ను 1956లో స్థాపించారు. జిప్‌మర్‌కు పుదుచ్చేరితోపాటు, కరైకల్‌లో క్యాంపస్‌లు ఉన్నాయి. ఈ రెండు క్యాంపస్‌ల్లో కలిపి మొత్తం 200 సీట్లు ఉన్నాయి.

- **కోర్సు పేరు:** ఎంబీబీఎస్
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/సంస్థ నుంచి ఇంటర్ (ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ) లేదా 10+2లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉన్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. 2018 లో ఇంటర్ ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయస్సు:** 2018 డిసెంబర్ 31 నాటికి 17 ఏండ్లు నిండి ఉండాలి.
- **అప్లికేషన్ ఫీజు:** జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ. 3000/-, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 1200/-, పీహెచ్‌సీ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **ఎంపిక:** ఆన్‌లైన్ పరీక్ష (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్)

రాతపరీక్ష సిలబస్:

సబ్జెకు	ప్రశ్నలు
ఫిజిక్స్	60
కెమిస్ట్రీ	60
బయాలజీ	60
ఇంగ్లిష్ లాంగ్వేజ్ & కాంప్రహెన్షన్	10
లాజికల్ & క్వాంటిటేటివ్ రీజనింగ్	10
మొత్తం	200

- దేశవ్యాప్తంగా 120 కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ విధానం (సీబీటీ)లో రాతపరీక్ష నిర్వహిస్తారు.
- జూన్ 3న రెండు విడతలుగా (ఉదయం, మధ్యాహ్నం) 150 నిమిషాల్లో రాతపరీక్షను నిర్వహిస్తారు.



- ఆబ్జెక్టివ్ విధానంలో ఐదు విభాగాల నుంచి 200 ప్రశ్నలను ఇస్తారు.
- పరీక్ష పేపర్ ఇంగ్లిష్‌లో మాత్రమే ఉంటుంది. సంస్థ నిర్ణయించిన కనీస అర్హత మార్కులను సాధించాలి.
- ప్రతి ప్రశ్నకు 4 మార్కులు, తప్పు సమాధానానికి 1 మార్కును తగ్గిస్తారు.
- ఈ ఆబ్జెక్టివ్ రాతపరీక్ష ఇంటర్ స్థాయిలో ఉంటుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఏప్రిల్ 13
- **హాల్‌టిక్కెట్ డౌన్ లోడింగ్:** మే 21 నుంచి
- **జిప్‌మర్ ఎంబీబీఎస్ పరీక్షతేదీ:** జూన్ 3
- **కౌన్సెలింగ్ తేదీలు:** జూన్ 27 నుంచి 29 వరకు
- **వెబ్‌సైట్:** www.jipmer.edu.in

వెక్టార్ కంట్రోల్‌లో టెక్నీషియన్లు

పుదుచ్చేరిలోని వెక్టార్ కంట్రోల్ రిసెర్చ్ సెంటర్‌లో కింది ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

వెక్టార్ కంట్రోల్ అనేది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ పరిధిలో పనిచేస్తుంది.

- ప్రాజెక్ట్ టెక్నీషియన్లు - 11 పోస్టులు. (జనరల్ - 3, ఓబీసీ - 4, ఎస్సీ - 3, ఎస్టీ - 1)
- **అర్హతలు:** బీఎస్సీ/ఇంటర్ సైన్స్ సబ్జెక్టులు చదివి ఉండాలి. డిగ్రీ చదివిన వారికి మూడేండ్లు, ఇంటర్ చదివినవారికి రెండేండ్ల అనుభవం ఉన్నట్లుగా పరిగణిస్తారు.
- **వయస్సు:** ఇంటర్వ్యూ తేదీ నాటికి 28 ఏండ్లు మించరాదు
- **జీతం:** నెలకు రూ. 17,000/-
- ఈ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తారు.
- **వెబ్‌సైట్:** www.vcrc.res.in